ఆదివారం
నీ చూపుటద్దం తో చూపిస్తుంది వెలుగుల్లో సత్యం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 115 పేజీలు: 10+4 వెల: 6.50

యూనస్‌ను దించేందుకు ఆర్మీచీఫ్ కసరత్తు

8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు

5లో

# మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం



## గుజరాత్ పర్యటనలో పాక్‌పై ప్రధాని ఆగ్రహం

**దాహోద్(గుజరాత్),మే 26:** ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్‌కు మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చారు. దాహోద్ సభలో పాకిస్తాన్ చర్యలను చీల్చిచెండాడారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పిల్లల ముందు తండ్రిని దారుణంగా చంపి ఉగ్రవాదులు 140కోట్ల మంది భారతీయులకు సవాల్ విసిరారని అన్నారు. మోడీతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో పాకిస్తాన్‌కు చూపించామన్నారు. పహల్గామ్ దాడి దృశ్యాలు గుర్తుకు వస్తే ఇప్పటికి కూడా తన రక్తం మరిగిపోతోందని మోడీ పేర్కొన్నారు. భారత మహిళల సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రవాదులను మట్టిలో కలి పేసినట్టు ప్రకటించారు. పహల్గామ్ దాడికి భారత ప్రజలు కోరుకున్న రీతిలో ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పాక్‌లో 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భారత్ మహిళలకు హాని కలిగించేవారు లేదా ఉగ్రవాదాన్ని >>2

# మహానాడుకు అంతా రెడీ

నేడు మొదటిరోజు టిడిపి సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై ప్రధాన చర్చ

రెండోరోజు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా నివాళులు, ఇతర కార్యక్రమాలు

కడపకు చేరిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మరికొందరు మంత్రులు

పబ్బాపురంలో 101ఎకరాలలో సంబరాలు నిర్వహణ

చివరి రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగసభ


కడపలో మహానాడుకు ముస్తాబైన ప్రధాన వేదిక దృశ్యం

**కడప మే 26, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడును 43 సంవత్సరాల తరువాత కడపలో మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. నవాతో న భవిష్యత్ అన్న రీతిలో మూడు రోజులు జరగబోవు మహానాడు పండుగకు సర్వం సిద్ధం అయింది. గత వారం రోజులుగా మంత్రులు సభా ప్రాంగణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేశారు. మహానాడు సంబరం నేటి నుంచి ప్రారంభం అవుతుంది. కడప లో నిర్వహిస్తున్న మహానాడు సంబరం చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కడప ఇంచార్జీ మంత్రి సవిత, అన్నమయ్యజిల్లా ఇంచార్జీ మంత్రి జన్నార్దన్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య రెడ్డి, మాధవి రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మహానాడు ప్రాంగణం ఏర్పాట్లు పూర్తి చేశారు. మహానాడు సంబరాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారంరాత్రి కడపకు చేరుకోనున్నారు. తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ కుప్పం నుంచి కడపకు రాత్రి 9గంటలకు కడపకు చేరుకున్నారు. ఇప్పటికే మంత్రులు తరలి వచ్చారు. కడప నగరంతో పాటు >>2



# రిమాండ్‌కు కాకాణి

## నెల్లూరు సెంట్రల్‌జైలుకు తరలింపు

**నెల్లూరు క్రైమ్, మే 26, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డికి వెంకటగిరి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. పొదలకూరు మండలం పరిధిలోని రుస్తుం క్వారీలో అక్రమ మైనింగ్ తవ్వకం, ఈ తవ్వకాల కోసం గిరిజనల్ పై దౌర్జన్యం చేయడం వంటి సంఘటనలపై పోలీసులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో ఏ5గా ఉన్న కాకాణి గత రెండు నెలలుగా అజ్ఞాతంలో ఉంటూ న్యాయస్థానాల్లో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులోను ఆయనకు ముందస్తు బెయిల్ లభించకపోవడంతో ఇక ఆయన అరెస్టు తప్పదని భావించి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. గత నెల >>2

# జమిలి ఎన్నికలు సాధ్యమే


చెన్నైలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌తో ఎన్నోప్రయోజనాలు

దేశానికి, తమిళనాడుకు ఇది కొత్తకాదు..

చెన్నైలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల కలిగే ప్రయోజనా ఎన్నో ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తరచుగా ఎన్నికలు జరగడం వల్ల మన దేశం ఎన్నికల పనుల్లోనే కూరుకుపోతోందన్నారు.అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు నిరంతరం పనిచేయాల్సి వస్తోందన్నారు. ఎన్నికల ఖర్చుల వల్ల ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా ఎన్నికల ఖర్చు తగ్గించవచ్చు అన్నారు.ప్రజలకు మరిన్ని పథకాలు అమలు చేయవచ్చునని అన్నారు. చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేతలతో ఒకే దేశం, ఒకే ఎన్నిక( వన్ నేషన్ వన్ ఎలక్షన్) జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు, ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రధాని ఒక ఆలోచన చేస్తే అది దృష్టితో ఉంటుందన్నారు. వికసిత్ భారత్ 2047ఆశయాలు నేరవేరాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం ప్రజల్లో బలీయంగా వెళ్ళాలన్నారు.ఒకే దేశం ఒకే ఎన్నికపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని, కొందరు దీనిపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం తీసుకొచ్చి ఉంటే మద్దతు ఇచ్చేవారు. గెలిస్తే ఈవీఎం సూపర్ అని, ఓడిపోతే అక్రమాలు జరిగాయని అంటున్నారని ఆయన అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని కరుణానిధి మద్దతు ఇచ్చారు. కానీ స్టాలిన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో తమిళంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళ దేవుడు మురుగ స్వస్థలం తమిళనాడు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తమిళంలో మాట్లాడుతూ నేను పూజించే తమిళ దేవుడు మురుగ స్వస్థలం, మహాకవిస్వస్థలం, సిద్ధుల స్వస్థలం, నాకు చాలా ఇష్టమైన ఎంజిఆర్ స్వస్థలం. తమిళనాడుపై నాకు ఎప్పుడూ గౌరవం ఉంది అని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నవారు కరుణానిధి రాసిన నేంజుక్కు నీతి పుస్తకం చదవాలి. ఎందుకంటే కరుణానిధి ఆ పుస్తకంలో ఒకే దేశం ఒకే ఎన్నికకు మద్దతు ఇచ్చినట్లు రాశారు అని పవన్ కల్యాణ్ అన్నారు. హిమాలయ పర్వతాలు ఎలా తలవంచవో ప్రధానమంత్రి మోడీ సైతం ఎక్కడా తలవంచరు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన దేశ శక్తిసామర్థ్యాలను చాటిన ఘనత మన ప్రధానమంత్రిదే అని ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రధానికి ఎన్నడూ ఓట్లు వస్తాయా రావా అనేది ఆలోచన చేయలేదు. దేశ అభివృద్ధే లక్ష్యంగా కర్తవ్యనిర్వహణలో ఉన్నారు. ఇందుకు ప్రత్యక్ష తార్కాణం పి.ఎం-జన్‌మన్ కార్యక్రమం. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ >>2


యువకుల గల్లంతుపై ఆరా తీస్తున్న పోలీసులు

విహారంలో విషాదం

# గోదావరిలో 8మంది యువకులు గల్లంతు

శేరుల్లంకలో వేడుకకు వచ్చి నదీస్నానానికి వచ్చిన 11 మంది

గాలింపు చర్యలు ముమ్మరం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 26 ప్రభాత వార్త :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపంలో గోదావరి నదిలో పెను విషాదం చోటుచేసుకుంది. కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన పలు కుటుంబాలకు చెందిన 11మంది యువకులు నదిలో స్నానానికి దిగగా, దురదృష్టవశాత్తు ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల ప్రకారం, కాకినాడ, రామచంద్రపురం, మండపేట గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు శేరుల్లంకలో జరిగిన ఓ వేడుకకు వచ్చారు. వేడుక అనంతరం సరదాగా గడిపేందుకు 11 మంది యువకులు సమీపంలోని గోదావరి నదికి వెళ్లారు. నదిలో దిగిన కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు లోతు ఎక్కువగా ఉండటంతో వారు నీటిలో మునిగిపోయారు. ఈ దుర్ఘటనలో గల్లంతైన యువకులను కాకినాడకు చెందిన క్రాంతి (20), పాల్ (18), సాయి (18), సతీష్ (19) గా గుర్తించారు. అలాగే, ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన మహేష్, రాజేష్ (13), మండపేటకు చెందిన రోహిత్, మరియు శేరుల్లంకకు చెందిన మరో మహేష్ కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. ఈ విషయం తెలియగానే బాధిత కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఒక్కసారిగా ఇంతమంది యువకులు గల్లంతు కావడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శేరుల్లంక గ్రామంలో విషాదకరమైన వాతావరణం నెలకొంది. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా ఎస్.పి ముమ్మిడివరం సి.ఐ, ఎస్.ఐ ల పర్యవేక్షణలో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు మరియు సహాయక సిబ్బంది >>2

## యువకుల గల్లంతుపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విజయవాడ,మే26, ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపాన గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోదావరిలో స్నానానికి దిగి ఎనిమిది మంది యువకులు గల్లంతైన విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్‌తోఫోన్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడారు. గల్లంతైన యువకుల కోసం చేపట్టిన గాలింపు చర్యల గురించి సీఎంకు కలెక్టర్ వివరించారు. గల్లంతైన వారిని రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. >>2

## పూర్తి స్థాయి డిజిపిగా హారీష్‌కుమార్ గుప్తా



**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇన్‌చార్జీ డీజీపీగా వ్యవహరిస్తున్న హరీశ్‌కుమార్ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయన ఏపీ పూర్తి స్థాయి డిజీపీగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా జమ్మూకాశ్మీరుకుచెందిన వారు, ఖమ్మం ఏఎస్పీగా తన తొలి పోస్టింగ్ పొందారు. మెదక్, పెద్దపల్లిలో ఏఎస్పీగా >>2

# పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

థియేటర్లు మూసివేయడం జరగని పని

ఎపి మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు

తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు వివరణ


ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే26:** రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల యాజమాన్య సమస్యలు, బంద్ ప్రకటనల నేపథ్యంలో నెలకొన్న గందరగోళంపై ప్రముఖ నిర్మాతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ విషయమై జరుగుతున్న చర్చపై ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు, ఎగ్జిబిటర్, తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు వివరణ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినిమా రంగానికి అండగా ఉంటామని ప్రకటించిన ఎపి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు కృత జ్ఞతలు తెలిపారు. ఈ వివాదానికి ఆయన ఓ రకంగా ఫుల్ స్టాప్ పెట్టారని అన్నారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఓ ఇష్యూని కన్ క్లూజ్ చేయడం ఆనందంగా ఉందని, మినిస్టర్ ఇచ్చిన స్టేట్ మెంట్‌తో ఫుల్‌స్టాప్ పడిందని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 19న తూర్పు గోదావరిలోని పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్ >>2



# ఆసుపత్రికి వల్లభనేని తరలింపు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ నేత,మాజీ ఎంఎల్ఏ వల్లభనేని వంశీకి తీవ్ర అస్వస్థతతో ఇబ్బంది పడుతున్నారు.ఆయనను ఆయన పరిస్థితి ఎంత మాత్రం బాగాలేదని వంశీ బంధువులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో ఆయనకు ఉద్దేశపూర్వకంగా వైద్యం అత్యవసరంగా అందించాల్సి ఉందని వారు అంటున్నారు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య వంశీపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా వైద్యం అందించకుండా చేస్తున్నారని అభియోగించారు. విజయవాడ జీజీహెచ్‌ఈ క్రమంలో గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారాన్ని పోలీసులు మూసివేశారు. పోలీసుల హడావుడితో రోగులు,వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ వైపు ఉన్న ద్వారం నుండి రోగులను లోపలికి రావాలన్నారు. దీంతో నడవలేని పరిస్థితిలో చుట్టూ ఎలా తిరిగి రావాలని వారు వాపోతున్నారు. నకిలీ ఇళ్ళ పట్టాల కేసులో వల్లభనేని వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. శ్వాసకోస సంబంధిత సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతున్నారు. దీంతో కంకిపాడు ఆస్పత్రిలో వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు.

**కోర్టులో చుక్కెదురు:** వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టులో చుక్కెదురైంది. వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. వంశీ బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా వంశీ ఇదే కేసులో అరెస్టై విజయవాడ >>2

# వానొచ్చె.. వరదొచ్చె..



భారీ వర్షాలకు ముంబయిలో ఏరులైన వరద

నాలుగు రాష్ట్రాల్లో కుంభవృష్టి

మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడులో స్తంభించిన జనజీవనం

ముంబయిలో రెడ్ అలర్ట్, 'మెట్రో' స్టేషన్ నీట మునక




నీట మునిగిన ముంబయిలోని మెట్రో స్టేషన్

**ముంబయి, మే26:**మహారాష్ట్రలోని తీరప్రాంత జిల్లాలతోపాటు అర్బన్ జిల్లాలను కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. ఉరుములు మెరుపులతోపాటు తీవ్రస్థాయిలో ఈదురుగాలులు మహారాష్ట్ర ప్రజలను అతలాకుతలంచేస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి కొనసాగుతున్న వర్షాలు మహారాష్ట్ర రాజధాని ముంబయిని వరదలతోముంచెత్తాయి. ఇప్పటికే థాణె, రత్నగిరి, రాయ్‌గఢ్ జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీచేసింది. రాత్రికిరాత్రే కురిసిన భారీ వర్షం ముంబయిలోని లోతట్టుప్రాంతాలను ముంచివేసింది. కొన్ని సబర్బన్‌రైళ్ల రాకపోకలు నిలిచి పోయాయి. ఛత్రపతి శివాజి మహారాజ్ ఎయిర్ పోర్టునుంచివెళ్లే విమానసర్వీసులనుకూడా నిలిపివేసారు. స్పైస్ జెట్, ఇండిగో సంస్థలు తమతమ ప్రయాణీకులకు సందేశాలు పంపించాయి. >>2



సోమవారం కర్ణాటకలో భారీ వర్షం



సోమవారం తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఎడతెరిపిలేని వాన దృశ్యం

# వానొచ్చె.. వరదొచ్చె..

>> నారిమన్ పాయింట్‌నుంచి లోతట్టుప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షం నీరునిలిచిపోయింది. ఆరునుంచి ఏడు గంటలకే 40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గ్రాంట్‌రోడ్‌లో 36 మిల్లీమీటర్లు, కొలాబాలో 31 మిల్లీమీటర్లు, బైకుల్లాలో 21 మిల్లీమీటర్లు వర్షంకురిసింది. ముంబయి, కొంకణ్ ప్రాంతాల్లో మరింత భారీ ఎత్తున వర్షం కురుస్తోంది. వొర్లిలోని భూగర్భ మెట్రోప్రాంతం మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా చుట్టుముట్టాయి. రానురాను ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంటకు 50నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కొన్ని జిల్లాలను చుట్టుముట్టాయి. పూణె, సతారా, సింధుదుర్గ్, పాల్ఘర్, థాణె, రాయ్‌గడ్, రత్నగిరిజిల్లాల్లో భారీవర్షాలు కురిసాయి. అహిల్యానగర్, కొల్హాపూర్, సాంగ్లి, సోలాపూర్, లాతూర్‌జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీవర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయికి నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుండగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. అతర్వాత 1962, 1971లో ఇదే రోజుల్లో వచ్చినట్లు పేర్కొంది. ఇకపోతే కర్ణాటక కోస్తా జిల్లాల్లో కూడా భారీ వర్షం కురిసింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలనురంగంలోకి దింపింది. ఐదురోజులపాటు కర్ణాటక కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇక తమిళనాడులోని వాతావరణకేంద్రం ఇప్పటికే నీలగిరి హిల్స్‌కు రెడ్ అలర్ట్ జారీచేసింది. కోయంబత్తూరు ప్రాంతంలో కూడా ఇదే విధంగా భారీ వర్షాలు కురుస్తాయి. 28వ తేదీవరకూ ఇదే తీరు ఉంటుందని పశ్చిమఘాట్ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించినట్లు వాతావ రణకేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉయితే తప్ప ఇళ్లనుంచి బయటకి రావద్దని హెచ్చరికలు జారీచేసింది. ఆదివారంనా కేరళలోని 11 జిల్లాల్లోకూడా రెడ్ అలర్ట్ జారీ అయింది. కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిశూరు, పాలక్కడ్, మలప్పురం, కోజికోడ్, వాయనాడు, కన్నూరు, కాసరగోడ్ జిల్లాలకు రెడ్‌అలర్ట్‌జారీచేసారు. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసారు. దక్షిణాదిలో ఈ ప్రాంతం ఈ వేసవిలో అత్యంత వేడి, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుచేసింది. రానురాను వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీనితో ఈప్రాంతంలో ఇప్పటికే సగటు వార్షిక వర్షపాతంలో 80శాతం నమోదయినట్లు వాతావరణశాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.

## అభివృద్ధిపనులపై ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**కుప్పం, మే 26 ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం చంద్రబాబునాయుడు జిల్లా ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్ వద్ద సిఎం చంద్రబాబునాయుడు తన కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కుప్పంతోపాటు జిల్లాలో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సిఎం సూచించినట్లు తెలిసింది.

## రిమాండ్‌కు కాకాణి

>> నాలుగవ తేదీ నుండి పోలీసులు ఆయన కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు బెంగుళూరు శివార్లలో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆయనను వెంటనే నెల్లూరులోని పోలీస్ శిక్షణ కేంద్రానికి తీసుకువచ్చి జిల్లాకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అనంతరం సోమవారం ఉదయం కాకాణిని ప్రత్యేక బందోబస్తుతో వెంకటగిరి కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో వాదన అనంతరం న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డికి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పోలీసు అధికారులు, సిబ్బంది ఆయననెల్లూరుకేంద్రకారాగారానికి తరలించారు.

**అరెస్ట్ అక్రమం.. వైసీపీ నేతలు:** కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ప్రభుత్వం నమోదు చేయించిన కేసు అక్రమమని, ఆయన్ను అన్యాయంగా ఇరికించారని ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసిపి నేతలు ఆరోపించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేసిన మొదలు కోర్టు తీర్పు వెలువడిన అనంతరం జైలుకు తరలించేంతవరకు ఆయన అభిమానులు వైసిపి కార్యకర్తలతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులందరూ అన్నిచోట్ల ఆయన వెంట ఫాలో అయ్యారు. ఈ సందర్భంగా పలుచోట్ల వారు విలేకరులతో మాట్లాడుతూ ఏ 1 నుండి ఏ 4 వరకు ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్నవారందరికీ న్యాయస్థానాలు బెయిలు మంజూరు చేశాయని, ఏ 5 గా కాకాణి గోవర్ధన్ రెడ్డికి మాత్రం ప్రభుత్వం కొట్టపల్లి బెయిలు రాకుండా చేసిందని ఆరోపించారు. కాకాణిని జైలు లోపలికి తరలించే సమయంలో జైలు వద్ద ఆయన అనుచరులు, వైసీపీ నాయకులతో ఉద్రిక్తత వాతావరణం కనబడింది.



సోమవారం శివపురం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

## ప్రజలనుంచి వినతులు స్వీకరించిన సిఎం చంద్రబాబు

**శాంతిపురం, మే 26 ప్రభాతవార్త:** మూడు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం శివపురం వద్ద ఉన్న తమ నివాసం వద్ద ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు వింటూ వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. అనంతరం 10.50గంటలకు ద్రవిడ వర్సిటీలో హెలిప్యాడ్‌కు రోడ్డుమార్గంలో బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, స్థానిక నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, బాలు, రమేష్, జయరాంరెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రమంతా వర్షాలే

**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాలు కేరళతో పాటు గోవా,కర్నాటక, మహారాష్ట్ర,మిజోరాం,మణిపూర్,నాగాలాండ్ లోని మరి కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రాగల మరికొద్ది గంటల్లో రాయలసీమను నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణం విభాగం (ఐఎండీ) తెలిపింది. దాంతో రానున్న మూడు రోజుల పాటు ఏపీలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ఆవర్తనం,ద్రోణి ప్రభావంతో ఇప్పటికే ఉత్తర కోస్తా జిల్లాల్లో వానలు,ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. వారం రోజుల ముందుగానే ఏపీకి రుతుపవనాలు వస్తున్నాయి. మహారాష్ట్ర లోని రత్నగిరి సమీపంలో తీరం దాటిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది.ప్రస్తుతం మహారాష్ట్ర,కర్నాటక పరిసరాల్లో కొనసాగుతోన్న అల్పపీడనం...క్రమంగా తూర్పు దిశగా పయనించి ఈ రోజుకి మరింత బలహీన పడుతుందని ఐఎండీ పేర్కొంది. ఇక మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రాబోయే 4 రోజుల్లో కోస్తాంధ్ర,రాయలసీమ,తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.ఈ నెల 27 నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్ని ప్రాంతాల్లో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బలమైనఈదురుగాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్లతో వీచే అవకాశంఉంది.రాగల 7రోజుల్లోగరిష్ట ఉష్ణోగ్రతలు3 నుంచి5 డిగ్రీలు తగ్గే అవకాశం ఉంది.

# మహానాడుకు అంతా రెడీ

>> జెండాలు, తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో పసుపుమయమైంది. ఎటు చూసినా జెండాలు రెపరెపలాడుతూ పసుపు రంగులో కనిపిస్తోంది. కడప నగరంలోనే పబ్బాపురం సమీపంలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు ప్రాంగణం ఏర్పాటు చేసి మూడు రోజుల పండుగ నిర్వహిస్తున్నారు. చివరి రోజు 29న జరుగు భారీ బహిరంగ సభకు 5 లక్షల మందికి పైగా తరలివస్తున్నట్లు మంత్రులు తెలిపారు. గతంలో జరిగిన మహానాడుకు, ఇప్పుడు జరుగుతున్న మహానాడుకు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, పొల్లా రవీంద్ర, నారాయణ, నిమ్మల రామానాయుడు, పార్థసారధి, వాసిరెడ్డి సుభాష్‌తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తరలివచ్చారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన నేతలు, మంత్రులు మహానాడుకు సంబంధించి విజయవంతం చేసేందుకు భారీగా జనాభాను సమీకరించేందుకు బాధ్యతలు ఆయా పార్టీ నాయకులకు సమీక్షలో అప్పజెప్పడం జరిగింది. ఈ మహానాడులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 10 మంది ఎస్పీలు, 5వేల మంది సిబ్బంది, 150 సిసి కెమెరాలు, డ్రోన్ల సహకారంతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మొదటి రోజు మంగళవారం ఉదయం ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభం కానుంది. తరువాత ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళితో మహానాడు ప్రారంభం కానుంది. 12 గంటలకు ముఖ్యమంత్రి ఉపన్యాసం చేస్తారని మంత్రులు తెలిపారు. రెండవ రోజు ప్రతినిధుల సభతోపాటు పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 152 జయంతి సందర్భంగా నివాళులు అర్పించి, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మాణంపై చర్చించి ఆమోదించనున్నారు. ఈ రెండు రోజులు జరుగు సభకు సుమారు 20 వేల మంది హాజరవుతారని వారు తెలిపారు. సభా వేదిక 450 మంది కూర్చునేలా వారు నిర్మాణం చేపట్టారని తెలిపారు. చివరి రోజు 29వ తేది 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఇది చరిత్రలో నిలబడిపోయే విధంగా ఉండిపోతుందన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వాహనాలలో కడపకు చేరుకుంటున్నారు. ఎవరికి ఎలాంటిఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టామని మంత్రులు తెలిపారు. రోజువారి కార్యక్రమాలలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానికనాయకులతో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాయలసీమ వంటలతో భోజనవసతి కల్పించామన్నారు. రాయలసీమ అభివృద్ధితోపాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు వారు తెలిపారు.ఈ సభావేదిక ద్వారా రాయలసీమ అభివృద్ధి బాట పడుతుందన్నారు. మహానాడు మూడు రోజుల పండగ చరిత్రలో నిలబడే విధంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహానాడు కార్యక్ర మానికి ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ఆ పార్టీ నాయకులు, అభిమానులు తరలిరానున్నారు.



మహానాడు ప్రాంగణం వద్ద పోలీసు బందోబస్తు

## ఆసుపత్రికి వల్లభనేని తరలింపు

>> జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

**పోలీసుల కస్టడీ పిటిషన్:** మరోవైపు ఇదే కేసులో వల్లభనేని వంశీని కస్టడీకి కోరుతూ హనుమాన్ జంక్షన్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. మరో 2 రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ నూజివీడు కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

# మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం

>> వ్యాప్తి చేసేవారు మట్టిలో కలవాల్సిందేనని వార్నింగ్ ఇచ్చారు. పహల్గామ్ ఘటన దేశాన్ని కదిలించింది. కఠినమైన చర్య తీసుకోవాలని అంతా డిమాండ్ చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏప్రిల్ 22న, దాడి చేసిన వారిని ఆపరేషన్ సిందూర్‌తో మట్టిలో కలిపేశామన్నారు. పాకిస్తాన్ ఏకైక లక్ష్యం భారత్‌ను ద్వేషించడం. మనకు హానికలిగించాలన్న మార్గాలపైనే ఆలోచిస్తోందని మండిపడ్డారు. కానీ మన దేశం మాత్రం దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి ఆర్థికవృద్ధి సాధించే లక్ష్యంతోముందుకువెళుతున్నదన్నారు. దహోద్‌లో రూ.24వేలకోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు.

**మే 26.. చాలా ముఖ్యమైన రోజు:** 11 ఏళ్ల క్రితం 2014లో ఇదే రోజు ప్రధాని పగ్గాలు చేపట్టానని ప్రధాని మోడీ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణంలో మే 26ని ఒక ముఖ్యమైన రోజని పేర్కొన్నారు. 2014లో ఇదే తేదీన తాను తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ రోజు మే 26. 2014లో ఇదే తేదీన, నేను మొదటిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని మొదట, గుజరాత్ ప్రజలు నన్నుఆశీర్వదించారు, తరువాత కోట్లాది మంది భారతీయులు నన్ను ఆశీర్వదించారు. అంటూ మోడీ పేర్కొన్నారు. వడోదర తర్వాత దాహోద్‌కు వెళ్లిన ప్రధాని, భారతీయ రైల్వేలకు కొత్త గిఫ్ట్ ఇచ్చారు. దాహోద్‌లో రైలు ఇంజిన్ల తయారీ కర్మాగారాన్నిదేశానికి అంకితం చేశారు ప్రధాని మోడీ. ఈ ప్లాంట్‌లో తయారైన తొలి ఎలక్ట్రిక్ రైల్ ఇంజిన్‌కు ప్రధాని పచ్చజెండా ఊపారు. భారతీయ రైల్వేల లోడింగ్ కెపాసిటీ ఈ రైలు ఇంజిన్లు పెంచబోతున్నాయన్నారు. మూడేళ్లక్రితం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపనచేసానని, ఎన్నో విమర్శలుచేసారని, ఎన్నికల సమయం కాబట్టి ప్లాంట్‌కు పునాదివేసారని, ఏనిర్మాణాలు చేపట్టరని విమర్శించారని, కానీ ఇపుడు లోకోమోటివ్ తయారయిందని అది మనకు విమర్శలు చేసినవారికి కూడా కనిపిస్తోందన్నారు. ఇక్కడ 9000 హార్స్‌పవర్ సామర్థ్యమున్న ఎలక్ట్రిక్ రైలు ఇంజిన్ల ఉత్పత్తి చేస్తారు. మొత్తం 80వేల కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు.

## గోదావరిలో 8మంది యువకులు గల్లంతు

>>కూడా గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. అయితే, చీకటి పడుతుండటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ దుర్ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒకేసారి ఎనిమిది మంది యువకులు నీటిలో మునిగిపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదిలో ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇది మొదటిసారి కాదని స్థానికులు అంటున్నారు. నదిలో లోతు ఎక్కువగా ఉండటం మరియు సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మరియు స్థానిక అధికారులు గల్లంతైన యువకుల ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రేపు ఉదయం వెలుగు వచ్చాక గాలింపు చర్యలు మరింత ముమ్మరం చేసే అవకాశం ఉంది. ఈ విషాదకరమైన ఘటనతో ఆ ప్రాంతంలో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. గల్లంతైన వారి కుటుంబాలకు గ్రామస్థులు మరియు బంధువులు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

>> బాధిత కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం సూచించారు. **హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి:** నీటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికా రులకు సీఎం పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని నీటి వనరులు ఉన్న అన్ని ప్రాం తాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీటి కుంటలు, చెరువులు వంటి ప్రాంతాలను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయా లన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు కనిపించక పోయినా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

## పూర్తి స్థాయి డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా

>>సేవలందించారు.కృష్ణా,నల్గొండ జిల్లాల ఎస్పీగా ఆయన పనిచేసారు. ప్రజా ఫిర్యాదులపై ఆయన స్వయంగా స్పందించేవారు.ఎస్ఐలు, సీఐలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారి ప్రజా ఫిర్యాదు మేరకు విచారించి కఠిన చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు రెంజీ ఐజీగా, శాంతి భద్రతలు విభాగంబ, ప్రోవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ,అదనపు డీజీపీగా పని చేసారు. 2022 మే నుంచి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. జనవరి31న అప్పటి డీజీపీ ద్వారకా తిరమలరావు పదవి విరమణ చేసారు. దాంతో ఇన్ చార్జి డీజీపీగా హరిశీకుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. తాజాగా పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

## సౌర విద్యుత్తును ప్రోత్సహించడానికి సమగ్ర విధానం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** సౌర విద్యుత్ ద్వారా దేశం 2030 నాటికి 500 గిగా వాట్ల స్వదేశీ తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడానికి ఒక సమగ్ర విధాన చట్టాన్ని అభివృద్ధి చేసిందని అన్నారు. ఇది ఫలితాలను ఇస్తూ మన రాష్ట్రం భారతదేశపు సౌర తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుండటం సంతోషంగా ఉందని అన్నారు. తాము రాష్ట్రానికి మరిన్ని తయారీదారులను తీసుకువచ్చి, దేశ పర్యావరణ పరివర్తనను నడిపించటంతో పాట ప్రజలకు లక్షలాది ఉద్యోగాలను కూడా సృష్టిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

తేది : 27-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు,
అమావాస్య ఉ.8.33
శుక్ల పాడ్యమి తె.5.03
రోహిణి రా.2.51
వర్జ్యం ఉ.7.55-9.21
దు.ఉ.8.11-9.03, 2) రా.11.48-12.40
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**వృషభం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. విందు వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** అనుకోని ఖర్చులు పెరుగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**సింహం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడుతాయి. ఋణబాధలు తప్పవు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** ప్రయాణాలు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వస్తు సేకరణ.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో నిదానం అవసరం.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** సంఘంలో ఆదరణ పొందుతారు. బాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** అనుకోకుండా వచ్చిన అవకాశాలు చేజారతాయి. ఖర్చులు పెరుగుతాయి. ఋణవత్తిడులు తప్పవు.

**మీనం :** భూవివాదాలు తీరిన తన ఒప్పందాలు కుదురుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జమిలి ఎన్నికలు సాధ్యమే

>> (గ్రూప్స్ (పి.వి.టి.జి.) ఉండే ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించగలుగుతున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విషయానికి వస్తే పి.ఎం.- జన్ మన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.555.61 కోట్ల నిధులతో 612.72 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తున్నాము. ఇవన్నీ పి.వి.టి.జి. ఆవాసాలను అనుసంధానించే రహదారులే. వీటి ద్వారా ఏడు జిల్లాల్లో 239 పి.వి.టి.జి. ఆవాసాలకు రహదారులు ఏర్పరచగలుగుతున్నాము. ఓట్లు కోసం చూస్తే... 239 ఆవాసాలకు రహదారులు మూలంగా సుమారు 50 వేల మందికి రోడ్డు సౌకర్యం వస్తుంది. వారు మనకు ఓట్లు వేస్తారా లేదా అనే ఆలోచన ఎక్కడా చేయలేదు మన గౌరవ ప్రధాన మంత్రి. అదే మొత్తాన్ని ఓట్లు వస్తాయి అనే చోట వెచ్చించవచ్చు. ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందాలి అనే ఉద్దేశంతో మోడీ ముందడుగు వేస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర క్యాబినెట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలియచేసింది. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారికి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ మూడు నెలలపాటు రాష్ట్రంలో పర్యటించి రూపొందించిన నివేదికను అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాము. ఆపరేషన్ సిందూర్, అందుకు దారి తీసిన పరిస్థితులు చాలా క్లిష్టమైనవి. ఇటువంటి దశలో కూడా ప్రజల రక్షణతోపాటు వారి భవిష్యత్తు కోసం ప్రధానమంత్రి ఆలోచన చేశారు. కుల గణన చేపట్టడం అనేది ఎంతో అవసరం. దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవనం, వృత్తులు, స్థితిగతులు తెలుస్తాయి. వారికి జీవనోపాధుల మెరుగుదలకు ఏ విధమైన చర్యలు చేపట్టాలి, ఏ పథకాలు తీసుకురావాలో పాలన వర్గాలకు ఒక స్పష్టత వస్తుంది" అన్నారు.1952- 67 వరకు దేశంలో ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్ఆర్ విచారణ రెండో రోజు పూర్తి, ముగిసిన కస్టడీ

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో నిందితుడు ఐపిఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును పోలీసులు రెండో రోజు విచారించారు.కోర్టు పీఎస్ఆర్‌ను పోలీసు కస్టడీకి రెండు రోజుల పాటు అనుమతినిచ్చింది.. పీఎస్ఆర్ ఆంజనేయులుకు సోమవారం కస్టడీ ముగిసింది.రెండు రోజుల పోలీసు కస్టడీలో పీఎస్ఆర్ ఆంజనేయులు ఏ మాత్రం సహకరించలేదని అధికారులు అంటున్నారు.ఆయన ప్రతి విషయాన్ని దాటవేసారని తెలిపారు.ఈ రోజుతో ఆయన కస్టడీ ముగిసినందున ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరిపించి,కోర్టు హాజరు పరుస్తామని,తరువాత సబ్ జైలుకు పంపిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఏ2 మధుసూధన్‌ను కూడ పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం.విచారణఅనంతరం పీఆర్ఎస్ఏతో పాటుగా విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. వీరిద్దరిని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు అధికారులు ప్రశ్నించారు. వారిని రాత్రి సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. పీఎస్ఆర్ ఆంజనేయుల్ని సుమారు 30కి పైగా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. దేనికి వారి నుంచి బదులు రాలేదంటున్నారు. కనీస సాక్ష్యాధారాలు లేకుండా మీడియా కథనాలు ఆధారంగా తమను అరెస్ట్ చేసారని వారిద్దరు విచారణ సందర్భంలో ఆరోపించారంటున్నారు.విచారణాంశాలను పోలీసులు వెల్లడించాల్సి ఉండగా ఊహాజనీతంశాలు బయటకు వస్తున్నాయని పీఎస్ఆర్ ఆంజనేయుల్ని పోలీసులను ప్రశ్నించినట్లు సమాచారం.

# పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

>> ఏర్పాటు చేసుకున్న మీటింగ్ లో పర్సంటేజ్ విధానంలో ఆడితే తమకు బాగుంటుందని థియేటర్ ఓనర్స్ చెప్పారు. ఇవాళ యేడాదికి 150 సినిమాలు విడుదలైతే, 90 శాతం పర్సంటేజ్ సిస్టమ్‌లోనే ప్రదర్శితమోతున్నాయి. కొన్ని సినిమాలే రెంట్ లేదా పర్సంటేజ్‌కు ఆడుతున్నాయన్నారు. ఆ విషయంలోనే ఎగ్జిబిటర్స్ అభ్యంతరం చెబుతున్నారు. ఈస్ట్ గోదావరి ఎగ్జిబిటర్స్ తమ నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని ఎగ్జిబిటర్స్‌కు తెలిపారు. దీనిపై ఏప్రిల్ 26న జరిగిన గిల్డ్ మీటింగ్‌లో మేం చర్చించాం. ఆరు నెలల పాటు వారి ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని నిజంగా నష్టం వస్తోందనిపిస్తే, తప్పకుండా వారికి సాయం చేద్దామని మేం అనుకున్నాం. సహజంగా పెద్ద సినిమాలకు మొదటివారం రెంట్ ఇస్తున్నాం. ఆ తర్వాత పర్సంటేజ్ ఇస్తున్నాం. ఇది కొందరు ఎగ్జిబిటర్స్‌కు నచ్చడం లేదు. మేం ఈ విషయాల గురించి గిల్డ్‌లో మాట్లాడే సమయానికి 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ కాలేదు. కాబట్టి ఇది ఆ సినిమా వ్యతిరేకంగా జరిగిన నిర్ణయం అనేది కరెక్ట్ కాదు. ఇక థియేటర్ల విషయానికి వస్తే... నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ ఉంటే మాకు, మా మిత్రులకు కలిపి 30 థియేటర్లు ఉన్నాయి. ఏసియన్ ఫిలిమ్స్ సునీల్ నారంగ్, సురేశ్ బాబుకు వాళ్లకు 90 ఉన్నాయి. మిగిలిన వాటిని ఓనర్స్ లేదా వారి సంబంధీకులు నడుపుతున్నారు. మా గిల్డ్ మీటింగ్ తర్వాత తెలంగాణలోని సింగిల్ థియేటర్స్ ఓనర్స్ కూడా పర్సంటేజ్ గురించి శిరీష్‌ను అడిగారు. అతను నా దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే... మే 18న ఎపి, తెలంగాణ ఎగ్జిబిటర్స్ మీటింగ్ పెట్టుకున్నారు. ఆ మీటింగ్ చివరిలో నేను వెళ్లాను. ఆ రోజున మీటింగ్‌లో ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండానే 'జూన్ 1 నుండి థియేటర్స్ బంద్' అనే ప్రచారం మీడియాలో మొదలు పెట్టారు. నిజానికి ఆ సమస్యను ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లమని చెప్పాను. ఎగ్జిబిటర్స్ కూడా త్వరలో జరుగబోయే జాయింట్ కమిటీ మీటింగ్‌లో తమకు అనుకూలంగా నిర్ణయం రాకపోతేనే థియేటర్లు బంద్ చేస్తామని చెప్పారు. కానీ అప్పటికే ఓ నిర్ణయం తీసుకున్నట్టుగా తప్పుడు ప్రచారం అంతటా జరిగిపోయింది. అయితే ఆ తర్వాత నిర్మాతలు, పంపిణీ దారులు జరుపుకున్న మీటింగ్‌లో థియేటర్ల బంద్ చేయకూడదనే నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిటర్స్‌తో చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకుందామని భావించారు. ఈ నెల 30న జరిగే ఛాంబర్ ఇసి మీటింగ్ ఓ కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటారు' అని దిల్ రాజు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో అనవసరంగా 'హరిహర వీరమల్లు' మూవీని లాగారని దిల్ రాజు వాపోయారు. కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని తెలిపారు. సినిమా వాళ్లకు రెండు ప్రభుత్వాలతో పని ఉంటుందని, ఎపిలో ప్రభుత్వం మారిన తర్వాత సినిమా వాళ్లకు చాలా చక్కని యాక్సెస్ లభించిందని ఆయన అన్నారు. ఉత్తరాంధ్రలోనూ తనకు ఇరవై థియేటర్లు ఉన్నాయని చెప్పారు. సినిమా రంగానికి ప్రభుత్వాలతో ఖచ్చితంగా పని ఉంటుందని, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు అండగా ఉండాలని కోరుకుంటామని అన్నారు. కొందరు ఆయనకు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే పవన్ కల్యాణ్ కోపానికి గురయ్యారని అన్నారు. ఒకవేళ ఆయన తిట్టినా పడతామని, పెద్దన్న స్థానంలో ఉన్న ఆయనకు ఆ హక్కు ఉందని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలో ఏకాభిప్రాయం లేని కారణంగానే చాలా సమస్యలు వస్తున్నాయని, తమ గిల్డ్ లోనే కాకుండా... ప్రతి చోట ఈ సమస్య ఉందని దిల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నిర్మాతలు సైతం గేమ్ ఛేంజర్ పైరసీని నేనే చేశానంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారని, ఎవరైనా తమ సినిమాను తాము చంపుకుంటారా అని దిల్ రాజు అన్నారు.

**ఆస్కార్ నటులు అంటూ బండ్ల గణేశ్ సెటైర్**

అయితే, దిల్ రాజు మీడియా సమావేశం జరుగుతున్న సమయంలోనే మరో ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'ఆస్కార్ నటులు, కమలహాసన్లు ఎక్కువైపోయారు. వీళ్ల నటన చూడలేకపోతున్నాం' అంటూ బండ్ల గణేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, దిల్ రాజు ప్రెస్ మీట్ జరుగుతున్న తరుణంలో ఈ ట్వీట్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. బండ్ల గణేశ్ వ్యాఖ్యలు దిల్ రాజును ఉద్దేశించే కావొచ్చని పలువురు సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు.

## ప్రభుత్వం సంవత్సర పాలన కానుకగా ప్రజలపై 784 కోట్ల ఆస్తి పన్ను - సిపిఎం



చంద్రబాబు ప్రభుత్వ ఏడాది పాలనలో ఆస్తిపన్నుపై సీపీఎం నాయకులు డాక్కుమెంట్ ఆవిష్కరణ

**విజయవాడ.మే26,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన పూర్తి సందర్భంగా పట్టణ ప్రజలపై 784 కోట్ల రూపాయల ఆస్తి పన్ను(ఇంటి పన్ను) పెంపు కానుకగా ఇస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ఆస్తి పన్నుల సర్వేపై విజయవాడలోని శ్రీశ్రీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పన్నుల బాదుడులో వైసిపి ప్రభుత్వ దారిలోనే కూటమి ప్రభుత్వం ప్రయాణిస్తుందని విమర్శించారు. 123 నగరాలు, పట్టణాలలో 40 లక్షల గృహాలకు పన్ను పెంచటానికి ఇంటింటికి సర్వే ప్రారంభం అయిందని ఆయన పేర్కొన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పెట్టిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అనధికార కట్టడాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై 100 పెనాల్టీ విధించిందని ఆగ్రహించారు. ఒకవైపున 15,485 కోట్ల రూపాయల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం, మరోవైపు ఇంటి పన్ను భారం వేస్తుందని మండిపడ్డారు. పట్టణాలలో మంచినీరు, డ్రైనేజీ పారిశుధ్యం, రోడ్లు తదితర సదుపాయాల కల్పనను విస్మరించి, నెల రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పన్నులు పెంచడానికి సర్వే చేపట్టడం దుర్మార్గమన్నారు. మేయర్లు, చైర్మన్ ల పదవుల కోసం ఫిరాయింపులు, బెదిరింపులకు పాల్పడడంపై దృష్టి తప్ప పట్టణ ప్రజల సదుపాయాల కల్పనపై కూటమి పార్టీలకు దృష్టి లేదన్నారు. అదానీ ఇతర కార్పొరేట్ కంపెనీలకు ఆస్తి పన్ను పూర్తిగా రద్దు చేస్తూ రాయితీలు ఇస్తూ, పేద మధ్యతరగతి ప్రజలపై ఇంటి పన్నుల భారాలు శోచనీయమన్నారు. మహానాడులో టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు విద్యుత్ భారాలు, ఇంటి పన్నుల పెంపును చర్చించాలని, రద్దు చేయాలన్నారు. ఇంటి పన్ను పెంపు కొరకు సర్వే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా పౌర సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు!

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనిపై ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జిల్లా పేరు మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కడప జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం కడప పేరును తొలగించి వైఎస్సార్ జిల్లాగా పరిగణించడంపై గతంలో ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తాయి. పేర్ల పిచ్చితో మార్పు: గతంలో జిల్లాలో ప్రతిపక్ష నేత హోదాలో పర్యటించిన సీఎం చంద్రబాబు పేరు మార్పుపై హామీ ఇచ్చారు. మంత్రి సత్యకుమార్ సైతం పేరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. పేర్ల పిచ్చితో మాజీ సీఎం జగన్ కడప అనే పదాన్ని లేకుండా వైఎస్సార్ జిల్లాగా మార్చడాన్ని తప్పుబట్టారు. ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు రావడంతో వైఎస్సార్ కడప జిల్లాగా నామకరణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయానికి వచ్చి పేరు మార్పుపై నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు ఇచ్చింది.

# తిరుమల సమాచారం

## పలకరించిన 'నైరుతి'! - చల్లబడిన తిరుమల



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతిరుతుపవనాలు సకాలంలో రావడంతో మేనెలలో ఎండవేడినుండి ఉపశమనం కల్పిస్తూ వరుణదేవుడు సోమవారం మద్యాహ్నాం తిరుమలను పలకరించాడు. మోస్తరుగా కురిసిన వర్షంతోభక్తులు పులకించారు. అసలే మండుతున్న ఎండలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంమేఘావృతమై చల్లటిగాలులు వీయడంతో రెండురోజులుగా ఆకాశంలో వాతావరణంలో మార్పులు రావడంతో వర్ష రూపంలో ప్రభావం చూపింది. తిరుమల కొండపై, తిరుపతిలోనూ సుమారు పదినిమిషాలు పాటు మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం కురిసిన వర్షంతో భక్తులు ఆలయంలోపలకు, వెలుపలకు తడుస్తూ సేదదీరారు.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.11లక్షలు విరాళం



**తిరుమల,మే 26ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమలతిరుపతి దేవస్థానమ్ నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు సమర్పిస్తున్నారు. సోమవారం ఉదయం అమెరికా టెక్సాస్‌కు చెందిన వేదాల రంగనాథ్, కృష్ణకుమారి టిటిడి ట్రస్టులకు 11లక్షలు రూపాయలు డిడిలను విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాల్లో ఎస్వీ అన్నదానంకు 10లక్షలు, ఎస్వీగోసంరక్షణకు ఒకలక్ష డిడిలను టిటిడిఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందించారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి:తిరుమలలో ప్రముఖులు

**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని పలువురు ప్రముఖులు వేడుకున్నారు. సోమవారం ఉదయం మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాధ్‌రాయ్, ఏపి హైకోర్టు జడ్జి జస్టిస్ టిసిడి శేఖర్, కర్నాటక లోకాయుక్త జస్టిస్ బిఎస్ పాటిల్, మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్, సినీనటి సురేఖవాణి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రికార్డుస్థాయిలో వెంకన్న దర్శనాలు



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవుల రద్దీ తిరుమలలో కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం ఒక్కరోజే 91,538మంది భక్తులకు రికార్డుస్థాయిలో శ్రీవారి దర్శనం కల్పించారు. అంతేగాక శనివారం రోజు కూడా 90,211మంది భక్తులకు రికార్డుస్థాయిలో టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. గతంలో 2014-15లో 91వేలమంది దాటినా గత ఐదేళ్ళలో వేసవిసెలవుల్లో ఇంతమందికి దర్శనం చేయించడం రికార్డుగా నమోదైంది. అందరి భక్తులకు సంతృప్తికరంగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేయించారు. మరోవైపు వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం...వారాంతం సెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. ఆది,సోమవారాల్లో కూడా తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇదిలా ఉండగా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ఈనెల 24రోజుల్లో 51లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ జరిగింది. ప్రతిరోజూ సగటున 2.5లక్షల అన్నప్రసాదాలు, 90వేలకుపైగా అల్పాహారాలు, పానీయాలు అందిస్తున్నారు. శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నదానభవనంలో 93,950మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత మూడురోజుల్లో 3.32లక్షమంది భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు.

## మొదటిఘాట్‌లో చిరుత సంచారం



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండల్లో చిరుతల సంచారం మళ్ళీ భయంగొల్పిస్తోంది. సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఓ చిరుతపులి ఏకంగా దిగువఘాట్‌లో (మొదటి)వినాయకుడిగుడి వద్ద రక్షణగోడపై కూర్చుని ఉండటం, వాహనాల రాకతో వెలుతురుఫోకస్‌కు గోడపై వెళ్ళడం జరిగింది. మొదటిఘాట్‌రోడ్డు దాటడాన్ని వాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.చిరుతపులి సంచారంతో భక్తులు భయపడుతున్నారు.

# గుంటూరు-గుంతకల్లు మధ్య పూర్తైన డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు పనులు

**గుంతకల్లు రైల్వే,మే 26,ప్రభాతవార్త** తూర్పు-నైరుతీలను కలిపే రైలు మార్గంలో అంతర్భాగమైన రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలో నం ద్యాల- గాజులపల్లి-దిగువమెట్ట సెక్షన్ మినహా మిగిలిన సెక్షన్‌లలో డబ్లింగ్ రైలు మార్గం



నల్లమల అడవుల్లో రైలు మార్గం(ఫైల్)

పూర్తయ్యింది. 2018నుండి పనులు ప్రారంభమైన ఈ మార్గాన్ని 23దశలుగా విభజించి పనులు చేపట్టగా ఇప్పటివరకు 21దశలలో 343.462ట్రాక్ కిలోమీటర్ల డబ్లింగ్ రైలు మార్గాన్ని పూర్తి చేశారు. ఆయా దశలలో, సెక్షన్‌లలో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి ప్రారంభించిన డబ్లింగ్ రైలు మార్గం మొత్తం ట్రాక్ కి.మీలు (టికెయం)వివరాలు ఇలా వున్నాయి. పెరిచెర్ల-సాతులూరు మధ్య 24.004కి.మీలను 4-2-2020న ప్రారంభించారు. డోన్-పెండేకల్లు మధ్య 27.441కి.మీలను 8-3-2020న,నల్లపాడు-పెరిచెర్ల మధ్య 7.788కి.మీలను 1-12-2020న, పెండేకల్లు-ఎద్దులదొడ్డి మధ్య 8.581కి.మీలను 21-1-2021న,దొనకొండ-గజ్జెలకొండ మధ్య 12.403కి.మీలను 28-3-2021న, కురిచేడు-దొనకొండ మధ్య 12.523కి.మీలను 28-9-2021న,ఎద్దులదొడ్డి-మద్దికెర మధ్య 22.546కి.మీలను 22-2-2022న,గుండ్లకమ్మ-కురిచేడు మధ్య 11.451 కి.మీలను 8-3-2022న, గజ్జెలకొండ-తర్లుపాడు మధ్య 25.428కి.మీలను 19-10-2022న, చీకటిగలపాలెం- గుండ్లకమ్మ మధ్య 6.835కి.మీలను 6-12-2022న, మునుమాక-శావల్యపురం మధ్య 21.578కి.మీలను 28-2-2023న, బేతంచెర్ల-మల్కాపురం మధ్య 25.285కి.మీలను 26-3-2023న,తర్లుపాడు-జగ్గంభొట్లక్రిష్ణాపురం మధ్య(జెబికె)20.377కి.మీలను 5-7-2023న, మద్దికెర-గుంతకల్లు మధ్య 10.748కి.మీలను 25-7-2023న, శావల్యపురం-చీకటిగలపాలెం మధ్య 14.903కి.మీలను 2-8-2023న,మనుమాక-సాతులూరు మధ్య 16.613కి.మీలను 3-11-2023న, మల్కాపురం-డోన్ మధ్య 11.232కి.మీలను 26-11-2023న,జగ్గంబభట్ల-క్రిష్ణాపురం (జెబికె)-గిద్దలూరు మధ్య26.447కి.మీలను 4-1-2024న,బుగ్గానపల్లి సిమెంట్ నగర్-బేతంచెర్ల మధ్య 6.233కి.మీలను 27-3-2024న,గిద్దలూరు-దిగువమెట్ట మధ్య 12.011కి.మీలను 20-9-2024న, పాణ్యం-బుగ్గానిపల్లె సిమెంట్ నగర్ మధ్య 19.035కి.మీలను 27-12-2024న అందుబాటులో తెచ్చింది. ఈ మార్గంలో తూర్పు కనుమలలో భాగమైన దిగువమెట్ట-బొగద-చెలమ-బసవాపురం-గాజులపల్లి మధ్య 27కి.మీల సెక్షన్‌లోని నల్లమల ఫారెస్ట్‌లో డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు పనులు ప్రారంభం కాగా గాజులపల్లి-నంద్యాల మధ్య 16కి.మీలు, నంద్యాల-పాణ్యం మధ్య మరో 14కి.మీల డబ్లింగ్ రైలు మార్గాన్ని సెప్టెంబరు నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తుంది.

## మద్యం కుంభకోణం కేసు.. దిలీప్ బెయిలు పిటీషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ మే 26,ప్రభాతవార్త ప్రతినిధి:**వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి(ఎ1) ప్రధాన అనుచరుడు దిలీప్ దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌పై విచారణ వాయిదా పడింది. విచారణను విజయవాడ ఏసిబి కోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. చెన్నై నుండి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో దిలీప్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. చెన్నై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని..సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. అప్పటికే దిలీప్ కదలికలపై నిఘా పెట్టిన అధికారులు చెన్నైలోనే మకాం వేసి ఉండటంతో వెంటనే విమానాశ్రయానికి వెళ్ళి అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపర్చగా అప్పటి నుండి రిమాండులో ఉన్నారు.

## గోదావరిలో 8మంది గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత

**విజయవాడ.మే26,ప్రభాతవార్తప్రతినిధి:** బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం కమినిలంక వద్ద గోదావరిలో 8 మంది యువకులు గల్లంతయిన ఘటనపై హోంమంత్రి అనిత ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ కృష్ణారావుతో హోంమంత్రి అనిత ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. కె.గంగవరం మండలం శురుల్లంకలో శుభకార్యానికి వెళ్లిన యువకుల్లో 11 మంది స్నానం కోసం గోదావరిలో దిగి గల్లంతైనట్లు కలెక్టర్... హోంమంత్రికి వివరించారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. ఏపీఎస్డీ ఆర్ఎఫ్ ఐజీ రాజకుమారితోనూ హోంమంత్రి అనిత ఫోన్ చేసి మాట్లాడి అప్రమత్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి భద్రత బలగాల ద్వారా సత్వరం గాలింపు చర్యలు చేపట్టాలని హోంమంత్రిఆదేశించారు.

## కుటుంబంలో నలుగురిని కబళించిన రోడ్డుప్రమాదం..

### మృతులలో ముగ్గురు మహిళలు

**రాజమహేంద్రవరం సిటీ మే 26 ప్రభాతవార్త.** ..జాతీయ రహదారి దివాన్ చెరువు నాలుగు వరుసల రహదారి బ్రిడ్జిపై సోమవారం రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. ఒకే కుటుంబానికి చెందిన భార్య భర్త అత్త మరణించారు. భార్య మృతి చెందగా భర్త అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఈ రోడ్డు ప్రమాదం ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తి ప్రాణాలు బలి తీసుకుంది. కొవ్వూరు వైపు బొగ్గు లోడు వేలుసుకుని లారీ జాతీయ రహదారి గామన్ బ్రిడ్జి సమీపంలో లారీ టైర్ పేలిపోయింది. దీంతో లారీ బ్రేక్ వేయడాని డ్రైవర్ ప్రయత్నం చేశాడు. అయినా టైర్ రహదారిపై సుమారు 30 మీటర్లు రాసుకుంటూ అదుపు తప్పి రహదారిపై కుడివైపుకు ఒకకసు వేగంగా తిరిగింది. అదే సమయంలో కొవ్వూరు నుండి దివాన్ చెరువు వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. దీనిలో ప్రయాణం చేస్తున్న కొవూరుకు చెందిన ఉప్పులూరి వర ప్రసాద్(60), ఉప్పులూరి శివ లీలావతి(56), లంకసాని బిందు (34) అక్కడికక్కడే మరణించారు. తీవ్రగాయాలైన ఇమ్మాని వీర వెంకట సత్యవతి(75) లంకసాని సురేష్ 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యవతి మరణించింది. సురేష్ , బిందు భార్యాభర్తలు. ఇతను అవంతి సీడ్స్ లో సూపర్ వైజర్ గా పని చేస్తున్నాడు. వరప్రసాద్ కు శివ లీలావతి భార్య, వీరి వెంకట సత్యవతి అత్త అవుతుంది. కాకినాడలో శివ లీలావతి కుమార్తె ఇంజనీరింగ్ చెందుతుంది ఈరోజు ఆమె పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృత్యువు కదిలించింది. బిందు పుట్టినిల్లు చాగొల్లు గ్రామంలో వరప్రసాద్, శివ లీలావతి, సత్యవతి మార్కుంపాడు గ్రామంలో విషాదఛాయలు నెలకొంటున్నాయి. బిందు, సురేష్ లకు పెళ్లి జరిగి ఆరేళ్ల అయింది పిల్లలు లేరు. ఈ ప్రమాదంలో భర్త భార్య ను కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నారు. మరొకరు అత్త కూతురు అల్లుడు మృతి చెందారు. రెండు కుటుంబాల్లో నాలుగురు మృత్యువాతకు గురైనారు. సంఘటనా స్థలాన్ని నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ పరిశీలించారు. లారీని వేగంగా ఢీ కొట్టడం వలన కారు ముందు భాగం లారీల్లోకి ఇరుక్కుపోయింది ప్రొక్లీనర్ సహాయంతో తీసారు.

అయితే లారీ టైర్ పేలిపోవడం లేదా బ్రేక్ ఫెయిల్ అవ్వడం వలన ప్రమాదం జరిగిందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో ముగ్గురు చాగల్లు మండలంగా భావిస్తున్నారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈమేరకు డిఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైటప్..1) ప్రమాదంలో మృతిచెందిన వరప్రసాద్ శివ లీలావతి భార్యాభర్తలు.

(ఫైల్ ఫొటో) 2) వీర వెంకట సత్యవతి (ఫైల్ ఫొటో), 3) మృతురాలు బిందు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ (ఫైల్ ఫొటో), 4. ప్రమాదానికి గురైనారు.

## ఢిల్లీలో సిఆర్‌డిఎ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు సమాలోచనలు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ సీఆర్‌డిఏ కమీషనర్ కూనపరెడ్డి కన్నబాబు ఢిల్లీ పర్యటన చేపట్టారు. అమరావతిలో పెట్టుబడులు సమీకరించేందుకు ఢిల్లీ,గుడ్‌గావ్‌లో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఆదివారం ఏరో సిటీ,గుడ్‌గావ్ లోని కీలక ప్రాంతాల్లో పర్యటించి, అమరావతి మాస్టర్ ప్లాన్,పెట్టుబడుల సమీకరణ వ్యూహంపై పలువురితో చర్చించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా జాతీయ,అంతర్జాతీయ నిర్మాణ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అమరావతి విమానాశ్రయా నిర్మాణం,నదీతీర ప్రాంత అభివృద్ధి తదితర ప్రధానమైన ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షించారు.

# పంచాయతి సంబరాల్లో విద్యుద్ఘాతం

### ముగ్గురు మృతి, మరో ఇద్దరికి గాయాలు



**కంచిలి (శ్రీకాకుళం జిల్లా), మే 26 ప్రభాతవార్త:** కంచిలి మండలం తలపంపర పంచాయతీ సిర్లపుట్టుగ గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన విద్యుత్ ఘాతానికి ముగ్గురు బలయ్యారు. తలపంపర పంచాయతీలో గత నాలుగైదు రోజులుగా సంబరాలు జరుగుతున్నాయి. ఈ సంబరాల కోసం వీధిలో ఏర్పాటు చేసిన అలంకరణలో విద్యుత్ తీగ తెగిపడి ముగ్గురు ప్రాణాలను బలిగొంది. ఈ గ్రామంలో 30 కుటుంబాలు నివశిస్తున్నాయి. సంబరాల కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చుట్టాలు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం రోజు చుట్టాలంతా గ్రామానికి వచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. ఒరియా నారాయణపురం గ్రామానికి చెందిన నలియా కృష్ణ మూడు సంవత్సరాలు ఇంటి బయట ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తగలడంతో మృతి చెందాడు. అతన్ని కాపాడడానికి వచ్చిన అతని మేనమామ ఈశ్వర్ (28) కూడా విద్యుత్ షాక్ తగిలి అక్కడే మృతి చెందాడు. ఆ పక్కనే నివసిస్తున్న పురుషోత్తపురం గ్రామానికి చెందిన బహడపల్లి నందిని (12) కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.మృతి చెందిన ఈశ్వర్ శ్రీకాకుళంలోని హోటల్లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. ఈశ్వర్‌కు కొద్దిరోజుల క్రితమే బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం కుదిరింది. ఈశ్వర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న అమ్మాయి రోదన వర్ణనాతీతం. వీరితో పాటు విద్యుత్ షాక్‌కు గురైన మరో ఇద్దరు సోంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలానికి సోంపేట సీఐ, కంచిలి ఎస్సైలు పారినాయుడు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే పోలీసులు చేరుకునే సరికి గ్రామంలో అంతా ఒక్కటై జరిగిన సంఘటన ఆనవాళ్లు లేకుండా విద్యుత్ వైర్లని తొలగించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులతో మాట్లాడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారని నాయకులు పేర్కొన్నారు. చనిపోయిన మృతులంతా నిరుపేదలకు చెందినవారు. రాష్ట్ర ప్రభుత్వం మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

## శ్రీసిటీని సందర్శించిన థాయిలాండ్ కాన్సుల్‌జనరల్ - పెట్టుబడి అవకాశాల పరిశీలన



శ్రీసిటీలో రాయల్ థాయ్ కాన్సుల్ రాచా అరిబార్గ్

**సత్యవేడు, మే 26 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం సమీపం శ్రీసిటీలో రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. తన భార్య నరఫాన్‌అరిబార్గ్, కాన్సుల్ పిన్‌పాంగ్ చౌవాచాటాతో కలసి రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్(బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ శ్రీసిటీలోని థాయిలాండ్ పరిశ్రమ రాక్‌వర్త్ స్థాపన, ప్రస్థానాన్ని కాన్సుల్ జనరల్ బృందం దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, వ్యాపార ప్రయోజనాలను వారికి వివరించారు. మొదటి రోజు పర్యటనలో శ్రీసిటీ అధికారులతో చర్చలు, పారిశ్రామిక వాడ పరిసరాల వీక్షణతో పాటు స్థానిక రాక్‌వర్త్, మోండెలెజ్ పరిశ్రమలను ఆయన సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతోను సమావేశమయ్యారు. రెండవ రోజు పర్యటనలో బ్లూస్టార్, మురుగప్ప గ్రూప్ కంపెనీలను ఆయన సందర్శించనున్నారు.

## మద్యం కుంభకోణం నిందితుల కస్టడీ పిటిషన్‌పై ఎసిబి కోర్టు తీర్పువాయిదా

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు తన తీర్పును వాయిదా వేసింది. మే 29వ తేదీకి ఈ తీర్పును వాయిదా వేస్తున్నట్లు కోర్టు సోమవారం వెల్లడించింది. మద్యం కుంభకోణంలో నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ కోర్టులో సోమవారం ఉదయం వాదనలు జరిగాయి. వాదనలు విన్న కోర్టు... సాయంత్రం తీర్పు వెలువరిస్తామని తెలిపింది. దీంతో తీర్పును రిజర్వు చేసింది. కానీ తీర్పును మే 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ఆ తర్వాత ప్రకటించింది. మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖరరెడ్డి కీలక సూత్రదారంటూ వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బహిరంగంగా మీడియా ముందు ప్రకటించారు. దీంతో అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో మారు పేరుతో గోవా నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టులో దిగిన అతడిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించి.. సిట్ పోలీసులు విచారించారు. అతడు చెప్పిన ఆధారాలతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డితోపాటు మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వారిని సైతం విచారించారు. ఇక ఇదే కేసులో బాలాజీ గోవిందప్ప కూడా అరెస్టయ్యారు. వీరిని తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసులో కీలక సూత్రధారి కసిరెడ్డి రాజశేఖరరెడ్డిని సైతం మరోసారి తమ కస్టడీకి అప్పగించాలంటూ వారు కోర్టును కోరారు. ఆ క్రమంలో సోమవారం ప్రభుత్వం తరపు న్యాయవాది, సిట్ తరపు న్యాయవాదితోపాటు నిందితుల తరపు న్యాయవాది కోర్టులో తమ వాదనలు వినిపించారు.

వార్త


మంచి కథ కల్పించినట్లుగా కాక
నిజంగా జరిగినట్లుగా ఉండాలి.
చదివే వారికి కథ అనే శంక కలిగితే అది కథ కాదు.

-చలం

# కబళిస్తున్న మత్తు రక్కసి


మాదక ద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తుందని, దానిని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు చెప్తూనే ఉన్నారు. ఆ రాక్షసిని ఉక్కుపాదంతో అణచివేయాలని కూడా పిలుపునిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపుస్థాయిలో ఈ మహ్మామారి యేడాది యేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇరవైఏళ్ల లోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండాపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకోవడానికి హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా పద్నాలుగు శాతానికి పెరిగిపోయింది. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. 2004 దశకంలో భారత్‌లో కోటి డెబ్బైలక్షల మందికిపైగా మత్తువాడకందార్లు ఉండగా ప్రస్తుతం మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారిసంఖ్య దాదాపు నలభై కోట్లకు చేరుకుందని చెబుతున్నారు. ముఖ్యంగా అస్సాం,హర్యానా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, యుపి, పశ్చిమబెంగాల్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోతున్నది. కేంద్ర సామాజిక న్యాయ సాధికార వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం గతంలో వెల్లడించిన గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. మత్తుమందులు వాడకంలో ఉత్తరాది రాష్ట్రాలతో దక్షిణాది రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతున్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణ ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లోనూ అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరిస్తున్నట్లువార్తలు అందుతున్నాయి. గతంలో గంజాయి సాగు రవాణా, వినియోగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకునేవారు. ఎందుకోఏమోకానీ నిఘా తగ్గిపోతున్నది. 2021అక్టోబరు మూడో వారంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో నల్గొండ జిల్లా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విష యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమదారులను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణ చేసుకున్నారు. ఆ తర్వాత ఎందుకో ఆ ఆపరేషన్ ఆగి పోయిందనే చెప్పొచ్చు. దీనికితోడు విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రాపోర్టులో ఇరవై ఒక్కవేల కోట్ల విలువైన మూడువేల కిలోల హెరా యిన్ పట్టుబడినట్లు విజయవాడ లింకులు వెలుగు చూశాయి. మత్తు మందు సరఫరాలో కోట్లాది డాలర్లలోఅధిక శాతం ఉగ్రవాదుల సంస్థలకే చేరుకుంటుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ఈ మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా ఈ మత్తుమందు వ్యాపారులు ఉప యోగించుకుంటున్నారు. ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం జరగడంతో ఈ లావాదేవీలకు అదుపులేకుండా పోతున్నది. గతంలో మత్తు మందులు కొనేవారు తెలిసినా, వాడకం దారులు వారికి నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందును తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు.ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెప్పించి అప్పగించేవాడు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డరు ఇవ్వొచ్చు. మత్తుమందు రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. ప్రపంచమంతా విస్తరించిపోతున్నది. పట్టుబడిన కేసుల్లో కూడా పటిష్టంగా వ్యవహరించలేకపోవడం వల్లనో లేక చట్టంలో ఉన్న లొసుగులేమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇంకొక పక్క సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు విఫలం కావడంతో అధికశాతం కేసులు న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఏదోఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే నియంత్రించడం సాధ్యం కాదనేది కొంతవరకు నిజమే కావొచ్చు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణరూపొందించి అమలు చేయాలి. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోచూపాల్సిన తరుణమిది. ఈ బాధ్యతంతా పాలకులపై వదిలి పెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు,ప్రజాస్వామ్యవాదులు అందరు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన సమయమిది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్

వయసు మీరిన తర్వాత మనకు అవసరమైన ఆశ్రయాన్ని ఇవ్వగలిగింది విజ్ఞానమే.



చెస్టర్ ఫీల్డ్

# ప్రజావాక్కు



## ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

దేశంలో ఉన్న అన్ని రవాణా వ్యవస్థల్లో రైల్వే రవాణా సగటు భారతీయునికి తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనంకలిగిన వ్యవస్థగా ఉండేది.కానీ ఇటీవల జరుగుతున్న తరచూ ప్రమాదాలవల్ల అమలు చేస్తున్న అసాధారణ నిర్ణయాలవలన రైల్వేల పట్ల నిర్లిప్తత వ్యక్తం అవుతున్నది. గతంలో జరిగిన 200 రైల్వే ప్రమాదాల్లో దాదాపు 350 మంది మరణించినట్లు, 970 మంది ప్రమాదాల బారిన పడినట్లు తెలుస్తున్నది. 2020 సంవత్సరంలో కవాచ్ ప్రవేశపెట్టిన తర్వాతకూడా దాదాపు 200 ప్రమాదాలు జరిగాయి. రక్షణ భద్రత బదులుగా ఆధునికమైన నవీకరణఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధానమంత్రి కలల స్వప్నమైన బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్ల జనరల్ బోగీలను పెంచడంపెంచిన ఛార్జీలను తగ్గించడం ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపులను ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్‌రావు, హైదరాబాద్

## పెరుగుతున్న అంతర్జాల వినియోగం

ఇటీవల కాలంలో అంతర్జాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. రీల్స్ పేరిట వెర్రిచేష్టలు, ఆన్‌లైన్ గేమ్స్ మోసాలు, ఆన్‌లైన్‌లోనే వేధింపులు ఇంకా అనేక రకాల సైబర్ మోసాలను తరచూ మనం చూస్తూనే ఉన్నాం. వీటిబారిన పడకూడదంటే పాఠశాల, కళాశాలస్థాయి నుండి అంతర్జాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పౌర సమాజం బాధ్యతగా వ్యవహరించాలి.

-ఎం. ముత్యంరెడ్డి, సిద్దిపేటజిల్లా

## పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

ఆంధ్రప్రదేశ్ ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతోపాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాల్సి ఉండగా గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు. అంగన్‌వాడీలకు జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా కందిపప్పు టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

## యువతలో మానసిక సమస్యలు

నేటి ఉరుకులపరుగుల జీవితం, ఆధునిక జీవనశైలి, యువత జీవితాల్లో మానసిక ఒత్తిడిని వేగంగా పెంచుతోంది. టీనేజర్లు, యువకులు ఒత్తిడిని ఎక్కువగా అనుభవిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో మానసిక ఒత్తిడి కనిపించడం ఆందోళనకరంగా మారింది. దీనికి ప్రధాన కారణం పాఠశాల, కళాశాలల ఒత్తిడి, సోషల్ మీడియా డిమాండ్, సమాజంలో తమ సొంతగుర్తింపును సృష్టించడానికి మానసికంగా సంఘర్షణకు గురవుతూ, పోరాడుతున్నారని వైద్యనిపుణులు చెబుతున్నారు. వీడియో గేమ్‌లు, షేర్‌చాట్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివాటితో గడుపుతున్న టీనేజర్లు ఎక్కువగా హిక్కోమోరి సిండ్రోమ్ బారినపడుతున్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఫలితంగా యుక్త వయస్సు నుండే యువత పలు మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. సంక్షేమ కార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చిన పప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడం వల్ల కెసిఆర్ స్వార్థం కారణంగా కాంగ్రెస్ వారి తెలివి తక్కువఆలోచన కారణంగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్న రాష్ట్రంగా మారింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగుల సంఖ్యను పెంచేసింది. రాజకీయ నాయకుల సంఖ్యను కూడా పెంచేసింది. వారి పోషణ ప్రజలకు చాలా కష్టంగా మారింది. రోడ్లు అధ్వాన్నంగా ఉండడం వల్ల యాక్సిడెంట్లు విపరీతంగా జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రజల రక్షణ కోసం ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరగడం కోసం రోడ్ల మీద దృష్టిపెట్టాలి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

## రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

ప్రజల కష్టార్జితాన్ని సులువుగా నిమిషాలలో దోచేస్తున్నారు నేడు సైబర్ నేరగాళ్లు. వీరి బారినపడి నిత్యం ఎందరో అమాయకులు మోసపోతున్నారు. రోజుకో తీరున, రోజుకో పేరున కొత్త రకాల మోసాలతో జనాలని దోచుకుంటున్నారు. ఇంట్లో డబ్బుకు దొంగల భయం, బ్యాంకులో సైబర్ నేరగాళ్ల భయం అనే విధంగా నేడు ధనం భద్రంగా దాచుకునే అవకాశం లేకుండాపోయింది. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలి.

-కె. శేషగిరి, సికింద్రాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జీవన గమనాన్ని మార్చుతున్న సాంకేతిక రంగం

*సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్వు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగిన యంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం, మెరుగైన జీవన శైలికోసమనే భావన ఏర్పడింది.*

సుంకవల్లి సత్తిరాజు

సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా ప్రపంచాన్ని పెను మార్పులకు గురి చేస్తుందని ఎవరూ ఊహించలేదు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పూర్తిగా ఆవహించే అవకాశాలు మెండుగాఉన్నాయి. వచ్చే ఏడాది నాటికి 50శాతం కోడింగ్ ఏఐ చేస్తుందని మెటాప్లాట్‌ఫామ్స్ సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ చెబుతుంటే, మైక్రోసాఫ్ట్‌లో ఇప్పటికే 30 శాతం కోడింగ్ ఎఐ చేతుల్లోకి వెళ్ళిందని ఆ సంస్థ సిఇఒ సత్య నాదెళ్ల పేర్కొనగా, హేమాహేమీల కందని కోడింగ్ ఏఐ సొంతమని స్పేస్‌ఎక్స్, ఎక్స్,టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించడాన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో ఏఐ ప్రాధాన్యత ఎలా ఉండగలదో ఊహించగలం. భవిష్యత్తులో ఎఐ మీద పట్టుగల వారికే ఉద్యోగాలు దక్కుతాయి. సాఫ్ట్‌వేర్ రంగం సాఫ్ట్‌నెస్ కోల్పోయింది. కష్టించి పనిచేసి, అప్పగించిన పనులు విజయవంతంగా పూర్తి చేయగలిగితేనే కొంతకాలం ఉద్యోగాల్లో కొనసాగగలరు.నేటి చదువులు,మార్కులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి ఉపకరించగలవా? అనే సంశయం కలగడం సహజం. మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు ఒడిసిపట్టుకుని, ఉద్యోగాలు సంపాదించాలి. ఉద్యోగార్థులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ వేతనాలతో పని చేసే వారికే టెక్ కంపెనీలు ప్రాధాన్యత నిచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే అరకొర జీతాలతో గొడ్డుచాకిరీ చేస్తున్నవారిని చూస్తున్నాం. మానసికంగా నలిగిపోతూ, ఉంటుందో, ఊడుతుందో తెలియని భద్రత లేని ఉద్యోగాల కోసం మనశ్శాంతి కోల్పోవడం కంటే ప్రత్యామ్నాయ ఉపాధిని అన్వేషించుకోవడం మంచిది. మార్కులతో, బట్టీ చదువులతో తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని భ్రమపడే తల్లిదండ్రుల ధోరణి మారాలి. బోధనా పద్ధతులు కూడా మారాలి.అన్ని రంగాలు సాంకేతికతతో మేళవించిన కారణంగా ఎక్కడ ఏచిన్న పొరపాటు జరిగినా యావత్ ప్రపంచం స్తంభించిపోయే ప్రమాదముంది.సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నిపుణులు, ఉద్యోగులు, టెక్ కంపెనీలు సాంకేతిక వ్యవస్థలు దుర్వినియోగంకాకుండా ప్రపంచ జీవన గమనం సాఫీగాసాగడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయి. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్ననేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టక మానవు. ఒకప్పటి సినిమాల్లో భయంకరమైన రౌడీ వేషాల్లోవచ్చి,కిడ్నాపులు చేయడం,దోపిడీలకు పాల్పడడం వంటి సన్నివేశాలు కనిపించేవి. అయితే ఈ ఆధునిక సమాజంలో నిజంగా నిర్లజ్జగాక్షణాల్లో మోసాలు జరిగిపోతున్నాయి. కాలు బయటకు కదపకుండా, కోట్లు కూడబెట్టే విద్యలో కొంతమంది ఆరితేరిపోయారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్లకు కాసుల పంటగా మారింది.కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విధ్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్ చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి,డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాల పేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటియం పిన్‌చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయ మాటలు చెప్పడం, కెవైసి అప్‌డేట్ కోసమంటూ ఓటిపి అడగడం,మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం, వాట్సాప్‌లలో లింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా నమ్మించి, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయించడంతో ఏం చేయాలో అర్థంకాక ఎంతోమంది ఆవేదన చెందుతు




న్నారు. కష్టించి,సంపాదించిన సొమ్మంతా క్షణాల్లో మాయం కావడంతో ఏంచేయాలో అర్ధంగాక అమాయకులు తీవ్రమైన మనోవ్యధకు గురవుతున్నారు. మన మాటలను, వీడియోలను పరిశీలించి, ఎడిట్ చేసి, మోసంచేయడం, శీల హననం చేయడానికి యత్నించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, తమ మాట వినకపోతే తీవ్రంగా నష్టపోతారంటూ, బెదిరింపులకు పాల్పడడం జరుగుతున్నది. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల పేరుతో తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న ముఠాలు బయలు దేరాయి. సైబర్ క్రైమ్ నేరాలను నిరోధించడానికి టోల్ ఫ్రీ నెంబర్లు ఇవ్వబడ్డాయి. అనేక కేసులు నమోదవుతున్నాయి. అయితే కేసులు పెట్టడం వలన ఎంత మంది నేరస్థులు పట్టుబడుతున్నారో,ఎలాంటి శిక్షలు విధిస్తున్నారో అర్థం కావడం లేదు. భారతదేశంలో డిజిటల్ అరెస్టులకు చట్టబద్ధత లేకపోయినా,వీటి పేరుతో నేరస్థులు సాగిస్తున్న కార్యకలాపాలకు బెంబేలెత్తిపోతున్న అమాయకుల ఆక్రందనలకు అడ్డుకట్టవేయలేమా? సాంకేతిక రంగంలో పెను విప్లవం 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'. కృత్రిమ మేధస్సుతో వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి, ఆధునీకరించిన సాంకేతిక ప్రక్రియతో వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రగతిని పరుగులు పెట్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతం చేసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధ కీలక భూమిక పోషించే అవకాశముంది.అయితే ఇలాంటి కృత్రిమ మేథ సైబర్ నేరస్థులకు స్వర్గధామంలా మారడం దురదృష్టకరం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌సహాయంతో మన మాటలను, మన వీడియోలను మార్ఫింగ్ చేసి, వాట్సాప్ ద్వారా పంపించి, డబ్బులు పంపించమంటూ కోరడం, ఆ వీడియోలు నిజమేనని నమ్మి డబ్బులు పంపించడం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్న వారు ఎవరిని ఆశ్రయించాలో తెలియక తికమకపడుతున్నారు. కేసులు పెట్టినా ఫలితం ఉంటుందనే నమ్మకం లేక దిగాలు పడుతున్న వారికి న్యాయం జరుగుతుందా? టెక్నాలజీ దుర్వినియోగం విశృంఖలంగా కొనసాగుతున్నది. మన ప్రయోజనాల కోసం మనం నిర్మించుకున్న సాంకేతిక ప్రపంచం వక్రమార్గంలో పయనిస్తున్నది. విద్య,వైద్య,ఆర్థిక,రవాణా, కమ్యూనికేషన్, సాంస్కృతిక రంగాల్లో నిర్మాణాత్మకంగా వినియోగపడవలసిన టెక్నాలజీ అసాంఘిక శక్తుల చేతుల్లోకి పోయి, అడ్డదారుల్లో పయనిస్తున్నది. మొబైల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. యూట్యూబ్, వాట్సాప్ ఫేస్బుక్, ఇన్‌స్టాలు, ట్విట్టర్,ఎక్స్ వంటి సాంకేతిక వేదికలు సమాజానికి ఉపకరించాలి. అయితే సోషల్ మీడియా అన్ని విలువలను అతిక్రమించి,అత్యంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో కొత్తగా పుట్టుకొచ్చిన "ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్" వలన ఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే దీని ప్రభావం వలన అనేక మంది బాధితులైనారు. మొబైల్ ఫోన్లలో నిక్షిప్తమైన మన వ్యక్తిగత భద్రత ప్రశ్నార్థంగా మారుతు న్నది. నిర్మాణాత్మకంగా ఉపయోగపడవలసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను అసాంఘిక కార్యకలాపాలకు, ఆర్థికనేరాలకు వినియోగించడం వలన వ్యక్తిగత గోప్యతకు, ఆర్థికభద్రతకు, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించింది. డేటాచౌర్యం యథేచ్ఛ గా సాగుతున్నట్టు పలు వార్తా కథనాలు సూచిస్తున్నాయి. ఇకనైనా సైబర్ నేరాల పట్ల పటిష్ఠమైన, వేగవంతమైన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలను అణచివేయడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకంకావాలి. సమిష్ఠితత్వంతోపటిష్ఠమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యంకోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్వు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగినయంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం,

# అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన, బాధ్యతగా మెలగాల్సిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు నెల విడిచి సాము చేస్తూ తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును ముక్కు పిండి మరీ వసూలు చేస్తూ తమ వికృత,నికృష్ణ నైజాన్ని చాటుకుంటుండటం తీవ్ర హేయమైన, ఆక్షేపణీయమైన విషయం. ఆ విధంగా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల డబ్బు పిచ్చి ఏ విధంగా తయారు అయింది అంటే'అయ్యగారికి లంచం ఇస్తేనే కంచం కదిలేది' లాగా, కాస్తో, కూస్తో 'సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే' వారికి ఆరోజు నిద్రపట్టేలా లేదు అన్నట్లుగా. ఒక విధంగా చెప్పాలంటే ఒక వేటగాడు తన కడుపు నింపుకోవడానికి ఏదేని జంతువును ఎలా వెంటాడి వెంటాడి వేటాడుతాడో ఆ తరహాలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు సామాన్య ప్రజలను ఒక జలగల లాగా పీక్కుతుంటూ వారి నుంచి బలవంతంగా అయిన దానికి కాని దానికి కాసులు దండుకుంటుండటం



అత్యంత జుగుస్సకరం, సిగ్గు చేటైనా విషయం.కొన్ని సందర్భాలలో వీరి అవినీతి, లంచాలు శృతిమించి, సామాన్య ప్రజలకు వెర్రేత్తి వీరి బాగోతాన్ని ఎసిబి అధికారులకు చేరవేస్తే వారు అఘామేఘాల మీద వచ్చి వీరి మీదపడి వీరిని అత్యంత అవమానకరంగా సస్పెండ్ చేస్తున్నప్పటికీ వీరి వక్ర బుద్ధిలో ఏ మాత్రం మార్పురాకపోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన, దురదృష్టకరమైన విషయం. ఏదిఏమైనా వీరికి ఏ మాత్రంపేద, నిరుపేద ప్రజలపై, సామాన్య రైతులపై జాలి,దయ,సానుభూతి అంటూ ఏ మాత్రం, ఏ కోశానా ఉండదు.ఎంతసేపు వీరి బొక్కసాలను నింపుకోవడం పైనే వీరి దృష్టి అంతా. ఏమి చేస్తాం వీరికి ఎంతసేపు డబ్బు సంపాదనపై తీరని వ్యామోహం తప్పించి వీరిలో మానవత్వం ఇసుమంతైనను కానరాదు. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు' కొంత మంది నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వీరిని చూసి అవినీతికి, లంచాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారే ప్రమాదం సైతం పొంచి వుంది. ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు. ఏమైనా ఆ కాలమే వీరి దుర్బుద్ధిని,వక్ర స్వభావాన్ని మార్చాలి తప్ప వీరు మారరు గాక మారని దురాశపరులు, లంచాలను అడుగడుగున రుచి మరిగిన బొత్తిగా వ్యక్తిత్వం లేని ధనాశపరులు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు మనమంతా ఒక యుద్ధ ప్రాతిపదికన ఉద్యమిద్దాం. అవినీతి, లంచం అనే మహమ్మారిని తరిమి తరిమి కొడదాం! అవినీతి రహిత సమాజ రూపకల్పనకు మన వంతుగా పాటుపడదాం. ●

# వ్యూహాత్మక సంకల్ప వేదిక మహానాడు

సిద్ధార్థ రాయ్


దేశ రాజకీయ చిత్రపటంలో కొత్త అధ్యాయానికి తెర లేపిన తెలుగుదేశం పార్టీ ఈసారి మహానాడుతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపబోతున్న సంకేతాలు అం దుతున్నాయి. ఎన్నోఆశలు, ఆకాంక్షలతో లక్షలాది మంది తెలుగుదేశం తమ్ముళ్ల ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. అదే మహానాడు విశాల వేదిక. ఈసారి టీడీపీ మహా నాడు మాత్రం సాదాసీదా సభగా భావించలేము. ప్రత్యే కించి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగే ఈ మహానాడు, గతంలో అన్నింటకన్నా విభిన్నంగా, విస్తృతంగా, విశిష్టంగా మారుతోంది.

## ప్రత్యర్థులకు స్పష్టమైన సంకేతం

ఈ సమావేశానికి కడప వేదిక కావడం రాజకీయంగా ప్రతీకాత్మకంగా మారింది. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ కోటగా ఉన్న కడప జిల్లాలో నిర్వహించడమే. కడప అంటేనే వైఎస్ కుటుంబానికి అఖండ వేదికగా భావించిన స్థలం. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా వైఎస్ రాజ్యమేలిన ఈ భూభాగంలో టిడిపి మహానాడు నిర్వహించడం వాస్తవానికి రాజకీయ ధైర్య సాహసానికి నిదర్శనం. ఈ నిర్ణయం ద్వారా చంద్రబాబు కొన్ని స్పష్టమైన సంకేతాలు పంపిస్తున్నారు. ఒక్క కడపనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తిరిగి పునరుత్తేజానికి సంకేతం. ఎవరూ ఊహించని స్థలంలో మహానాడు నిర్వ హించడం, ప్రత్యర్థుల గూఢార్థాలను కట్ చేస్తూ, పార్టీ సామర్థ్యాన్ని రుజువు చేయడం అనే వ్యూహాత్మక సంకల్పమే దీని వెనుక ఉంది.

## పునరుత్తేజ స్ఫూర్తి

టిడిపి మహానాడు అంటే కేవలం ఒక వార్షిక సమావేశం మాత్రమే కాదు. ఇది పార్టీలో సామూహిక ఆత్మపరిశీలనకు, బహిరంగ చర్చలకు వేదిక. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగే మహానాడు కావడంతో, నూతన పాలనకు రూపురేఖా విలాసాలను నిర్దేశించే సభ. అందుకే ఇది కీలకం. ఎన్నికల హామీలు, పాలన తీరుపై స్పష్టత, బృహత్తర అభి



వృద్ధి యాజమాన్యం గురించి పార్టీ శ్రేణులకు సమాచారం అందించేందుకు, అధికారంలో ఉన్న నేతలు తమ లక్ష్యాలు షేర్ చేసుకునేందుకు ఇది అత్యుత్తమ అవకాశం.

ఈ మహానాడు సందర్భంగా పార్టీలో పునరోత్సాహం కలిగించే ముఖ్య నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వివిధ కమిటీల ఏర్పాటు, యువ నాయకత్వానికి అవకాశం కల్పించే మార్గదర్శక చర్యలు, పార్టీ శ్రేణుల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు చర్చకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

## వ్యూహాత్మక మార్గదర్శకత్వం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపికి దక్కిన సీట్లు ఘన విజయానికి నాయకత్వ పటిమకు స్పష్టమైన కారణంగా నిలిచింది. చంద్రబాబునాయుడు అనుభవం, రాజకీయ వ్యూహాశాస్త్రం, ప్రజల్లోకి తీసుకెళ్లిన అభివృద్ధి దృక్కోణం, ఈ విజయాన్ని పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా ప్రదర్శిస్తూ, అదే దృఢసంకల్పంతో ముందుకు సాగేందుకు చంద్రబాబు ఈ మహానాడును వేదికగా మార్చనున్నారు. ఈసారి మహానాడులో చంద్రబాబు మార్గదర్శకత్వం అత్యంత ప్రాధాన్యత కలిగింది. గత ప్రభుత్వ తీరును ఎండగట్టడమే కాకుండా, కొత్త ప్రభుత్వ ప్రాధాన్యాలు, అనుసరించబోయే విధానాలపై స్పష్టత ఇవ్వనున్నారు. పార్టీ శ్రేణులను ప్రజా సేవకు పునరంకిత దిశగా సమాయత్తం కాగల వేదిక. ఇది కేవలం పార్టీ కార్యకర్తలకే కాదు, ప్రజలకూ సందేశం.

వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసిపి భవిష్యత్తు చర్చల్లోనే లేకుండా పోయింది. ప్రజా వ్యతిరేకపాలన, అప్పుల వృద్ధి, నెరవేర్చని హామీలు, దుర్వినియోగ దుష్పరిపాలన వల్ల ప్రజలు వైసిపికి తలుపు మూసేసిన తరుణంలో కార్యకర్తలకు హితోపదేశం ఎంతో అవసరం. ఇప్పుడు చంద్రబాబు అదే ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఈ తరుణంలో మహానాడు ఒక ప్రతిఘటన వేదికగా మారనుంది. గత పాలనపై విమర్శల ద్వారా ప్రజల్లోకి సంకేతాలు పంపించడమే కాకుండా, భవిష్యత్తు పాలనలో ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టత ఇవ్వనుంది.

## రాజకీయ దిక్సూచి!

ఈ మహానాడు టిడిపి భవిష్యత్ పయనానికి దిక్సూచి వంటిది. రాజకీయంగా, సంస్థాపితంగా పార్టీ ఎలాంటి మార్పులు చేపట్టనుంది? యువతను ఆకర్షించే చేరే దిశగా ఎలాంటి వ్యూహాలు రూపొందించనుంది? అనేవి ఈ మహానాడులో నిర్ణయిస్తారు. 2029 లక్ష్యంగా తీసుకుంటూ పార్టీ వ్యూహాలు రూపొందించబోతున్నారు. కడపలో జరుగుతున్న మహా నాడు, తెలంగాణాలో పార్టీ పరిస్థితి, పొత్తుల వైఖరిపై చర్చలకు తలుపులు తెరుస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్న సంకల్పంతో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు పార్టీ శ్రేణులకు ఆత్మవిశ్వాసం నింపే, వ్యూహాత్మక పునర్నిర్మాణానికి బీజం వేయనున్న మహానాడు.. నిజమైన కార్యకర్తల ప్రతిష్ఠాత్మక వేదికగా పునరాగమన పథానికే వేదికగా నిలుస్తోంది. ●

# యూనస్‌ను దించేందుకు ఆర్మీచీఫ్ కసరత్తు

## మరింత సంక్షోభంలోకి బంగ్లాదేశ్




**ధాకా, మే 26:** బంగ్లాదేశ్ రాజకీయ వాతావరణం మళ్లీ ఉద్రిక్తతగా మారేలా సంకేతాలు కనిపిస్తున్నాయి. సైనిక చీఫ్ వాకర్ ఉజ్ జమాన్, తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌ను అధికారంలో నుంచి తొలగించేందుకు ప్లాన్స్ చేస్తున్నారని ప్రముఖ నిఘా వర్గాలు వెల్లడించాయి. జమాన్ ఈ ప్రయత్నాన్ని సైనిక స్థాయిలోనే కాదు, రాజకీయంగానూ శ్రమిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశాల్లో పాల్గొంటూ సైన్యం తమ ఉనికిని, ఉద్దేశాన్ని ప్రజలకు తెలిపిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జమాన్ ఎన్నికలు జూన్‌లో నిర్వహించాలన్న యూనస్ ఆలోచనకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన, బంగ్లాదేశ్ రాజ్యాంగంలో ఉన్న అస్పష్టతలను వాడుకొని యూనస్ అధికారాన్ని సవాలు చేయాలని భావి స్తున్నట్టు తెలుస్తోంది. రాజ్యాంగం ప్రకారం, ప్రభుత్వం రద్దైన 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వ హించాలి. కానీ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానికి చట్టపరంగా సరైన ఆధారంలేదని నిఘా వర్గాలు స్పష్టంగా చెబుతున్నాయి. దేశ రాజకీయాలను పునరుద్ధరించేం దుకు జమాన్ కీలక ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా, షేక్ హసీనా, ఖలీదా జియా నేతృత్వంలోని ప్రధాన రాజకీయపార్టీలను కలిపి ఎన్నికల్లో పోటీ చేయించేదిశగా ఆయన ఆలోచన చేస్తున్నారని వర్గాలు చెబుతున్నాయి. అయితే, యూనస్‌ను అధికారంలో నుంచి తప్పించడంలో జమాన్ విఫలమైతే,పరిస్థితిని తాత్కాలికంగా తన ఆధీనంలోకి తీసుకొని దేశం రాజకీయంగా స్థిరంగా ఉండేలా చూస్తారని సమాచారం.

**అత్యవసర పరిస్థితి దిశగా సైన్యం పావులు కదుపుతోందా?:** ఎన్నికల ప్రక్రియలో జాప్యం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమవుతుందని భావిస్తున్న సైన్యం, అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్‌ను అత్యవసర పరిస్థితిని ప్రకటించమని ఒత్తిడి చేస్తున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అలాంటి సందర్భంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయమని కోరే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 58 ప్రకారం, అవసరమైతే అధ్యక్షుడు తక్షణ అధికారాలు చేపట్టే అధికారం పొందుతారు. ఇదే అధికారం ద్వారా యూనస్‌ను అధికారానికి దూరం చేయాలని సైన్యం భావి స్తున్నట్టు సమాచారం. 2007 తరహాలో మళ్లీ రాజ్యాంగ అస్పష్టత వస్తోందని ఇది కొత్త పరిణామం కాదని నిఘా వర్గాలు గుర్తు చేస్తున్నాయి. 2007లో కూడా బంగ్లాదేశ్‌లో సైనిక మద్దతుతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అప్పటిలాగే ఇప్పుడు కూడా అదే స్క్రిప్ట్ తిరిగి నడుస్తున్నట్టు తెలుస్తోంది. జమాన్ - యూనస్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు, విదేశీ జోక్యం, రఖైన్ కారిడార్ ప్రతిపాదనలు, దేశ భద్రతకు ముప్పుగా మారతాయన్న ఉద్దేశంతో తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్టు సమాచారం. జమాన్ ఇప్పటికే నావికాదళం, వైమానిక దళాల అధిపతుల మద్దతు పొందారు. ఇప్పుడు ప్రజల మద్దతు కూడా తనవైపుగా తిప్పేందుకు యత్నిస్తున్నారు.

# యుద్ధోన్మాదంతో పుతిన్

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం



**వాషింగ్టన్, మే 26:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణకు సంబంధించి ఒకవైపు చర్చలు జరుగుతున్న వేళ పుతిన్ సైన్యం అతిపెద్ద వైమానిక దాడులు చేయడంపై మండిపడ్డారు. పుతిన్ పూర్తిగా పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని తన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ నాకు చాలా కాలంగా తెలుసు. ఆయనతో ఎప్పుడూ నాకు మంచి సంబం ధాలే ఉన్నాయి. కానీ ఆయనకు ఏదో జరిగింది. పూర్తిగా పిచ్చిపట్చినట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండానే ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారు. అనవసరంగా చాలా మందిని చంపేస్తున్నారు. పుతిన్ ఉక్రెయిన్‌లో కొంత భూభాగాన్ని కాదు, ఆదేశం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఆయన దృష్టిలో అది సరైనదే కావొచ్చు. కానీ, ఇది రష్యా పతనానికే దారితీస్తుందని పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ విమర్శించారు. జెలెన్‌స్కీ మాట్లాడే విధానం కూడా ఆ దేశానికి ఏమాత్రం మేలు చేయదని అన్నారు. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలు సృష్టిస్తోందని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇకనైనా ఆపాలని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం తాను అమెరికా అధ్యక్షుడిగా ఉండి ఉంటే, ఈ యుద్ధం మొదలయ్యేదే కాదని పునరుద్ఘాటించారు. అసమర్థత, ద్వేషంతో మొదలైన ఈ ఉద్రిక్తతలను ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ రాసుకొచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా ఆదివారం భీకర దాడులు చేసింది. రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా రష్యా సైన్యం 367డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికా రులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 12 మంది మృతి చెందగా, చాలా మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలు స్తోంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ, అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్‌ను మరింత ప్రోత్స హించినట్లు అవుతుందని విమర్శించారు.

# సిందూర్ దాడుల తర్వాతనే పాక్‌కు సమాచారం ఇచ్చాం

## కాంగ్రెస్ ఆరోపణలు తప్పపట్టిన విదేశాంగమంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ,మే 26:** ఆపరేషన్ సిందూర్ దాడులు గురించి పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కేంద్రప్రభుత్వం ఖండించింది. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడింది. ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు సమాచారం అందించామని తెలిపింది. ఈ మేరకు విదేశాంగశాఖకు చెందిన కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టతనిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాం. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్నాయి. అందుకే దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలని జైశంకర్ అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ పాక్ దళాల విశ్వసనీయత, నైతికతను దెబ్బతీసిందని జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదంపై భారత వైఖరిని మూడు దేశాల తప్ప మిగిలిన దేశాలు విమర్శించలేదని ఆయన పేర్కొన్నారు. భార త్ తీసుకున్న నిర్ణ యాన్ని ప్రపంచ దేశాలు ప్రశంసిం చాయని వెల్లడించారు. ఉగ్రస్థావ రాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్ చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం వాస్తవాలను వక్రీక రించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్ సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌కు ముందు గానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశంలో జైశంకర్ స్పందించినట్లు ఉన్నారు. దాడుల తర్వాతే డిజిఎంఒ స్థాయిలో పాక్ సంప్రదింపులు జరిపిందని జైశంకర్ చెప్పారు.

# 8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు



**న్యూఢిల్లీ,మే 26:** రాజ్యసభలోని ఎనిమిది స్థానాలకుగాను ఎన్నికల సంఘం ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనున్నది. తమిళనాడు, అస్సాం రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది స్థానాలకు జూన్ 19న ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలుకూడా ప్రకటిస్తుంది. రాష్ట్రాల శాసనసభ, మండళనుంచి రాజ్యసభకు ప్రాతినిద్యం వహిస్తున్న ఈ సభ్యుల కాలపరిమితి జూన్, జులైల్లోనే ముగుస్తోంది. అందువల్లనే ఈ రెండురాష్ట్రాల్లో రిటైర్ అవుతున్నవారిస్థానంలో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తోంది. అస్సాంలో రెండు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. మిషన్ రంజన్‌దాస్, బీరేంద్ర ప్రసాద్ బైష్యలు రిటైర్ అవుతున్నారు. జూన్14వ తేదీ వారు రిటైర్ అవుతున్నారు. ఇక తమిళనాడులో అయితే ఆరుగురు రాజ్యసభ సభ్యులు రిటైర్ అవుతున్నారు. వచ్చేనెల 24వ తేదీవరకూ వారికి పదవీకాలం ఉంటుంది. వారఅన్బుమణిరామ్‌దాస్, ఎం షన్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పి విల్సన్, వైకోలు ఉన్నారు. వచ్చేనెల 2వ తేదీ నోటిషికేషన్ జారీ అవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ జూన్‌తొమ్మిదిగా నిర్ణయించారు. జూన్ పదవ తేదీ పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు జూన్12వ తేదీగా నిర్ణయించారు. కమిషన్ ఈ ఎ న్నికల్లో వయెలెట్ రంగు స్కెచ్‌పెన్నులను మాత్రమే వినియోగిస్తోంది. బ్యాలట్‌పత్రాలపై మార్కింగ్‌నకు ఈ రంగు పెన్నులు మాత్రమే వినియోగించేందుకు అనుమతించింది. ఎన్నిక సజావుగా సాగేందుకు పరిశీలకులను నియమిస్తున్నామని, అదనంగా కొవిడ్19 మార్గదర్శకాలు కూడా పాటించాలని ఆదేశించింది. పోలింగ్‌ముగిసిన వెంటనే లెక్కింపును ప్రారంభిస్తారు. జూన్ 23నాటికల్లా మొత్తం ఎన్నికల ప్రనరకియ ముగుస్తుందని ఇసి తెలిపింది. అలాగే ఇదే జూన్ 19వ తేదీ ఎన్నికల సంఘం ఐదు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహిస్తోంది.




# పాకిస్థాన్‌కు రహస్యాలు లీక్ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్!

**న్యూఢిల్లీ, మే 26:** సిఆర్‌పిఎఫ్‌కు చెందిన సిబ్బంది ఒకరు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో మమేకం అయి భారత్ కీలక సమాచారాలు, రహస్యాలను చేరవేస్తున్నట్లు రూఢికావడంతో ఎన్‌ఐఎ అరెస్టు చేసింది. మోతిరామ్ జాట్ అనే ఈవ్యక్తి సిఆర్‌పిఎఫ్‌లో పనిచేస్తున్నాడు. రహస్యసమాచారాన్ని, జాతీయభద్రతకు సంబంధించిన కీలక డేటాను పాకిస్తానీ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్నట్లు తేలింది. 2023నుంచి మోతిరామ్ ఈ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది. అంతేకాకుండా వివిధ ఛానెళ్లనుంచి పిఐఒలు మోతిరామ్‌కు సొమ్ములు కూడా పంపిస్తున్నట్లు ఎన్‌ఐఎ ఆరాతీసింది. ఢిల్లీలో అరెస్టుచేసిన మోతీరామ్‌ను ప్రస్తుతం ఇంటరాగేషన్ చేస్తున్నారు. వచ్చే జూన్ ఆరవ తేదీవరకూ ఆయన ఎన్‌ఐఎ కస్టడీలో ఉండాలని స్పెషల్‌కోర్టు ఆదేశించింది. సిఆర్‌పిఎఫ్ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనచేస్తూ మోతీరామ్‌ను సర్వీసునుంచి డిస్మిస్‌చేస్తున్నట్లు ప్రకటించింది. జాట్ సోషల్‌మీడియా కార్యకలాపాలపై నిఘా వేసిన ఎన్‌ఐఎ ఇతర కేంద్రేజెన్సీల సాయంతో పక్కాగా సమాచారం రాబట్టింది. తదుపరి విచారణకు మోతీరామ్‌ను ఎన్‌ఐఎకు అప్పగించినట్లు తెలిపింది. దీనితోపాటుగానే ఈనెల 21వ తేదీనుంచే అమలుకు వచ్చేటట్లు ఆతడిని సిఆర్‌పిఎఫ్ సర్వీసులనుంచి డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# నరమాంస భక్షకుడికి జీవితఖైదు

**లక్నో, మే 26:** మనిషిని చంపి ఆ తలతో సూప్ చేసుకుని తాగే నరమాంశ భక్షకుడికి ఉత్తర్ ప్రదేశ్ లోని లక్నో కోర్టు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది.ఇద్దరు వ్యక్తుల హత్యకేసులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సీరియల్ కిల్లర్ రామ్ నిరంజన్ అలియాస్ రాజా కోలందర్, అతడి సహచరుడు బక్షిరాజ్‌కు లఖ్‌నవూ కోర్టు జీవితఖైదు విధించింది. కోలందర్ నరమాంస భక్షకుడని, మనిషితలతో చేసిన సూప్ తాగడానికి ఇష్టపడేవాడనే ఆరోపణలు ఉన్నాయి. జడ్జి శిక్ష విధించే సమయంలో కోలందర్ కోర్టు గదిలో నవ్వుతూ కనిపించాడు. అతడిలో ఎటువంటి పశ్చాత్తాపం, భయం కనిపించలేదు. ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జర్నలిస్టు ధీరేంద్రసింగ్ హత్యకేసులో కోలందర్‌పై మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదైంది. పోలీసులు ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పుడు అతడి బండారం బయటపడి, అనేక ఇతర నేరాలు వెలుగులోకి వచ్చాయి. ధీరేంద్రసింగ్ హత్యకేసు దర్యాప్తు కోసం పోలీసులు కోలందర్ ఫామ్‌హౌసుకు వెళ్లగా అక్కడ మనుషుల పుర్రెలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని కోలందర్‌ను ప్రశ్నించగా పాతికేళ్ల కిందట 2000 సంవత్సరంలో మనోజ్ అనే వ్యక్తిని, అతడి డ్రైవరు రవిని తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. వారి మృతదేహాలను ముక్కలుగా నరికి పూడ్చిపెట్టినట్లు కోలందర్, బక్షిరాజ్ వెల్లడించారు. జర్నలిస్ట్ ధీరేంద్రను పిప్రీలోని తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి చంపినట్లు కోలందర్ తెలిపాడు.

# యశ్వంత్‌వర్మ కేసు వివరాలు ఆర్టీఐ కింద ఇవ్వలేం..!

## అర్జీదారుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే 26:** యశ్వంత్‌వర్మ ఇంటి ఆవరణలో నోట్లకట్టల వివాదంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలు, అంతర్గత విచారణ నివేదికలు,చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖలు వంటివాటిని బహిర్గతం చేయాలంటూ సమాచారహక్కు చట్టం కింద దాఖలయిన పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించింది. అంతేకాకుండా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానిమోడీలకు ఇచ్చిన సమా చారం వారి స్పందనను కూడా తెలియజేయాలని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ విచారణ మొత్తం గోప్యంగానే ఉంటుందని, ఆర్‌టిఐ దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటరీ ప్రతిష్టను ఉల్లంఘించినట్లవు తుందని అందుకే ఆర్టీఐకింద ఇవ్వడం సాధ్యం కాదని తెలియజేసారు. అంతకుముందు మాజీ సిజె ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు తన సిఫారసులను రాసారు. అలాగే త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా తన లేఖకు జతచేసారు. అలాగే జస్టిస్ వర్మనుంచి వచ్చిన స్పందనను కూడా ఆయన జోడించారు. ఇపుడు కార్యనిర్వాహక వ్యవస్థ, పార్లమెంటు పరిధిలోనే యశ్వంత్‌వర్మపై చర్యల అంశం ఉంటుందని అన్నారు. జడ్జి రాజీనామా చేయాలని చేసిన సూచనలు కూడా అమలుకు రానందున ఆయన్ను పదవీచ్యుతి చేయాల్సిం దేనని సంజీవ్‌ఖన్నా సూచించారు. ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిననివేదికలో యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా అనేక సిఫారసులున్నాయని అందువల్ల రాజీనామాచేయడమే మంచిదనిక ఊడా సూచించారు.

మొత్తం 50 మందినుంచి వాం గ్మూలాలను సేకరించారు. ఢిల్లీపోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ ఫైర్‌సర్వీస్ చీఫ్ వంటి ఉన్నతాధికారులనుంచి కూడా నివేదికలు కోరింది. జస్టిస్‌వర్మ అధికారిక నివాసం ల్యూటెన్ ప్రాంతంలో గత మార్చి 14వ తేదీ రాత్రి 11.35 గంటలకు జరిగిన ప్రమాదం అదుపుచేసేందుకు వెళితే అక్కడ నోట్లకట్టలు ఉన్నాయని అన్నారు. మార్చి24వ తేదీ సర్వోన్నత న్యాయస్థానం కొల్లిజియం జస్టిస్ వర్మను తన మాతృ సంస్థ అలహాబాద్ హైకోర్టుకు పంపించింది. అదేనెల 28వ తేదీ సుప్రీంకోర్టు జస్టిస్ వర్మకు ఎలాంటి కేసులు బాధ్యతలు అప్పగించవద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది.



# రోడ్‌షోలో మోడీపై పూలు చల్లి స్వాగతం పలికిన సోఫియా ఖురేషి కుటుంబం!

**వదోదర, మే 26:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వడోదరలో రోడ్‌షోతో పర్యటనను ప్రారంభించారు. త్రివర్ణపతాకాలతో ప్రధానికి వడోదర ప్రజలు ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని మోదీకి నారీశక్తి స్వాగతం పలికింది మోదీకి 30వేల మంది మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఆపరేషన్ సింధూర్‌తర్వాత తొలిపర్యటన గుజరాత్‌లోచేసిన మోడీకి స్వరాష్ట్రంలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రత్యేకించి వేలాదిగా మహిళలు రోడ్లకిరువైపులా బారులు తీరి మోడీ కాన్వాయ్‌పై పూలు చల్లుతూ కనిపించారు. కాగా గుజరాత్ లోని వడోదరలో ప్రధాని మోదీ పాల్గొన్న సింధూర్ సమ్మాన్‌యాత్రలో కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోఫియా ఖురేషీ వడోదర చెందినవారు. ఆమె కుటుంబీకులు అక్కడే స్థిరపడ్డారు. ప్రధాని మోదీ వడోదరలోనే రోడ్‌షో చేయడంతో, ఖురేషీ కుటుంబసభ్యులు రోడ్‌షోలో స్పెషల్‌గా కనిపించారు. మోదీపై కల్నల్‌సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ వారికి అభివాదం చేశారు. కాగా పహల్గామ్ ఉగ్రదాడిని కల్నల్ సోఫియా ఖురేషీ కుటుం బీకులు ఖండించారు.మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ తమకు చాలా గర్వంగా ఉందని సోఫియా సోదరి షాయనా చెప్పారు. భారత్‌వైపు ఎవరైనా చూడాలంటే ఇక భయప్డతారని షాయనా చెప్పారు. మహిళల సిం ధూరం కోసం తన కూతురు యుద్ధం చేయడం తనకు గర్వంగా ఉందని సోఫియా తల్లి చెప్పారు.

# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కమాండర్ మనీష్‌యాదవ్ హాతం



**రాంచి, మే 26:** మావోయిస్టు కమాండర్‌గా పేర్కొంటున్న మనిష్‌యాదవ్ సోమవారం జార్ఖండ్‌లోని లతేహార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హాతమయినట్లు పోలీసులు తెలిపారు. యాదవ్‌పై ఐదు లక్షల రివార్డుకూడా ఉంది. మరో వాంటెడ్ మావోయిస్టు కుందర్ ఖేర్వార్‌పైనా 10 లక్షల నగదు రివార్డు ఉంది. ఆతడిని ఎన్‌కౌంటర్‌ప్రాంతంనుంచే అరెస్టు చేసినట్లు తెలిపారు. కరంఖద్ ప్రాంతం, దౌనా ప్రనాంతాల్లోని అటవీప్రాంతాల్లో ఈ ఎదురుకాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. లతేహార్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో మావో యిస్టుల సంచారం ఉందన్న సమాచారంతో భారీ ఎత్తున గాలింపు చర్యలకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రినుంచే మావోయిస్టులకు, భద్రతా బలగాలకు కాల్పులుప్రారంభం అయ్యాయి.

ఆ తర్వాత తనిఖీల్లో మనిష్ యాదవ్ మృతదేహం లభించిందని పాలము డిఐసి వైఎస్‌రమేష్ తెలిపారు. మనీష్‌యాదవ్ తన బృందంతో అడవుల్లో ఉన్నట్లు సమాచారం అందగానే పోలీస్ టీమ్ ఏర్పాటుచేసి ఆపరేషన్ ప్రారం భించామన్నారు. మావోయిస్టులను గుర్తించిన వెంటనే సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా జరిపిన కాల్పుల్లో మనీష్‌యాదవ్ స్పాట్‌లోనే చనిపోయినట్లు తెలిపారు. రెండు ఆటోమేటిక్ తుపాకులు, రోజువారి వినియోగించే సామగ్రి ఆప్రాంతంలో లభించాయన్నారు. బీహార్ కేంద్రంగా ఉన్న మావోయిస్టు యూనిట్లు, బుద్ధపహాడ్ శిక్షణా కేంద్రం కూడా ఇకముగిసినట్లేనని డిఐజి చెప్పారు. గయ జిల్లాలోనిచక్రబంధ ప్రాంతానికి చెందిన యాదవ్ బీహార్‌లోని బుధపహాడ్‌ప్రాంతంలో టాప్ మావోయిస్టు కమాండర్‌గా కొనసాగుతున్నాడు. దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. దళంలో ఒక సామాన్య కేడర్‌నుంచి కమాండర్‌స్థాయికి వచ్చాడు. ఇపుడు ఎన్‌కౌంటర్‌ఝరిగిన ప్రాంతంలోనే ఆతని బంధువులు ఉంటున్నారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జార్ఖండ్ పోలీసులు రెండో మేజర్ సక్సెస్‌ను సాధించారు. జజెఎంపి కమాండర్ పప్పు లోహ్రా, సబ్‌జోనల్ కమాండర్ ప్రభాత్ గంఝులను కూడా ఎన్‌కౌంటర్‌లో హత్యచేసారు. లోహ్రా, గంజులపైనా వరుసగా పదిలక్షలు, ఐదు లక్షల రివార్డులున్నాయి.

# పాకిస్థాన్‌లో జ్యోతికి విఐపి భద్రత

## ఎకె47తో ఆరుగురు సెక్యూరిటీ




**న్యూఢిల్లీ, మే 26:** దేశ రహస్యాలను పవిత్ర యాత్రాస్థలాల వివరాలను శతృదేశానికి చేరవేసిందన్న అభియోగాలపై ఎన్‌ఐఎ అరెస్టుచేసిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ పర్యటనలో ఆమెకు అడుగడుగునా ఎకె47తో కూడిన భద్రతను కల్పించారు. కనీసం ఆరుగురు సాయుధ సిబ్బంది ఆమెకు భద్రతగా వెళ్లారు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో ఆమె పర్యటించిన దృశ్యాలు ఆమె ఫోన్‌లనుంచే వైరల్ అయ్యాయి. అదే సమయంలో ఒక స్కాటిష్ యూట్యూబర్‌కూడా పాక్‌లో పర్యటిస్తు ఆమెకు ఎందుకంత సెక్యూరిటీ ఇచ్చారని ఆశ్చర్యపోయినట్లు తేలింది. కాల్లమ్ అబ్రాడ్ పేరిట నిర్వహిస్తున్న యూట్యూబ్ నిర్వాహకుడు కాల్లమ్ మిల్ గత మార్చిలో పాకిస్తాన్‌లోపర్యటించాడు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌పర్యటనలో అనేకమంది సాయుధ సిబ్బంది జాకెట్లు ధరించి మరీ అక్కడ తిరుగుతుండటం చూసాడు. వారిమధ్యనుంచే జ్యోతి మల్హోత్రా విడియో షూట్‌చేయడం కూడా చూసాడు. తనను తాను జ్యోతితో పరిచయం చేసుకున్న కాల్లమ్‌ను ఎన్నిసార్లు వచ్చారని అడిగితే ఐదుసార్లు వచ్చానని చెప్పాడు. మీరు ఇండియాకు వచ్చినపుడు నేను కూడా పరిచయం చేస్తానని, పాకిస్తాన్ ఆతిథ్యం ఎలా ఉందని కాల్లంమ్‌ప్రశ్నిస్తే జ్యోతి చాలా గొప్పగా ఉందని బదులిచ్చిందని చెప్పాడు. ఆమెకోసమే ఈ సెక్యూరిటీ ఉందని అప్పుడు కాల్లం గుర్తించాడు. ఆమెచుట్టూ ఆరుగురు ఎకె47 తుపాకులతో ఉన్నారన్నారు. మరికొందరు పర్యాటకులుగా ఉన్నారని వారుకూడా జ్యోతి మల్హోత్రతో ఉన్నారన్నారు. అయితే సాయుధులు యూనిఫామ్‌లో లేరని సాదా దుస్తుల్లోనే కనిపించినట్లుస్కాటిష్ యూట్యూబర్ తెలిపాడు. ఆమెకు ఎందుకంత బందోబస్తు ఇచ్చారు. ఇంటెలిజెన్స్‌లోని అత్యున్నతస్థాయి అధికా రులతోకూడా ఆమెకు పరిచయాలున్నాయని స్కాటిష్ యూట్యూబర్ తన విడియోలో తెలిపాడు. అంతేకాకుండా భారత్‌కు వచ్చినతర్వాత జ్యోతిని అరెస్టుచేసిన ఎన్‌ఐఎ, పోలీసులు దర్యాప్తులో తేలింది. జ్యోతివద్దనుంచి మొత్తం ఆమె వినియోగించే ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ స్వాధీనంచేసుకున్నట్లు తేలింది. పాకిస్తాన్‌లో మాత్రం జ్యోటికి విఐపి ట్రీట్‌మెంట్ లభించిందని స్కాటిష్ యూట్యూబర్ విడియోద్వారా తేలింది.




# గంగూలీ సోదరుడి కుటుంబానికి తృటిలో తప్పిన ప్రాణాపాయం

**పూరి(ఒడిశా)మే 26:** క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఫ్యామిలీకి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఒడిశాలో ఆదివారం సౌరవ్ గంగూలీ సోదరుడు స్నేహాశిష్ గంగూలీ మరియు అతని భార్య అర్పితకు సముద్రంలో ప్రమాదం సంభవించింది. వారు ప్రయాణిస్తున్న స్పీడ్ బోట్ మునిగిపోవడంతో తృటిలో తప్పించుకున్నారు. పూరీలో సెలవులను ఎంజాయ్ చేస్తున్న గంగూలీ దంపతులు బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ఆస్వాదిస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. లైఫ్‌గార్డ్‌లు పర్యాటకులను రక్షించడానికి ప్రయత్నిస్తుండగా సముద్ర జలాల్లో స్పీడ్ బోట్ తలక్రిందులయింది. అధికారులు వారిని రక్షించడానికి రబ్బరు ఫ్లోట్‌లను ఉపయోగించారు. పడవలో ప్రయాణికుల సామర్థం తక్కువగా ఉండటం వల్ల పడవ తేలికగా ఉండటం వల్ల అది బోల్తా పడిందని అర్పితా గంగూలీ ఆరోపించారు.సముద్రం ఇప్పటికే చాలా అల్లకల్లోలంగా ఉంది. పడవలో 10 మంది సామర్థం ఉంది. కానీ వారు ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులను మాత్రమే ఎక్కించుకున్నారు. ఆ రోజు సముద్రంలోకి వెళ్ళిన చివరి పడవ ఇదే. సముద్రంలోకి వెళ్ళడంపై మేము ఆందోళన వ్యక్తం చేసాము, కానీ ఆపరేటర్లు అంతా బాగానే ఉందని మాకు చెప్పారని శ్రీమతి గంగూలీ అన్నారు. సముద్రంలోకి వెళ్ళిన వెంటనే, ఒక పెద్ద అల పడవను ఢీకొట్టిందని ఆమె చెప్పారు. లైఫ్‌గార్డ్‌లు రాకపోతే మేము బతికేవాళ్లం కాదన్నారు. పడవలో ఎక్కువ మంది ఉంటే, బహుశా అది తిరగబడి ఉండేది కాదని ఆమె అన్నారు. పడవలను నడిపే ఆపరేటర్ల నైపుణ్యంపై మరింత పరిశీలన చేయాలని గంగూలీ పిలు పునిచ్చారు. అధికారులు ఇక్కడ ఈ క్రీడలను నిషేధించాలి. పూరి బీచ్‌లో సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంటుంది. నేను కోల్‌కతాకు తిరిగి వెళ్లిన తర్వాత, ఇక్కడ జల క్రీడలను నిలిపివేయమని కోరుతూ పోలీసు సూపరింటెండెంట్ మరియు ముఖ్యమంత్రికి లేఖ రాస్తాను అని ఆమె చెప్పారు.

## భారత్ 'బాయ్‌కాట్' వేళ..

# పాక్-తుర్కియే తొలి భేటీ



**అంకారా, మే 26:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ ఉత్పత్తులను నిషేధించాలంటూ 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం మార్మోగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. ఇస్తాంబుల్‌లో ఆదివారం రాత్రి వీరి సమావేశం జరిగింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పాక్ ప్రధాని చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. 'నా ప్రియమైన సోదరుడు ఎర్డోగాన్‌తో గౌరవప్రద భేటీ జరిగింది. భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో మాకు అండగా నిలిచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షించాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. పాక్-తుర్కియే స్నేహబంధం సుదీర్ఘకాలం కొనసాగాలి' అని షెహబాజ్ షరీఫ్ పోస్టులో రాసుకొచ్చారు. అటు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కూడా షెహబాజ్ వెంట వెళ్లారు. దీనిపై ఎర్డోగాన్ కూడా స్పందించారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉందని అన్నారు. రాజకీయ, వాణిజ్య రంగాల్లో చారిత్రక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత వీరిద్దరూ భేటీ అవడం ఇదే తొలిసారి. భారత్-తుర్కియే మధ్య విభేదాలు నెలకొన్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఖరీఫ్ పంటలకు సబ్సిడీతో విత్తనాలు అందించాలి

## కలెక్టరేట్, ఆర్డీఒ, మండల కేంద్రాల్లో కౌలు రైతుల ఆందోళన




కలెక్టరేట్‌లో వినతి పత్రం అందిస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ సీజన్ లో పండించే పంటలకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడీ యల్లమందారావు, కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ వాసు తదితరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ మొదటి వారం నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నప్పటికి ఇంతవరకు పంటల వారీగా ప్రణాళికలు, క్రెడిట్ ప్రణాళికలు, విత్తన ప్రణాళికలు ప్రకటించలేదని, సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఖరీఫ్ కు అవసరమైన పరపతి సౌకర్యం, విత్తనాలు, వ్యవసాయపరికరాలు అందించి రైతులకు అండగా నిలబడాలని కోరారు. నేడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని చేపట్టిన కార్యక్రమంలో భాగంగా యన్ టి ఆర్ జిల్లా, విజయవాడలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ లక్ష్మీ నరసింహ్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.జమలయ్య, యం.యలమందారావు, నిమ్మగడ్డ వాసు మాట్లాడుతూ జిల్లాలో 90 శాతం కౌలురైతులే వ్యవసాయం చేస్తున్నారని, వీరికి ఇంతవరకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయలేదని గ్రామసభలు నిర్వహించలేదని దీనివల్ల కౌలురైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మార్కెట్ లో అన్ని రకాల పంటల విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని,విత్తనాల ధరలు పెరగడంతో పాటు నాణ్యతలేని విత్తనాలను బయట మార్కెట్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారని, చదువు లేని రైతాంగ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కల్తీ, నకిలీ విత్తనాలు రైతాంగానికి అంటగడుతున్నారన్నారు.



# గాలివానల వలన విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది కలుగకూడదు

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**విజయవాడ , మే 26,ప్రభాతవార్తప్రతినిధి:** ముందస్తు రుతుపవనాల ప్రభావంతో ఏర్పడే గాలివానల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీట్రాన్స్కో , డిస్కాములతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం వచ్చినా, తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిస్కాములకు ఆయన సూచించారు. దీనికోసం డిస్కంల దిలీదీలు రోజూ వారి పరిస్థితిని సమీక్షించాలని ఏఈ నుండి ఎస్ఈ ) వరకు ఫీల్డ్ స్థాయిలో సమన్వయం తో పనిచేయాల్సిన అవసరం ఉందని కె విజయానంద్ పేర్కొన్నారు. అన్ని డిస్కంలు 247 కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని తద్వారా ఎమర్జెన్సీ సమయంలో తక్షణ స్పందన, ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతాయని తెలిపారు. విద్యుత్ మరమ్మత్తు పనులు లేదా షట్డౌన్ల విషయంలో వినియోగదారులు మరియు ప్రజాప్రతినిధులకు ముందుగా మీడియా, మొబైల్ కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం గా వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన స్పందన, పారదర్శక సమాచారం ఇచ్చే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. లైన్ మెయింటెనెన్స్ , చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ వంటి పనులు నిర్వహిస్తున్నప్పుడు, విద్యుత్ అధికారులు ప్రత్యక్షంగా అక్కడే ఉండాలని, ఇది ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడానికీ, సమర్ధవంతంగా పనులు చేపట్టడానికి తోడ్పడుతుందన్నారు . ప్రతి డిస్కమ్ డైరెక్టర్కు రెండు లేదా మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో, విద్యుత్ వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేసేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా పరిస్థితి, పీక్ డిమాండ్ సీజన్కు సిద్ధత, కింద జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, అలాగే ఇటీవల జరిగిన వాతావరణ ప్రభావాల నుంచి పునరుద్ధరణ చర్యల పురోగతిపై సమీక్ష చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో , ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం తో, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. వేసవి, అకాల వర్షాలు వంటి అత్యవసర సమయాల్లో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు, డిస్కంలు పీక్ లోడ్ మేనేజ్మెంట్ను బలోపేతం చేయాలని , ఛిదీలీ పనులను వేగవంతం చేయాలని , వినియోగ దారుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను మరింత ప్రభావవంతంగా నిర్వ హించాలని సీఎస్ ఆదేశించారు. నమ్మకమైన విద్యుత్ సరఫరా అనేది రాష్ట్రాభివృద్ధికి దోహద పడుతుందన్నారు.



# తిరుపతిలో 'బైక్‌రైడర్ల'పై కొరడా!

**తిరుపతి,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం...విద్యాకేంద్రంగా విరాజిల్లుతున్న తిరుపతినగరం శివార్లలో యువత సామాజిక మాధ్యమాలు వేదికగా నగరరోడ్లపై బైక్‌రేసింగ్‌లు, బైక్ స్టంట్స్ చేస్తున్నవారిపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపిస్తున్నారు. ఇప్పటివరకు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు, చెడువ్యసనాలకు బానిసై శృతిమించిన వారిపై ఏకంగా పోలీసులు కేసులు నమోదు చేసేవారు. తాజాగా తిరుపతి నగరంలో డ్రోన్‌కెమెరాల,సోలార్ సిసికెమెరాల నిఘాతో ఇలాంటి పెడదారిన పట్టిన, నగరరోడ్లపైనేగాక శివార్లలోని బైపాస్‌లలో, చివరకు గరుడవారధిపై రాత్రి సమయాల్లో అర్ధరాత్రి దాటినా బైక్‌రేస్‌లు, బైక్‌స్టంట్స్, బైక్‌తో ఆర్ట్స్ చేస్తుండటంతో డ్రోన్ కనిపెట్టి సమాచారం అందించింది. దీంతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు, చంద్రగిరి పోలీసులను అలర్ట్‌చేశారు. తిరుపతి డిఎస్పీ రామకృష్ణమ ఆచారి, రూరల్ డిఎస్పీ ప్రసాద్ సిఐలతో సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఇలాంటి వాటికి పాల్పడుతున్న పదిమంది యువతను అదుపులోకి తీసుకున్నారు. సామాజికమాధ్యమాల్లో పోస్టులు పెట్టి యువతను ఆకర్షిస్తున్న అకౌంట్స్ ను గుర్తించారు. ఏకంగా సోమవారం యువత తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి డిఎస్పీ రామకృష్ణమా ఆచారి, సిఐలు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పిల్లల వ్యసనాలు వెలుగుచూసింది. అంతేగాక అర్ధరాత్రిదాటిన తరువాత పిల్లలు ఇంటికి వస్తే గట్టిగా ప్రశ్నించాలని, ఇలాంటి బైక్‌లతో రేసింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలతో దళితులు అభివృద్ధి

## - మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

**చిత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారి చిన్నయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాలలు, మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 954 యూనిట్లు, తిరుపతి జిల్లాలో 1,267 యూనిట్లు మంజూరు అయ్యాయని, ఈ రెండు జిల్లాలకు కలిపి 2,221 యూనిట్లు మంజూరు అయితే 92 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 117 షాపులు వున్నాయని, 2014-2019 సంవత్సర మధ్యకాలంలో రాష్ట్రంలో 7,500 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెడితే అందులో 40 వేల కోట్ల రూపాయలు దళితుల అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో 2015-2018 సంవత్సర మధ్యకాలంలో జిల్లాలో 242 కోట్ల రూపాయలతో 4 లక్షల మంది యువతకు వివిధ రకాలుగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే సబ్‌ప్లాన్ ద్వారా జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డ్రైవర్లుగా వున్న దళిత యువతను ఓటర్లుగా మార్చిన ఘనత సిఎం నారా చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా వున్న నారా లోకేష్ 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు రాష్ట్ర వ్యాప్తంగా వేస్తే అందులో ఎక్కువ శాతం దళిత గ్రామాల్లో వేయడం జరిగిందన్నారు.

# పిల్లల కళ్లముందే తల్లి దుర్మరణం

### కదులుతున్న రైలు ఎక్కబోతుండగా ప్రమాదం





**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రైలు బోగీ మారేందుకు యత్నించిన ఓ మహిళ ప్రమాదవశాత్తూ రైలు, ప్లాట్‌ఫాం మధ్య పడిపోయి ప్రాణాలు కోల్పో యింది. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో కన్నపిల్లల కళ్ల ముందే ఆ తల్లి రైలు బోగీ నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్లో విషాదాన్ని నింపింది. సికిందరాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎపిలోని అనకాపల్లి జిల్లా దొండపూడికి చెందిన మట్ట వెంకటేశ్, శ్వేత (33) దంపతులు. నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్ తన భార్య శ్వేత, ఇద్దరు పిల్లలతో కలిసి లింగంపల్లి హెచ్ఎంటీ టౌన్‌షిప్ చింతల్ చంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు పూర్తవుతున్న క్రమంలో కొద్దిరోజులు శ్వేత తన ఇద్దరు పిల్లలతో దొండ పూడిలో గడిపి రావాలనుకుంది. ఇందుకోసం భర్త వెంకటేశ్ ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేశాడు. ఆదివారం ఉదయం భార్య, పిల్లలను లింగంపల్లి రైల్వే స్టేషన్ తీసుకువచ్చిన వెంకటేశ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి డీ-3 బోగీలోని సీట్లలో కూర్చోబెట్టాడు. సీట్ నంబర్ సరిగా ప్రింట్ కాక పోవడంతో.. వీరు డి-8 బోగీలో ఎక్కాల్సి ఉండగా పొరపాటుగా డి-3లో ఎక్కారు. రైలు లింగంపల్లి స్టేషన్‌కు చేరాక..వేరే ప్రయాణికులు వచ్చి తమ సీట్లు అని చెప్పడంతో ఆమె విషయాన్ని గుర్తించారు.

తన వద్ద ఉన్న టికె టును మరోసారి సరిచూసుకోగా తన బోగీ డి-8గా గుర్తించింది శ్వేత. రైలులో రద్దీ ఎక్కువగా ఉండడంతో 3-డి నంబరు బోగీ నుంచి 8-డి నంబర్ బోగీ వరకు బోగీల మార్గం నుంచి వెళ్లడం సాధ్యం కాలేదు. బోగీలో రద్దీ ఉండటంతో ఆమె చర్లపల్లి స్టేషన్‌లో రైలు దిగి ఇద్దరు పిల్లలతో పాటు డి-8 బోగీ వద్దకు చేరుకున్నారు. పిల్లలను, లగేజీని హుటాహుటిన బోగీ లోకి ఎక్కించి తాను ఎక్కేందుకు ఉపక్రమిస్తున్న సమయంలోనే రైలు కదులుతూ వేగం పుంజుకుంది. దీంతో కాలుజారి కిందపడిన శ్వేత బోగీకి ప్లాట్‌ఫామ్ మధ్యలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై పట్టాల పక్కన పడిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు, పోలీసులు ఆమెను రక్షించే ప్రయత్నం చేస్తుండగానే అప్పటికే మృతి చెందింది. తమ కళ్లెదుటే తల్లి చనిపోవడంతో పిల్లలు బోరున విలపిస్తూ తల్లడిల్లిపోయారు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరు కున్న భర్త వెంకటేశ్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆన్లైన్ టికెట్లో ప్రింట్ సరిగా పడని కారణంతోనే తన భార్య రైలు ప్రమాదానికి బలైందన్నాడు. శ్వేత మృతదేహానికి గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు.

# అక్రమ ప్యాకింగ్ వాటర్‌పై బిఐఎస్ కొరడా

## - విజయనగరంలోని శ్రీ గంగా భవానీ ఆక్వా ఇండస్ట్రీస్ పై దాడులు



**విజయవాడ, మే 26, ప్రభాతవార్త :** భారతప్రమాణాల మంత్రిత్వ శాఖ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం విజయవాడ శాఖాధికారులు అక్రమ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్ పై దాడులు నిర్వహించారు. బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండానే లో నకిలీ బిఐఎస్ లేబుల్స్‌తో ప్యాకింగ్ చేసిన వాటర్‌ను మార్కెట్లో చలామణి చేస్తున్న విజయనగరంలోని శ్రీ గంగాభవాని ఆక్వా ఇండస్ట్రీస్ విజయవాడ బిఐఎస్ అధికారులు రైడ్ చేసి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా బిఐఎస్ విజయవాడ శాఖ సైంటిస్ట్ సి/ డిప్యూటి డైరెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 17(3) ప్రకారం సరైన నిబంధనలు పాటించని సంస్థలపై చట్ట ప్రకారం తాము చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులకు మొదటి ఉల్లంఘన సందర్భంలో 2 ఏళ్ళ జైలు శిక్ష లేదా రెండు లక్షల జరిమానా, రెండోసారి అయితే 5ఏళ్ళ జైలు, రు5లక్షల జరిమానా వుంటుందన్నారు. కోర్టు నిర్ణయం మేరకు ఉత్పత్తి చేసిన, విక్రయించిన వస్తువులపై పదిరెట్లు వరకు జరిమానా పొడిగిస్తామన్నారు. నకిలీ వస్తువుల పంపిణీ చేయకుండా నిరోధానికి ప్రజలంతా అప్రమత్తంగా వుంటూ బిఐఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగం చాలన్నారు. అలాగే బిఐఎస్ నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రజలెవరికైనా తెలిస్తే సదరు సమాచారాన్ని బిఐఎస్ యాప్ ద్వారా ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని,

ఫిర్యాదు దారు వివరాలు గోప్యంగా వుంచుతామన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

## ఇఓ వికె శీనా నాయక్



మీడియాకు వివరిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 26, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో జరిగే అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరపించి త్వరలో భక్తులకు అందుబాటులోకి తెస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జూన్ 3 నుండి 5 వరకు నవగ్రహ మండపం పున:ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో అన్నదాన భవనం, లడ్డూపోటు తదితర నిరా ్మణాలను దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేలా పనులు వేగిరం చేసామన్నారు. రాతియాగశాల , పూజా మండపాలు శ్రావణమాసంలో అందుబాటులోకి తెస్తామన్నారు ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్టాండ్, రైల్వేస్టేషన్, పున్నమిఘాట్ వద్ద నుండి బస్సులు ఏర్పాటు చేసి కొండపై ట్రాఫిక్ రద్దీ నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. సీతమ్మవారి పాదాల వద్ద 4 ఎకరాల్లో హోల్డింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, అవసరమైతే కుమ్మరిపాలెం వద్ద టిటిడి స్థలంలో కూడా హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. దుర్గాఘాట్‌ను విస్తరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పథకం ద్వారా నిధులను రాబట్టడానికి విజయవాడ ఎంపి, పశ్చిమ ఎమ్మెల్యేలు విశేష కృషి చేస్తున్నారన్నారు. అలాగే అమ్మవారి నైవేద్య విరామ సమయంలో ఉదయం 11.30 నుండి 1.30 వరకు విఐపి దర్శనాలు నిలిపేశామన్నారు. ఆ సమయంలో క్యూలైన్లో భక్తులకు, వృద్దులకు, పసిపిల్లలకు ఇబ్బందికలగడానికి తాను స్వయంగా చూశానని, దాంతో విఐపి దర్శనాలు క్రమబద్దీకరణ చేశామన్నారు. దర్శనానికి వచ్చే విఐపిలు వివరాలతో కూడిన ఫార్మట్‌ను ముందుగా తమకివ్వాలన్నారు.

# చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

## మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,మే 26,ప్రభాతవార్త ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి, సినీ రంగానికి సంబంధించి ఇటీవల చోటు చేసుకున్న పలు పరిణామాల గురించి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారు. ఆయన "ఎక్స్ "సినిమా విషయాలపై పరిజ్ఞానం లేని వారు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. సినీ ప్రముఖులు కలవలేదని మేము ఎప్పుడైనా పరి శ్రమకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నామా? అని ప్రశ్నించారు. డీజీపీని మేమేదో అన్నట్లు వక్రభాష్యాలు చెప్పేవాళ్ళు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సినిమా టికెట్ల రేట్లు పెంచమని సినీ రంగం నుండి నిర్మాతలు విడివిడిగా వచ్చి తమను కలుస్తారని, తాము కూడా అందుకు సరే అని చెబుతున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ క్రమంలో ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారని తద్వారా అధికారులు కోర్టులు చుట్టూ తిరిగే దుస్థితి నెలకొందన్నారు. టికెట్ల ధరల పెంపుపై దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోందన్నారు. ఈ విధానాలన్నింటికి చెక్ పెట్టి నూతన ఫిల్మ్ పాలసీ ద్వారా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధానాలను తీసుకురావాలని భావించామన్నారు. సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసమే తాము రేట్ల పెంపుకు అనుమతిస్తున్నామన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని కొందరు అహంభావంతో మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. ఇది సరైన విధానం కాదని సూచించారు. సినిమా రంగం వ్యాపారమని కొందరు మాట్లాడుతున్నట్లుగా సినిమా రంగానికి ప్రభుత్వంతో సంబంధం లేనప్పుడు గత ప్రభుత్వాన్ని సినీ ప్రముఖులు ఎందుకు కలిశారన్నారు.

# యోగాచరణతో దేహదారుఢ్యం, మానసిక ఆరోగ్యం మన సొంతం

## ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు



విజయవాడ యోగ అభ్యసన చేస్తున్న అధికారులు

**విజయవాడ,మే 26,ప్రభాతవార్త ప్రతినిది** శ్వాసపై ధ్యాసతో తనువు మనసును ఏకం చేసి.. సుసంపన్న ఆరోగ్యాన్ని బాటలు వేసే యోగా ఔన్నత్యాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ చేరువచేసే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా థీమ్ యోగా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. సోమవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆయుష్ శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో థీమ్ యోగా కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ జి.వీరపాండ్యన్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ గిరీష పీఎస్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు, నగర ప్రజలు పాల్గొని డా. రత్న ప్రియదర్శిని మార్గనిర్దేశనంతో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ మే 21న ప్రారంభమైన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 రోజులపాటు 26 ఇతివృత్తాలతో థీమ్ యోగా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు వివరించారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం రెండుకోట్ల మందికి యోగాలో ప్రవేశం కల్పించాలనే యోగాంధ్రను నిర్వహిస్తున్నామని, గ్రామ/వార్డు, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని.. రాష్ట్రస్థాయి విజేతలు జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో గౌరవ ప్రధానితో ఇంటరాక్ట్ కానున్నారని స్పెషల్ సీఎస్ కృష్ణబాబు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయానికి ఏడుగురు చొప్పున దాదాపు దాదాపు అయిదువేల మంది ట్రైనర్లతో ప్రజలకు యోగాసనాలు నేర్పించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగా ప్రయోజనాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకొని జీవితాంతం అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. విజయవాడలో బీఆర్‌టీఎస్ రోడ్డును యోగా స్ట్రీట్‌గా గుర్తించి, ప్రతిరోజూ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామ ప్రదర్శన, మెడిటేషన్, యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే, యోగా క్విజ్, యోగా పోస్టర్, స్లోగన్ తదితరాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

# కూటమి ప్రభుత్వమొచ్చాక ఆయుష్ బలోపేతం

## - వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్



**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం ఆయుష్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఆయుష్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంతో పాటు వారికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానానికి రూపకల్పన చేసిందని ఆయన చెప్పారు. కేంద్ర పర్యాటక శాఖతో నిరంతరం కూటమి ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సోమవారం చెన్నయ్ లో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల మంత్రులు, అధికారుల రెండవ ఆయుష్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఆయుష్ ఆధారిత ఆరోగ్య పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా గతేడాది సెప్టెంబరులో ముంబయిలో మొదటి సదస్సును నిర్వహించింది. చెన్నైయ్ లో జరిగిన రెండవ సదస్సు ఇప్పుడు నిర్వహిస్తుంది.ఇందులో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మహానంది, బెలుం గుహల వంటి పర్యాటక కేంద్రాలతో పాటు సుదీర్ఘమైన సముద్ర తీరం కూడా ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ సముద్ర తీరం వున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకించి 960 కిలో మీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉందన్నారు. దీంతో పాటు అత్యంత సుందరమైన బీచ్ లు కూడా ఏపీలో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానాన్ని రూపొందించిందన్నారు. ఈ కొత్త విధానంలో ఆయుష్ వెల్నెస్ వంటి అంశాలను సమ్మిళితం చేశామన్నారు. రాష్ట్రంలో పర్యాటకులను యాత్రా స్థలాలకన్నా మిన్నగా పర్యాటక కేంద్రాలు ఆకర్షిస్తున్నాయన్నారు. రాష్ట్ర పర్యటనకొచ్చే వారిలో దేశీయ పర్యాటకులతో పాటు అంతర్జాతీయ పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో యాత్రా స్థలాలతో పాటు పర్యాటక కేంద్రాలను కూడా విస్తరించి అక్కడ పర్యాటకుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ఆయుష్ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు.

# 28న ఆర్జీయుకెటి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

### ఆరేళ్ల బిటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఒకే ఒక్క ట్రిపుల్ ఐటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ప్రవేశాలకు ఈ నెల 28(బుధవారం)న నోటిఫికేషన్ వెలువడనుంది. బాసర లోని ఆర్జీయూకేటీలో 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రాం ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను 28 విడుదల చేయాలని నిర్ణయించినట్టు యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ తెలిపారు. ఆర్జీయూకేటీలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను 28న విడుదల చేయనున్నామని, ప్రవేశాలకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచబడుతుందని విసి తెలి పారు. వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ఆర్జీయూకేటీలోని 1500 సీట్లతోపాటు అదనంగా మరో కొత్త కోర్సులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించనున్నట్టు తెలిసింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తోపాటు డాటాసైన్స్, మెషన్ లెర్నింగ్ కోర్సులను ప్రారంభించాలని.. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 180 సీట్లలో అడ్మిషన్లను తీసుకోనున్నట్టు తెలిసింది.

# తెలుగు వర్సిటీ రెగ్యులర్ కోర్సుల ప్రవేశం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 26, ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 విద్యాసంవత్సరానికిగాను వివిధ రెగ్యులర్ కోర్సుల ప్రవేశ ప్రకటనను సోమవారం విడుదల చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే శిల్పం-చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర, పర్యా టకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సుల కొరకు ఎం.ఎ; డిగ్రీ; డిప్లొమా; సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో అర్హత కలిగిన ఆశక్తిగత విద్యార్థుల ప్రవేశం కోసం విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతుంది. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్లు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సటీ.ఏసి.ఇన్; డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. పిఎస్‌టియుసెట్.ఓఆర్‌జి (ఆర్గ్)లను సందర్శించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను తేదీ 24-6-2025లోగా సాధారణ రుసుముతో; తేదీ 30-6-2025 వరకు ఆలస్య రుసుముతో స్వీకరించడం జరుగుతుందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఈ ప్రకటనలో తెలిపారు.

# స్కిల్ వర్సిటీ నిర్మాణానికి ఒక్క గోడైనా కనీసం నిర్మించారా?

### బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16 నెలలుగా ఒక్క సిమెంట్ బస్తా వినియోగించని దుస్థితిలో ఉన్నారని, యంగ్ ఇండియా నా బ్రాండ్ అని చెప్పుకుంటూ స్కిల్ యూనివర్శిటీ నిర్మాణానికి కనీసం ఒక్క గోడైనా కట్టించారా? బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్ సారంగుల ప్రశ్నించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి చేయలేక కేంద్రం ఏం చేయలేదు, మోడీ ఏం ఇవ్వలేదంటూ పిచ్చి ఆరోపణలు చేయడం తప్ప సిఎం దగ్గర ఇంకోటి లేదన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. జిహెచ్ఎంసి పరిధిలో 100 కోట్లకు ఎకరం విలువైన ప్రాంతాల్లో రోడ్ల మీద గుంతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా, జిహెచ్ఎంసికి కేవలం రూ.3000 కోట్లు కేటాయించి, వాటిని కూడా పూర్తిగా వినియోగించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. ఇటీవల పాతబస్తీ చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. అగ్నిమాపక శాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్ కేవలం రూ.10 కోట్లు అన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన గంటన్నర తర్వాత ఫైర్ సిబ్బంది వచ్చారు. ఇదేనా గవర్నెన్స్ అన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధికి చోటేలేదు. వారి పాలన అంటే డిస్ట్రక్షన్, కూల్చివేతలు, రైతు ఆత్మహత్యలు అన్నారు. హైదరాబాద్ నగరంలో అభివృద్ధి చేయకుండా పేదల ఇళ్లను కూల్చడం తప్ప ఇంకోటి కనిపించడంలేదన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక్క పార్క్ అయినా కట్టించండి, ఒక్క చెరువు అయినా పునరుద్ధరించండి అంటూ సవాల్ విసిరారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బండ ప్రకాష్, హరీశ్‌రావు

# ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### లేదంటే యుద్ధానికి సిద్ధమవుతాం

### శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్

**నంగునూర్, మే 26, ప్రభాతవార్త :** కాంగ్రెస్ సర్కారు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. హామీలు నెరవేర్చకుంటే యుద్దానికి సైతం సిద్ధమవుతామని శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకులలో సోమవారం పండగ సాయన్నా ముదిరాజ్,కొరవి కృష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహాలను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 70 యేళ్లు అయినా పేద ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కెసిఆర్ హయాంలోనే మత్స్యకారులకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణ వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకొని గుర్తుంచుకుంటున్నామన్నారు. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ అందాల పోటీల నిర్వహణకు ప్రభుత్వం వద్ద పైసలు ఉన్నాయి కానీ రైతులకు విత్తనాలు, మత్స్యకారులకు చేపపిల్లలు ఇవ్వడానికి మాత్రం పైసలు లేవట అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ శ్రేణులు జాప శ్రీకాంత్‌రెడ్డి, రాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడ్డి, దువ్వల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్టార్ అరుణ

**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త:** ఖమ్మం రూరల్ మండలం సబ్ రిజిస్టార్ కార్యాలయం లో ఏసీబీ డీస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి నుండి 30,000 లంచం తీసుకుంటు రూరల్ సబ్ రిజిస్టర్ అరుణ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ డాక్యుమెంట్ రైటర్ ద్వారా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం 50 వేల రూపాయల డిమాండ్ చేసి 30 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు. మొదట యాభై వేలు డిమాండ్ చేసి 30 వేల రూపాయలు తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

# ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు భేష్



### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు సమర్థతను నిరూపించుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ జెండర్‌లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 6 నెలల క్రితం ప్రయోగాత్మకంగా మహిళా శిశు సంక్షేమ, వృత్తిలో దివ్యాంగులు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్‌గా నియమించిన ప్రభుత్వం.. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రా ఫిక్ అసిస్టెంట్‌గా ట్రాన్స్ జెండర్లు 10 రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్‌లో నియమించి రికార్డు సృష్టించిందన్నారు. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని, ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్‌లను నియమించామన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ ఉదయపూర్‌లో నిర్వహించిన చింతన్ శివిర్‌లో తాను ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు చెప్పారు. పోలీస్ శాఖలోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్‌లను నియమించే ఆలోచనతో సిఎం ఉన్నట్లు తెలిపారు. పోలీస్ డ్రెస్‌లో ట్రాన్స్ జెండర్‌లను చూసి సామాన్యులు సెల్యూట్ కొడుతున్నారన్నారు. కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని తోటి ట్రాన్స్ జెండర్‌లలో నమ్మకం కలిగించాలని, ప్రభుత్వ సహాయాన్ని అందుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ట్రాన్స్‌జెండర్‌ల ఆరోగ్య పరిరక్షణ కోసం త్వరలో మరిన్ని మైత్రి క్లినిక్లను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అసిస్టెంట్లుగా తమకు అవ కాశం కల్పించిన మంత్రి సీతక్కను, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్‌ను ట్రాన్స్‌జెండర్లు సన్మానించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, వృద్ధులు, దివ్యాంగులు ట్రాన్స్ జెండర్ల శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, ప్రముఖ రచయిత్రి, మహిళా హక్కుల నేత కొండవీటి సత్యవతి, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ వల్లనే దేశంలో సాకారం కానున్న కులగణన

### దేశంలో విస్తృత కులగణనకు కేంద్రం రూ.8వేల కోట్లు కేటాయించాలి

### అఖిల భారత కాంగ్రెస్ ఒబిసి రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ వల్లనే దేశంలో కులగణన సాకారం కాబోతుందని తెలంగాణ బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తమ ఒత్తిడి వల్లనే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ ప్రణాళికను సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగా సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓబీసీ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో ఏఐసిసి నాయకులు, పిసిసి అధ్యక్షులు, ఓబిసి మంత్రులు, బిసి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వల్లన దేశంలో కులగణన సాకారం కాబోతుందని.. రాహుల్ గాంధీకి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపడం, తదుపరి కార్యాచరణ ఖరారు చేసుకోవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నేతలు, ప్రజా ప్రతినిధులు సమావేశమ య్యామని తెలిపారు. రాహల్ గాంధీ డిమాండ్ చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం వల్లనే కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగ కుల గణనకు నిర్ణయం తీసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లను మోడీ ప్రభుత్వం కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అయితే దేశంలో కుల గణన చేసేందుకు సుమారు రూ.8 వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా ఉందని మంత్రి పొన్నం తెలిపారు. కులగణన పూర్తికి నిర్దిష్ట కాలపరిమితి కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించలేదని.. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓబీసీ నేతల అభిప్రాయం తీసుకున్నామని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్షలాది మందితో పెద్ద ఓబీసీ ర్యాలీని కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం చేసిన కులగణన గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కులగణన అనంతరం సామాజిక న్యాయం జరిగేలా రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని దానికి అన్ని పార్టీలు మద్దతు ఇచ్చారని మంత్రి పొన్నం తెలిపారు.

# నకిలీవిత్తన సరఫరాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

### డిజిపికి ఫిర్యాదు చేసిన బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై మనీలాండరింగ్ యాక్ట్, అలాగే యజమానులపై పిడియాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం కల్పించాలంటూ బిజెపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర బృందం డిజిపిని కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా డా. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా ఎస్ఐఎంజెఎఎస్‌టిఎ, హైటెక్, భేయర్, ఎస్ఐబిఐ వంటి కంపెనీలు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే ఈ మోసాలు జరుగుతున్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలపై భరోసా ఉంచిన గిరిజన రైతులు పూర్తిగా నష్టపోయారు. అప్పుల్లో కూరుకుపోయిన కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇది కేవలం వ్యవసాయ విఫలం కాదు - అమాయక గిరిజ నులపై అవినీతి రాష్ట్ర ప్రభుత్వ కుట్ర. బాధ్యులైన కంపెనీలపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇటువంటి మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 3000 ఎక రాలు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి 800 వందల మంది గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాని డిమాండ్ చేశారు. చనిపోయిన 5 గురు రైతుల కుటుం బాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా నియంత్రణ చర్య లు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాల న్నారు. మంత్రి సీతక్కకు ఇసుక క్వారీలపై ఉన్న శ్రద్ధ, అందాల పోటీలపై ఉన్న ఆసక్తి గిరిజన రైతుల ఆత్మహత్యలపై ఏమాత్రం లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఈవిషయంలో స్పందించలేదని, ముఖ్యమంత్రి సమీక్షలు చేస్తున్నా, గిరిజన రైతుల విషయంలో పూర్తిగా విస్మరించారన్నారు. మంత్రివర్గంలో ఒక్క గిరిజన మంత్రిని కూడా నియమించని ఈ ప్రభుత్వ ధోరణి గిరిజనుల పట్ల అవమానకరంగా ఉందిని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిపిని కలిసిన ఎస్‌టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ నేనావత్, రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్, మహేష్ రూపావత్, బానోత్ అనూష, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగం రక్షణకు చర్యలు తీసుకోవాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యత గల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంతోనే పుట్టిన చేనేత వృత్తి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాను రాను నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగానికీ ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు వృత్తి ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలని.. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సంఘం గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావుతోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతా రాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, దేవాదాసు, రాపోలు జగన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎస్ సబ్ తరహాలో బిసిలకు సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. తద్వారా కుల వృత్తుల పరిరక్షణకు.. వృత్తుల వారికి నిధులను కేటాయించి వాటిని ఆధునీకరించి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో చేనేత సహకారా సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించా లన్నారు. ఎన్నికలకి ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని దాటే వేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృత్తిదారుల సమస్యలను పరిష్కారించాలనే చిత్తశుద్ధి లేద న్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా తన గళాన్ని వినిపిస్తానని, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతోపాటు ఈ ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘాలన్నీ సంఘటితం కావాలన్నారు.



# త్వరలో ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో ఆధార్ ఇ-సంతకం

### పైలట్ ప్రాజెక్టుగా కూసుమంచి కార్యాలయాల్లో..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఆధార్ ఇ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధార్ ఇ-సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పనిభారం అధికంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని, ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకు వస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ఆర్ఓలను నియమించారు. అవినీతికి దూరంగా ప్రజలకు మెరుగైన సేవ లందిస్తూ ప్రభుత్వ పేరుప్రతిష్టలు పెంచేలా సబ్‌రిజిస్ట్రార్ల పనితీరు ఉండాలన్నారు.



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

# రైతులను పట్టించుకోని ప్రభుత్వం

### ఇప్పటికే 442 మంది కర్షకులు చనిపోయారు

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ఎద్దు ఏడిస్తే రైతులు ఎంతగానో బాధపడతారని, అలాంటి రైతు ఏడిస్తే మన రాష్ట్రం కూడా బాధపడుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల దుస్థితిపై పట్టించుకోలేదని మండిపడ్డారు. సుమారు 30 లక్షల టన్నులు వరిధాన్యం తడిసి పోయిందని, ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 51 ఏళ్ల గుగ్గులోత్ కిషన్, సూర్యపేట అన్నారం గ్రామంలో రైతు ఉప్పల వెంకన్న, జనగాం వెల్దీ గ్రామంలో యాదగిరి వంటి రైతులు నష్టాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 442 మంది రైతులు చనిపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పంటకు 2320 రూపాయల ఎంఎస్‌పి అందిస్తుందని, పంట కొనుగోలు ఖర్చు అంతా కేంద్రమే భరిస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు పని కల్పించకుండా, పంట కొనుగోలు సరిగ్గా జరపకుండా రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ఇస్తూ, 10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, రైతులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏవీ అమలు చేయకుండా రైతులను, మహిళలను, విద్యార్థులను, యువకులను మోసం చేసిందన్నారు.

# నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

### కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దేశంలోని నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని.. కాల్పుల విరమణను తక్షణమే ప్రకటించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. నక్సలైట్లపై కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే నక్సలైట్లు రాసిన లేఖ ప్రకారం కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అర్థమవుతుందనితెలిపారు. నక్సలైట్లు .. టెర్రరిస్టులు కాదని వారు మన దేశ పౌరులని అన్నారు. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో చర్చలు జరిపినప్పుడు మన దేశ పౌరులైన నక్సలైట్లతో శాంతి చర్చలు జరపడం పెద్ద కష్టమేమీ కాదని.. ఆటంకం ఏమి రాదని నారాయణ అన్నారు. సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప మరొకటి కాదని, రెండు తుపాకి గొట్టాల ద్వారా సమస్య పరిష్కారం కాదని.. రాజకీయ చర్చలు జరిపి శాంతి ఒడంబడికకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని నారాయణ కోరారు.

# ఎంఇఓలు ప్రతిరోజు పాఠశాలలను తనిఖీ చేయాలి

### విద్యాప్రమాణాలను మెరుగుపరచాలి

### శిక్షణ తరగతుల్లో పాఠశాల విద్య డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:**ఆరాష్ట్రంలో జూన్ 6 నుంచి జరగనున్న బడి బాట కార్యక్రమంలో మండల విద్యాధికారులు(ఎంఈవో) ప్రత్యేక కార్యా చరణతో మండలంలో ఉన్న స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి సూచించారు. రాష్ట్రంలోని ఎంఈవోలకు సోమవారం ప్రారంభించిన శిక్షణా తరగతుల్లో డైరెక్టర్ పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని 629 మంది ఎంఈవోలకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి బుధవారం వరకు 17 జిల్లాలకు చెందిన 304 ఎంఈవోలకు శిక్షణా తరగతులను హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్ఆర్‌డిలో నిర్వ హించనున్నారు. మిగిలిన జిల్లాల వారికి జూన్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య సంచాలకులు ఇవి నరసింహారెడ్డి మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచాడనికి అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. టీచర్ ట్రైనింగ్స్‌ను మండల స్థాయిలో చాలా బాగా నిర్వహించినందుకు అందరూ ఎంఈవోలను అభినందించారు. క్షేత్ర స్థాయిలో పాఠశాలల అభివృద్ధికి ఎంఈవోలు చాలా కీలకమన్నారు. అందరూ ఎంఈవోలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం కోసం కృషి చేయాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక ఎంఈవో ఉన్నారని.. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలపైన నమ్మకం పెరిగేలా ఎంఈవోల పనితీరు ఉండాలన్నారు. బడిబాట కార్యక్రమంలో ప్రతి ఎంఈవో ఒక ప్రత్యక కార్యాచరణతో వారి మండలంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా కృషి చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, లోకల్‌బాడీ, మోడల్ స్కూల్స్, కెజిబివిలు, సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యుఆర్ఎస్) పాఠశాలల్లో పనిచేస్తున్న 122854 టీచర్స్‌కి 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మే 13 నుంచి ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి 5605 రిసోర్స్ పర్సన్స్.. జూన్‌లో రిటైర్ అయ్యే 1255 మంది ఉపాధ్యాయులు మినహాయిస్తే 1,16,084 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందాల్సి ఉందన్నారు. వారిలో ఇప్పటి వరకు రెండు విడతలలో 866 సెంటర్స్‌లో 94,794 మంది టీచర్లకు 5 రోజుల శిక్షణ జిల్లా స్థాయిల్లో, మండల స్థాయిల్లో ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన టీచర్స్‌కి 3వ విడతలో సోమవారం(మే26) నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# 30న 'షష్టిపూర్తి' విడుదల

డా.రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం షష్టిపూర్తి. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో దర్శకుడు పవన్ ప్రభ షష్టిపూర్తి గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..నేను హోటల్ మేనేజ్మెంట్‌చేశాను. మా ఇంట్లో అంతా ట్రెడిషనల్ సింగర్సే ఉంటారు. నాకు చిన్నతనం నుంచే సినిమాలపై మక్కువ ఏర్పడింది. సినిమాలతోనే మనం మంచిని చెప్పగలమని నమ్ముతాను. అలా నేను చివరకు ఇండస్ట్రీలోకి వచ్చాను. ఫిట్టింగ్ మాస్టర్ సినిమాకు డైరెక్షన్ టీంలో పనిచేశాను. ఆ సినిమాలో ఓ చోట, ఓ చిన్న సీన్‌లో కూడా నేను కనిపిస్తాను. సినిమా విషయంలో నాకు చాలా గ్యాప్ వచ్చింది. ఇన్నేళ్లలో సినిమా అంటే ఏంటో ఇంకా నేర్చుకున్నాను. నేను ఈ షష్టిపూర్తి గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండే వారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు అడ్జస్ట్ అవ్వాలి.. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం.



నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే షష్టిపూర్తిని తీశాను. ఇప్పటి వరకు షష్టిపూర్తి గురించి చూసిన దాని కంటే మే 30వ తేదీని మీరు సర్ ప్రైజ్ అయ్యే అంశాలెన్నో సినిమాలో ఉంటాయి. షష్టిపూర్తి విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్, అర్చనని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్ట్రిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవి యల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్‌ని చూపించాను. షష్టి పూర్తి ట్రైలర్‌ను అందరూ మెచ్చుకుంటారు. సినిమాలో ఏదో విషయం ఉందని అంతా అంటున్నారు. మరీ ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ గురించి మాట్లాడుతున్నారు.

# 'థగ్ లైఫ్' పైనే మా నమ్మకం

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైయాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా థగ్ లైఫ్. ఈ భారీ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ నేషనల్ వైడ్‌గా సెన్సేషన



కమల్ హాసన్

క్రియేట్ చేసింది. హీరో నితిన్ ఫాదర్ ఎన్ సుధాకర్ రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో భారీ ఆడియో లాంచ్ ఈవెంట్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక నాయకుడు కమల్ హాసన్ మాట్లాడుతూ ఈ జర్నీలో నాతో కలిసి ఎందరో ఉన్నారు. ఇప్పటికీ వారు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గుండెల్లో ఎంతో కన్నీరుంది. సంతోషంతో వచ్చే కన్నీరుంది.. బాధతో నిండిన కన్నీరు కూడా ఉంది. ఎంతో మంది, ఎన్నో తరాలుగా నన్ను ఆదరిస్తున్నారు. వారికి ధన్యవాదాలు తప్ప మరేం చెప్పలేను. నేను సినిమాకు పెద్ద అభిమానిని. థగ్ లైఫ్ సినిమా గురించి మాట్లాడాలంటే ముందుగా ఎ.ఆర్.రెహమాన్ గురించి. ఇళయ రాజా తర్వాత తన సంగీతంలో నన్ను ముంచెత్తింది రెహమానే. వారిద్దరూ మన దక్షిణాది గర్వపడే గొప్ప కళాకారులు వారు. వారి వయసు మనం లెక్కపెట్టలేం. నన్ను, మణిరత్నంగారిని కలిపింది సినిమానే. ప్రేక్షకులు మమ్మల్ని చూసి వేసే విజిల్స్ మాకోసమే కాదు..సినిమా కోసం కూడా అని నాకు తెలుసు. నేను ఇక్కడున్నందుకు సంతోషపడుతున్నాను. సినిమాటోగ్రాఫర్ రవి కె.చంద్రన్‌గారు గొప్ప టెక్నీషియన్. హాలీవుడ్ రేంజ్‌కు వెళ్లాల్సిన టెక్నీషియన్. ఆయనతో పని చేయటాన్ని గర్వకారణంగా భావిస్తాం. అన్బరివు గొప్ప యాక్షన్ సన్నివేశాలను కంపోజ్ చేశారు. ఇక నటీనటుల విషయానికి వస్తే అందరూ భవిష్యత్తులో గొప్పవారు అవుతారు. శింబు తనెంత గొప్ప స్థాయిని చేరుకుంటాడో నాకు తెలుస్తుంది. ఈ సమూహాన్ని ముందుక నడిపే నాయకుడిగా శింబు ఎదుగుతాడు. ఆ బాధ్యత తనకుంది. త్రిష గురించి చెప్పాలంటే బాహ్య సౌందర్యమే కాదు.. మానసికంగా ఎంతో అందమైనవారు. మరోవైపు జీవాగా నటించిన అభిరామి.. గొప్పగా నటించారు. అశోక్ సెల్వన్‌ను చూస్తుంటే నాజర్‌ను చూస్తున్నట్లే అనిపించింది. నాజర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సినిమాను చూసేటప్పుడు అందరూ ఎంతో సంతోషిస్తారు. కానీ తీసేటప్పుడు చాలాసమస్యలను దాటిచిత్రీకరించాల్సి ఉంటుంది. అలాంటి సమస్యలను నేను ఎన్నింటినో దాటి వచ్చాను. అందుకు కారణం.. అభిమానులే. వారికి నేను ఎలా ధన్యవాదాలు చెప్పలో కూడా తెలియటం లేదు. అలాంటి వారి కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. నేను ముఖ్యమంత్రి కావటానికో, ఎం.ఎల్.ఎ, ఎం.పి నోమకావటానికి రాజకీయాల్లోకి రాలేదు. ఓ ఎం.ఎల్.ఎ ఏం చేస్తాడో దాన్ని తమిళనాడుకి మెల్లగా చేస్తున్నాం. నాతో పాటు ఉన్నవారందరూ ఇప్పుడు సమాజంలో పెద్దవారిగా ముందుకు నడుస్తున్నారు. అది నాకెంతో గర్వంగా ఉంటుంది. రేపు శింబు కూడా తన వారిని అలాగే ముందుకు తీసుకెళ్లాలి.

# 'కుబేర' సెకండ్ గ్లింప్స్

ధనుష్ నాగార్జున హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ డ్రామా కుబేర సెకండ్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రాన్స్ ఆఫ్ కుబేర్థ పేరుతో ఉన్న ఈ వీడియో, ప్రేక్షకులను కుబేర డార్క్ అండ్ హిప్నోటిక్ వరల్డ్‌లోకి తీసుకెలుతోంది. సినిమాలోని కీలక పాత్రలను, వారు క్రియేట్ చేయబోయే తుఫానును అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ముగ్గురు నేషనల్ అవార్డ్ విన్నర్స్ ధనుష్, విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల, రాక్ స్టార్ శ్రీ ప్రసాద్ కలిసి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్నారు. ఈ సినిమా లార్జర్ దెన్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని ట్రాన్స్ ఆఫ్ కుబేర ప్రామిస్ చేస్తోంది. ఈ ఎక్సయిటింగ్ టీజర్‌లో డీఎస్‌పీ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. నాది నాది నాది నాదే ఈ లోకమంతా అనే హిప్నాటిక్ కోరస్ అదిరిపోయింది. నంద కిషోర్ రచించిన ఈ పాటను ధనుష్, హేమచంద్ర వేదాల కలిసి తన డైనమిక్ వోకల్స్‌తో అదరగొట్టారు. ఎస్.పి.అభిషేక్, శెణ్బగరాజ్, సాయి శరణ్, శ్రీధర్ రమేష్, భరత్ కె రాజేశ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో హార్మోనీలను యాడ్ చేశారు. ఈ పాట కుబేర వరల్డ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.



నాగార్జున ఫవర్ ఫుల్ అండ్ ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టారు. ఆయన పాత్ర బలమైనది, భావోద్వేగంతో కూడినది, విలువలతో నడుచుకునే వ్యక్తిలా కనిపించినా అంతర్గతంగా ఎన్నో ప్రశ్నలతో ఉన్నట్టుగా ఉంది. ఆయన పాత్రను మంచో చెడో అనలేని విధంగా రూపొందించటం సినిమా పట్ల ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచుతుంది.

# సంక్రాంతి కానుకగా 'అనగనగా ఒక రాజు'

తనదైన ప్రత్యేక కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న బ్లాక్ బస్టర్ మెషిన్ నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ అనగనగా ఒక రాజుతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిత్ర బృందం విడుదల చేసిన మోషన్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి థియేటర్లలో నవ్వుల పండుగను తీసుకురాబోతున్నాడని మోషన్ పోస్టర్ తోనే అర్థమైంది. తెలుగు సినీ అభిమానులు సంక్రాంతి పండుగను సినిమా పండుగలా భావిస్తుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే పండుగకి సరైన సినిమాగా అనగనగా ఒక రాజు వచ్చే సంక్రాంతికి థియేటర్లలో అడుగుపెట్టనుంది. తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకుపోతున్న మీనాక్షిచౌదరి అనగనగా ఒక రాజులో నవీన్ పొలిశెట్టికి జోడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులను సరికొత్త వినోదాన్ని అందించేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. పండుగ రుచికి సరిగ్గా సరిపోయేలా ఆయన తనదైన మ్యూజిక్‌తో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు.



ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థలు కొన్నేళ్లుగా వరుస ఘన విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 2026 సంక్రాంతికి అనగనగ ఒక రాజుతో మరో పండగ విజయాన్ని ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. తారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షిచౌదరి

ఛాయాగ్రహణం: జె. యువరాజ్

సంగీతం: మిక్కీ జె. మేయర్.

# ఘనంగా భావయామి పుస్తక ఆవిష్కరణ!

సీతాయణం చిత్ర దర్శకుడు ప్రభాకర్ ఆరిపాక రచించిన కథల సంపుటి భావయామి పుస్తక ఆవిష్కరణోత్సవం హైదరాబాద్ ప్రసాద్ ఫిలిం ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. దర్శకుడు వైవిఎస్ చౌదరి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ నటులు అజయ్ ఘోష్, గుండు సుదర్శన్, గేయ రచయిత సురేంద్ర కృష్ణ, డియర్ కామ్రేడ్ దర్శకుడు భరత్ కమ్మ, ప్రముఖ కథా రచయిత మహమ్మద్ ఖదీర్ బాబు, సీనియర్ నిర్మాత వేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ నటుడు, రచయిత డా. తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా



తనికెళ్ల భరణి మాట్లాడుతూ, ఒకప్పుడు రచయితలు తమ పుస్తకం తామే రాసుకుని వాళ్లే ప్రింట్ చేసుకుని వాళ్లే అమ్ముకునే స్థితి నుంచి ఈరోజు పుస్తకం సింహాసనంపై కూర్చుని రచయిత గర్వపడే విధంగా పాఠకుల ముందుకు పుస్తకాన్ని తీసుకొచ్చిన ఘనత పబ్లికేషన్ సంస్థలదేనన్నారు. ఇలాంటి అద్భుతాలు అన్వీక్షికి వంటి సంస్థలు రావడం వల్లే సాధ్యమైందన్నారు.పాఠకులు, రచయితలు ఇటీవల కాలంలో బాగా పెరిగారని కొత్త రచయితల రాక వలన లక్షల్లో పుస్తకాలు అమ్ముడుపోయే విధంగా అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడే విడుదలైన భావయామి పుస్తకంలో మంచి కథలు ఉన్నాయని రచయితను అభినందించారు.

# 'భైరవం' ప్రిరిలీజ్ ఈవెంట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న సమ్మర్ సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. మీరందరూ కూడా మాకు మంచి హిట్ పడాలని కోరుకుంటున్నారు. అది మాకు తెలుస్తుంది. ఈ సినిమాల్లో పని చేసిన సాంకేతిక నిపుణులకు నటీనటులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ఇరగదీశారు. మే 30న మీరందరూ సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్స్ చేయాలి అని కోరుకుంటున్నాను. సినిమా మీ అందరికీ ఒక అద్భుతమైన ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. ఒక మంచి సినిమా చూసామనే సాటిస్ఫాక్షన్ ఉంటుంది. ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడి ఇష్టపడి మీ అందరికీ ఒక మంచి సినిమా ఇవ్వాలని ఇవ్వాలని ఉద్దేశంతో చేసాం. డైరెక్టర్ విజయ సినిమాని చాలా కష్టపడి తీశారు. ఆయన హార్డ్ వర్క్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. ఈ సినిమా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మామూలుగా ఉండదు. మే 30న మనందరికీ పెద్ద పండగ. ఆ పండగలో మీరందరూ భాగం కావాలని కోరుకుంటున్నాను. రాధా మోహన్ లాంటి నిర్మాతలు ఇండస్ట్రీలో ఉండాలి. మనోజ్ అన్నకి రోహిత్‌కి అతిథి ఆనంద్‌కి ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. సినిమా అద్భుతంగా ఉండబోతుంది. సక్సెస్ మీట్‌లో మాట్లాడుకుందాం. లవ్ యు ఆల్ అన్నారు హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సినిమా మే 30న రిలీజ్ కాబోతుంది. చాలా ఆనందంగా ఉంది. రోహిత్ నేను సాయి సొంత బ్రదర్స్ లాగే ఉన్నాం. ఈ సినిమాతో మా బంధం మరింత పెరిగింది. కలకాలం అది ఇలాగే ఉండాలని ఆ దేవున్ని కోరుకుంటున్నాను. అతిథి ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఆనంది గారితో కలిసి వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. మా టీమ్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. సినిమా అనేది కులం చూడదు.





శ్రియ నయా లుక్

# తెలుగు, హిందీలో 'డకాయిట్' గ్లింప్స్

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్ ఫైర్ గ్లింప్స్ తెలుగు, హిందీలో రిలీజ్ అయ్యింది. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఫైర్ గ్లింప్స్ అదిరిపోయింది. శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య ఉద్రిక్త క్షణంలో గ్లింప్స్ ప్రారంభమోతోంది. సానుభూతితో నిండిన వాయిస్‌లో శేష్ ఆమెను జూలియట్ అని పిలుస్తాడు, అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని వాయిస్ మారుతుంది. నేను నిన్ను మోసగించడానికి రాలేదు, అంతకంటే ఎక్కువ చేస్తా అని మిస్టీరియస్ స్టైల్‌తో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. నెక్స్ట్ ఎపిసోడ్, ఖైదీ యూనిఫాంలో జైలు వ్యాన్‌లో వున్న శేష్ కూల్‌గా తన నోటి నుండి ఒక కీని బయటకు తెస్తాడు. తర్వాత ఓ రైలు వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో, మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది, శేష్ ఫైరింగ్ చేస్తాడు. ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన ఓ గొప్ప కథకు ఇది నాంది. విజువల్‌గా డకాయిట్ ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. అడివి శేష్ ఇంటెన్స్ అండ్ రగ్గడ్ పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మదనపల్లె యాసలో అదరగొట్టాడు. అతని వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్ ప్రెషన్స్ అద్భుతంగా వున్నాయి. హిందీ వెర్షన్‌కు కూడా తనే డబ్బింగ్ చెప్పారు. అది అద్భుతంగా వచ్చింది. మృణాల్ ఠాకూర్ స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో కనిపించింది. అనురాగ్ కశ్యప్ ప్రజెన్స్ ఇంపాక్ట్ ఫుల్‌గా వుంది. దర్శకుడు షానియల్ డియో విజువల్ ప్రజెంటేషన్ అదరగొట్టాడు. టీజర్ సినిమా స్కేల్ ఎంత బిగ్గర్‌గా వుంటుందో తెలియజేసింది. భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం ఎమో షన్‌ని మరింత ఎలివేట్ చేసింది.



# ఒరు ఆధార్ లవ్ మూవీతో 'ప్రియా ప్రకాష్ వారియర్' ఎంట్రీ

మలయాళ పరిశ్రమ నుంచి వచ్చే భామలకు మిగతా సౌత్ భాషల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా అక్కడ భామలు అభినయానికి ప్రాధాన్యత ఇచ్చే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తూ ఉంటారు. అందుకే అక్కడ ఏదైనా హీరోయిన్ క్లిక్ అయితే చాలు వెంటనే తెలుగు, తమిళ భాషల్లో ఛాన్స్‌లు ఇస్తుంటారు. అలా మలయాళం నుంచి వచ్చిన ఎంతోమంది హీరోయిన్స్ తెలుగు, తమిళ్‌లో సక్సెస్ ఫుల్ హీరోయిన్స్‌గా రాణించారు. ఐతే అందరికీ అలాంటి బజ్ వస్తుందని చెప్పడం కష్టం. ముఖ్యంగా పాపులారిటీ వచ్చినా కథల ఎంపికల వల్ల ఆ క్రేజ్ తెచ్చుకోవడంలో వెనుకబడతారు.



అలాంటి వారిలో చెప్పుకుంటే ముందు వరుసలో ఉంటుంది వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ సినిమా టీజర్ తో నేషన్ మొత్తాన్ని తన కన్నుగీటి మాయలో పడేసింది అమ్మడు. ఆ సినిమా రిలీజ్ టైంలో ప్రియా క్రేజ్ ఒక రేంజ్‌లో ఉంది. ఐతే సినిమాలో ఆమె సైడ్ హీరోయిన్ అవ్వడం అంచనాలను అందుకునేలా సినిమా లేకపోవడం వల్ల నిరాశపరిచింది. ఐతే ఆ క్రేజ్ తో తెలుగు ఆఫర్లు వచ్చినా అమ్మడు అప్పుడు కాదనేసింది. స్టార్ ఛాన్స్‌ల కోసం ఎదురుచూసి వచ్చిన ఒకటి అర అవకాశాలు కాదనుకుంది. కట్ చేస్తే తెలుగు పరిశ్రమ అమ్మడికి లైట్ తీసుకుంది. ఆ తర్వాత మళ్లీ కొన్ని ఆఫర్లు రాగా వాటిని ఒకే చేసింది. నితిన్, తేజా సజ్జ లాంటి వారితో సినిమాలు చేసిన ప్రియా ప్రకాష్ ఆ సినిమాతో ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. ఫైనల్‌గా తెలుగులో ఆశించిన బ్రేక్ రాబట్టలేదు సరికదా అసలు ఆమెను పట్టించుకోలేదు. ఐతే ఇదే క్రమంలో తమిళ్‌లో ప్రయత్నాలు చేస్తుంది అమ్మడు. రీసెంట్‌గా అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ఆమె స్పెషల్ క్యామియో ఆడియన్స్‌ని అలరించింది. ఇక రీమిక్స్ సాంగ్ కి డ్యాన్స్ చేసి అలరించింది అమ్మడు. ఆ సినిమా కూడా అజిత్ ఫ్యాన్స్‌ని అలరించింది. సో హిట్ వైబ్‌ని క్యాచ్ చేస్తూ అమ్మడు మరికొన్ని అవకాశాలు అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. ప్రియా ప్రకాష్ వారియర్ సినిమా ఆఫర్లు ఎలా ఉన్నా అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది. కెరీర్‌లో ఒక మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న అమ్మడు ప్రయత్నాలు మాత్రం ఆపట్లేదు. మరి అమ్మడికి అలాంటి ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి.



ఫ్రిజ్‌లో పెడితే పదార్థాలు పాడైపోవు అనుకుంటారు చాలామంది. కానీ వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అంతేకాదు. అవి చూడ్డానికి, రుచికి బాగానే ఉంటాయి. కానీ మన ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెందుతుంది అంటున్నారు నిపుణులు. కాబట్టి ఏ పదార్థం ఎప్పుడు ఫ్రిజ్‌లో పెట్టాలి? ఎన్ని రోజులు ఉంచాలి? తెలుసుకుందాం..

# ఫ్రిజ్‌లో ఎన్ని రోజులు పెట్టవచ్చు ?

✦ ఏ కాలంలోనైనా ఫ్రిజ్‌లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల ఫారన్‌హీట్ (4.4 డిగ్రీల సెల్సియస్)కు మించకుండా చూసుకోవాలి.

✦. పాలు, పాల పదార్థాలు, మాంసం, కోడిగుడ్లు, చేపలు.. వంటి త్వరగా పాడైపోయే పదార్థాలు బయటి నుంచితెచ్చిన రెండు గంటల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఒకవేళ బయట ఉష్ణోగ్రత 90 డిగ్రీల ఫారన్‌హీట్ (32.2 డిగ్రీల సెల్సియస్) కంటే ఎక్కువగా ఉన్నట్లయితే తెచ్చిన గంటలోపే ఈ పదార్థాల్ని ఫ్రిజ్‌లో పెట్టాలి.

✦ గడ్డకటిని పదార్థాలను కిచెన్ ప్లాట్ ఫామ్, టేబుల్‌పై పెట్టి వాటంతటవే కరిగిపోతాయి అని వదిలేయడం మంచిది కాదు. ఎందుకంటే గది ఉష్ణోగ్రత వద్దకు చేరేసరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. కాబట్టి కౌంటర్ టాప్స్‌పై పెట్టి ఘనీభవించిన పదార్థాల్ని అస్సలు కరిగించ కూడదు. నీటిలో/ మైక్రోవేవ్ ఒవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం.

✦ సూప్స్, ఇతర కూరల్ని 'కాయగూరలు లేదా ఇతర మాంసాహారం కలిపి తయారుచేసినా మూడు నాలుగు రోజుల వరకు ఫ్రిజ్‌లో నిల్వ చేయచ్చు.

✦. మిగిలిపోయిన ఆహార పదార్థాలు (మాంసం, పౌల్ట్రీ, చికెన్ నగెట్స్/ ప్యాటీస్, పిజ్జా.. వంటివి ఫ్రిజ్‌లో మూడునాలుగు రోజులు ఉంచచ్చు. అలాగని అన్ని పదార్థాలను రోజుల తరబడి ఫ్రీజర్లో పెట్టి ఎప్పుడో వినియోగించడం కరక్ట్ కాదు. అయితే సాధ్యమైనంతవరకు మనం తీసుకునే ఆహార పదార్థాల్ని తాజాగా, పరిశుభ్రంగా, అప్పటికప్పుడు వండుకొని, వేడివేడిగా తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి వీలైనంత వరకు మిగిలిపోయిన అన్ని పదార్థాలనీ ఫ్రిజ్‌లో తోసేయకుండా జాగ్రత్త పడడం మంచిది. ❑

# మిస్ వరల్డ్ క్రీడల ఛాలెంజ్ విజేతలు

మిస్‌వరల్డ్ పాజెంట్-2025లో భాగంగా జరిగిన క్రీడల ఛాలెంజ్ పోటీల్లో మిస్ వరల్డ్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మా విజేతగా నిలవగా ,మొదటి, రెండో రన్నరప్‌లుగా మిస్ వరల్డ్ మార్టినిక్ ఆరేలీ జోచిమ్, మిస్ వరల్డ్ కెనడా ఎమ్మా మోరిసన్‌లు నిలిచారు.

**అనాథల కోసం ... ఎలిస్ రాండ్మా**

ఈ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకున్న రాండ్మా కిర్నాలో పుట్టి పెరిగారు. స్కూలింగ్ పూర్తయ్యాక ఐటి సిస్టమ్స్ డెవలప్‌మెంట్‌లో డిగ్రీ పూర్తిచేశారు. ఎలిస్‌కి ఆటలేకాదు.. డ్యాన్స్, మేకప్, పర్యావరణంపై ప్రత్యేక ఆసక్తి. ఈ పోటీలకు



ముందు మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్, ది మిస్‌గ్లోబ్, మిస్ ఎర్త్, టాప్ మోడల్ ఆఫ్ వరల్డ్.. వంటివాటికి తన దేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' కోసం 'సువిన్ ఐడాటా' అనే ఆన్‌లైన్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాల అవసరాలను గుర్తించి దాతలలో అనుసంధానించే లక్ష్యంతో ఇది నడుస్తోంది.



**ప్రకృతిపై ప్రేమ.. - ఆరేలీ జోచిమ్**

72వ అందాల పోటీ క్రీడల ఛాలెంజ్‌లో ఆరేలీ జోచిమ్ రజత పతకాన్ని అందుకున్నారు. డ్యూకోస్ ఆమె స్వస్థలం. 18 ఏళ్ల వయసులో మొదటిసారి అందాల పోటీల్లో పాల్గొని మిస్ మార్టినిక్ కిరాటాన్ని సొంతం చేసుకున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడుతున్నారు. అథ్లెట్ అయిన ఆరేలీకి సముద్రాన్ని చూడటమన్నా, ప్రకృతిని ఆస్వాదిస్తూ హైకింగ్ చేయడమన్నా ఇష్టమట. తోటివారికి సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని చెప్పే ఆరేలీ 'మైసన్ లామ్మే' అనే సంస్థను స్థాపించి మానసిక ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారు.


**మొదట కాదన్నా... - ఎమ్మా మోరిసన్**

స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఎమ్మా మోరిసన్ కాంస్య పతకాన్ని అందుకున్నారు. 'ప్రపంచ సుందరి పోటీలు... సామాజిక సేవకు చక్కటి వేదిక' అంటారామె. ఒంటారియోలోని ప్రాచీన ఆదిమ తెగలో జన్మించారు. టూరిజంలో డిగ్రీ చేశారు. మిస్ కెనడా కిరీటాన్ని గెలుచుకున్నాక పదివేల అమెరికన్ డాలర్లను దాతృత్వ కార్యక్రమాలకోసం వెచ్చించారు. ఓసారి తెలిసిన వారొకరు ఎమ్మాను ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనమని అడిగారట. మొదట కాదన్నా... తర్వాత ఇవి ఆత్మసౌందర్యాన్ని ప్రతిబింబించేలా, సామాజిక సేవకు అవకాశం కల్పించేలా సాగడం తెలిసి ఒకే చెప్పారట. అందులో భాగంగా 'రీ కనెక్టింగ్ విత్ రిబ్బన్ స్కర్ట్స్' పేరుతో అమ్మమ్మ తనకి నేర్పిన అల్లికలతో మహిళలకు ఉపాధి కల్పించే ఓ ప్రాజెక్టుని రూపొందించారట. అదే ఎమ్మా గెలుపుకు కీలకమైంది.



ఎంతమంది హేళన చేసినా... అనుకున్నదానికోసం కష్టపడే తత్వమే తనని ముందుకు నడిపిస్తారామె. ❑

# ఇంట్లో మేనిక్యూర్..



చేతులు కోమలంగా, గోళ్లు ఆరోగ్యంగా కనిపించాలంటే మేనిక్యూర్ అవసరమే. దీన్ని ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే..

✦ ముందుగా గోళ్లపై ఉన్న నెయిల్ పాలిష్ తొలగించండి. ఆపై అరచెంచా ఉప్పు, కొద్దిగా బాదం నూనె, కాస్త నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కనీసం 10 నిమిషాలపాటు గోళ్లను నానబెట్టండి. దీనివల్ల గోళ్లు శుభ్రపడటమే కాదు... పసుపు తగ్గి ప్రకాశిస్తాయి. చేతులు టాన్ తగ్గి మెరిసిపోతాయి.

✦ .రెండో దశలో గోళ్లను కత్తిరించి రౌండ్, స్క్వేర్, ఓవల్... ఇలా మీకు నచ్చిన రూపు ఇవ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లలో రెండు చుక్కల షాంపూ లేదా బాడీవాష్ కలిపి అందులో కనీసం పది నిమిషాలు చేతుల్ని నాననివ్వండి.

✦ తర్వాత ఆరెంజ్ స్టిక్ లేదా క్యూటికల్ పుషర్ చుట్టూ ఉన్న మృతచర్మాన్ని తొలగించండి. ఆపై ఆలివ్ ఆయిల్తో రుద్దాలి. తర్వాత చిన్న బ్రష్ తీసుకుని గోళ్లపై రుద్దితే సరి. మురికి వదులుతుంది. ఇప్పుడు చెంచా చొప్పున పెరుగు, పంచదార, తేనె కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసి వేళ్లతో వలయాకారంగా స్క్రాబ్ చేయండి.

✦ చివరగా చేతుల్ని చల్లటి నీళ్లతో కడిగేసి కాస్త బాదం నూనె రాసి మరోసారి మృదువుగా మర్దన చేయండి. వారానికోసారి ఇలా చేయడంవల్ల చేతులు నాజూగ్గా కనిపిస్తున్నాయి. ఆరోగ్యంగానూ ఉంటాయి. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఎక్కువగా చేసేవారు... రోజూ రాత్రిపూట గ్లిజరిన్ రాయడాన్ని అలవాటుగా మార్చుకోండి. ❑

# ఇన్‌స్టంట్ పల్లీ పౌడర్



ఇడ్లీ, వడ, దోశ ఇలా ఏ టిఫిన్ చేసినా.. అందులోకి పల్లీ పచ్చడి ఉండాల్సిందే. అప్పటికప్పుడు చట్నీ చేయాల్సిన పని లేకుండా రెడీమేడ్గా ఉందనుకోండి. సగం పని తగ్గినట్లే అందుకోసం ముందుగానే పౌడర్ చేసిపెట్టుకోవచ్చు. ఈ ఇన్‌స్టంట్ పల్లీ చట్నీ కోసం.. పల్లీలు అర కప్పు, పుట్నాలపప్పు ముప్పావు కప్పు, ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర చెంచా చొప్పున, కారం ముప్పావు చెంచా, ఉప్పు రుచికి తగినంత నూనె, ఎండుమిర్చి 8, వెల్లుల్లి తరుగు చెంచా, కరివేపాకు రెండు రెబ్బలు, రెండు రెబ్బలు, చింతపండు కడాయిలో పల్లీలను వేయించి పళ్లెంలోకి తీయాలి. తర్వాత పుట్నాలపప్పు, వెల్లుల్లి, ఆరు ఎండుమిర్చిలను వేయించాలి. అందులో చింతపండు వేసి.. తేమ పోయేదాకా వేయించి తీయాలి. అన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి.. ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, మిగిలిన ఎండుమిర్చి, కరివేపాకులను ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక, గ్రైండ్ చేసిన పొడి జతచేసి కలియతిప్పుతూ ఒక నిమిషం వేయించాలి. చల్లారిన తర్వాత తడిలేని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. అవసర మైన ప్పుడు తగినంత పొడిని కాసిని వేడినీళ్లలో కలిపా మంటే.. రోజూ చేయాల్సిన శ్రమ తప్పుతుంది. తాజా పల్లీ చట్నీ తిన్నట్టే ఉంటుంది. ❑

# సన్‌ఫ్లవర్ గింజలతో మెరుపు !



చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. వేసవిలో ఇలాంటి సమస్యలు మరింత అధికం. అయితే. ఇలాంటి సమస్యలన్నిటికీ పొద్దు తిరుగుడు గింజలతో చెక్ పెట్టచ్చు.

**చర్మం శుభ్రపడటానికి..**

సన్‌ఫ్లవర్ గింజలతో తయారుచేసిన స్క్రబ్ ఉపయోగించడం ద్వారా చర్మం, చర్మరంధ్రాలు శుభ్రపడి కొత్త కళ సంతరించుకొంటుంది. ఈ ఫలితాన్ని పొంద డానికి.. అరకప్పు పొద్దుతిరుగుడు గింజలను తీసుకొని మిక్సీలో వేసి పొడిలా తయారు చేసుకోవాలి.దీనికి కొద్దిగా నీరు కలిపి చిక్కటి మిశ్రమంలా చేసుకొని గాజు సీసాలో వేసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. ఈ మిశ్రమంతో రోజూ ముఖాన్ని మెడను రుద్దుకొంటూ ఉంటే. చర్మం శుభ్రపడటంతోపాటు తగిన పోషణ అంది ఆరోగ్యంగా తయారవుతుంది.

**పొడిబారిన చర్మానికి...** పొద్దుతిరుగుడు గింజలను రెండు నుంచి మూడు గంటల పాటు ఎండలో ఉంచాలి. ఆ తర్వాత వాటిని మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. ఇలా చేసేటప్పుడు మరీ మెత్తగా కాకుండా.. కాస్త గరుకుగా ఉండేలా చూసుకోవాలి. దీన్ని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ఇలా తయారుచేసిన పొడిని టీస్పూన్ పరిమాణంలో తీసుకొని.. దీనికి మరో టీస్పూన్ వెన్న తొలగించని పాలు, చిటికెడు పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పావుగంట నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఈ ప్యాక్ ముఖంపై పేరుకొన్ని మురికిని తొలగిస్తుంది. చర్మానికి తేమనందించి పొడి చర్మం సమస్య నుంచి విముక్తి కలిగిస్తుంది. అలాగే



చర్మఛాయ సైతం మెరుగుపడుతుంది. ఈ ప్యాక్‌ని వారానికోసారి వేసుకోవడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది.

**మిశ్రమ చర్మతత్వం ఉంటే..** మిశ్రమ చర్మతత్వం కలిగిన వారికి చర్మంపై ప్యాచెస్ మాదిరిగా అక్కడక్కడా పొడిగా కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వారికి పొద్దుతిరుగుడు గింజలతో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ చక్కగా నప్పుతుంది. దీనికోసం పై పద్ధతిలో తయారుచేసి పెట్టుకొన్న సన్‌ఫ్లవర్ గింజల పొడిని టీస్పూన్ తీసుకోవాలి. దీనికి కొద్దిగా గంధం పొడి, రోజ్‌వాటర్ కలిపి మిశ్రంగా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తడివస్త్రంతో ముఖం తుడుచుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై డ్రై ప్యాచెస్ పోవడంతో పాటు చర్మం సైతం అందంగా కనిస్తుంది. ❑

# చకచకా చేసేయొచ్చు..



బరువు తగ్గడానికో.. మధుమేహం వల్లో లేదా ఇతర కారణాల మూలంగానో చపాతీలు తినేవాళ్లు ఎందరో ఉంటారు. ఇవి తినడానికి ఎంతో రుచిగా ఉంటాయి కానీ పిండి కలపాలంటేనే కాస్త విసుగ్గా ఉంటుంది. ఆ పనిని సులువు చేసేందుకు వచ్చిందే 'సిలికాన్ నీడింగ్ అండ్ రోలింగ్ మ్యాట్. గిన్నెలో పిండి కలుపుతుంటే, రొట్టెల పీట మీద చపాతీ చేస్తున్నప్పుడూ చేతులతోపాటు, పీటకూ పిండి అతుక్కు పోతుంది. కానీ ఈ సిలికాన్ మ్యాట్ మీ దగ్గర ఉంటే ఇక అలాంటి సమస్యే ఉండదు. పిండి కలపడం, రొట్టె చేయడం కూడా చకచకా అయి పోతాయి. చాలా సౌలభ్యంగా ఉండే ఈ మ్యాట్ నచ్చితే మీరూ ఒకటి కొనుక్కోండి. పైగా దీన్ని శుభ్రం చేయడం కూడా చాలా తేలిక. ❑



# శాకాహారంతో మెనోపాజ్ లక్షణాలకు చెక్ !

మెనోపాజ్ దశలో రుతుక్రమం ఆగడం, వేడి ఆవిర్లు, నిద్రలేమి, బరువు పెరగడం, భావోద్వేగాల్లో మార్పులు... తదితర లక్షణాలు ఉంటాయి. జీవక్రియలోనూ మార్పులు చోటుచేసుకుంటాయి. శాకాహారానికి ప్రాధాన్యమిస్తే ఈ మెనోపాజ్ లక్షణాల తీవ్రతను తగ్గించవచ్చు అంటోందో పరిశోధన, పప్పుదినుసులు, ఆకుకూరలూ కూరగాయలను అధిక మోతాదులో తీసుకోవడంతోపాటు, భిన్నమైన రకాలు ఉండేలా చూసుకోవాలంటున్నారు లండన్‌లోని కింగ్స్ కాలేజీ. ఒక ఆరోగ్య, పోషకాహార యాప్‌ని ఉపయోగించే 7వేల మంది మహిళలను ఈ పరిశోధనకు



ఎంపికచేసింది. వాళ్లంతా శాకాహారానికి మారిన ఏడు నెలల తర్వాత మెనోపాజ్ లక్షణాల్లో తీవ్రత మూడో వంతు తగ్గినట్లు తెలుస్తోంది. పోస్ట్ మెనోపాజ్ దశలోని మహిళల్లో ఈస్ట్రోజన్ స్థాయిలు తగ్గడం మూలాన చక్కెరలూ, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకుంటే పొట్టలోని సూక్ష్మజీవుల వ్యవస్థ మారుతుంది. బదులుగా ఈ దశలో ఉండే మహిళలు ప్రొటీన్ అధికంగా ఉండే నట్స్, విత్తనాలు, బీన్స్, పప్పులు తీసుకోవడం మేలంటున్నారు పరిశోధకురాలు ఫెడెరికా అమాటి. పై విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వారంలో 30 విభిన్న శాకాహార పదార్థాల్ని తీసుకుంటే ఎంతో మేలు అంటారు. ❑

# మహాభారతము



రైభ్యుడు, భరద్వాజుడు గొప్ప తపస్వులు, మంచి మిత్రులు. ఆరణ్యంలో ఆశ్రమాలు నిర్మించుకొని తపస్సు చేసేవాళ్లు. భరద్వాజుడి కొడుకు యవక్రీతుడు ఒక రోజు రైభ్యుని ఆశ్రమానికి పోయి రైభ్యుడి కొడల్ని చూసి ఆమె అందచందాలకు మోహితుడై తనకోరికను తెలిపాడు. ఆమె చాకచక్యంగా తప్పించుకొనిపోయి, ఏడుస్తూ రైభ్యుడికి విషయాన్ని వివరించింది. కోపంతో రైభ్యుడు తన జటలను రెండు ఊడపెరిగి అగ్నిహోత్రంలో వేశాడు. ఒక జట నుండి చాలా అందమైన స్త్రీ, మరొక్క దాన్నుండి రెండు కోరలతో వున్న భయంకర ఆకారంగల రాక్షసుడు, ఉద్భవించి బయటికి వచ్చారు. మహర్షీ! ఏమి ఆజ్ఞ? అన్నారు. రైభ్యుడు వారితో, మీరు వెళ్ళి యవక్రీతుణ్ణి సంహరించండి అన్నాడు. ముందు ఆసుందరాంగి వెళ్ళి యవక్రీతుడితో సరసాలాడుతూ అతడి కమండలాన్ని తీసేసికొంది. దాంతో అతడు అపరిశుద్ధుడై తపశ్శక్తిని కోల్పోయాడు. ఇక వెంటనే రాక్షసుడు వచ్చి యవక్రీతుణ్ణి తన శూలంతో పొడిచి చంపాడు. సుందరాంగి, రాక్షసుడు రైభ్యుని వద్దకు వెళ్లి యవక్రీతుణ్ణి చంపామని చెప్పారు. ఆ మహర్షి వారిద్దరికీ వివాహం చేసి పంపారు. భరద్వాజుడు ఆశ్రమానికి వచ్చి తన కొడుకు చచ్చిపడి ఉండటాన్ని చూసి శోకాన్ని భరించలేక కొడుకు చితిలో పడి తానూ మరణించాడు. ఇది మనకు మహాభారతములో అరణ్యపర్వము తృతీయాస్వాసము పుటలు 298-299లో కనపడే కథ (రామకృష్ణ మఠ ప్రచురణ) కోపమనేది ఎంతటి తపస్సులచేనైనా ఎంతటి ఘోర కృత్యాలనైనా చేయిస్తుందని తెలుపుతుంది ఈ కథ. తన మిత్రుడు భరద్వాజుడు అను స్పృహను కూడా కోల్పోయి రైభ్యుడు భరద్వాజుని కుమారుడైన యవనరకీతుణ్ణి చంపించాడు. యవక్రీతుడు చేసిన నేరం ఏమంత ఘోరమైనదికాదు, ఒక హెచ్చరికతో సరిదిద్దవచ్చు. కానీ రైభ్యుడు ఒకేసారి అతనికి చావును విధించాడు. మిత్రుని కొడుకని కనికరించలేదు. అతని కోసం మిత్రునికీ కూడా మృత్యువయింది. కోపం తెచ్చిపెట్టే దుష్ఫలితాల్ని చెప్పి దాని పట్ల జాగ్రత్త వహించమని బోధిస్తుంది. ఈ కథ. ఇక కొడుకుపైనున్న మమకారం భరద్వాజుడంతటి తపస్విని ఆత్మహత్యకు పురికొల్పింది. అందుకే అహంకారమమకారాలుండరాదంటుంది వేదాంతం. వివేకవంతునికి మహాభారతం విజ్ఞాన ఖనే.

**- రాచమడుగు శ్రీనివాసులు.**

ఆధ్యాత్మికం

# పిల్లల ముందు పరుష పదజాలం వద్దు !

ప్రస్తుతం టివిలు, సామాజిక మాధ్యమాల వల్ల సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటన గురించి పిల్లలు సైతం తెలిసిపోతోంది. ఈ క్రమంలో ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే మహిళలపైన పురుషుల తన బలాన్ని ప్రదర్శించడం తప్పు అనే సంకేతాన్ని పిల్లలకు చేరేలా చేయాలే తప్ప జరిగిన ఘటనల్లో పురుషుడి పాత్ర తగ్గించి మహిళలని మాత్రమే బాధ్యురాలిని చేయకూడదు. అలాగే అబ్బాయిలు చేసే పనిని అమ్మాయిలు చేస్తున్నప్పుడు కూడా అది అబ్బాయిల పని నీకెందుకు? అమ్మాయిలెవరైనా ఇలా చేస్తారా? అంటూ వేరు చేసి కించపరిచేలా మాట్లాడకూడదు.

**.సానుకూల పదజాలంతోనే...** పది చేతి దెబ్బల కంటే ఒక్క మాట గుండెను పగిలేలా చేయగలదు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ముందే పరుష పదజాలాన్ని ప్రయోగిస్తుండడం నేటి సమాజంలో భాగమైపోయింది. ఆడ, మగ మధ్య వ్యత్యాసం ఉందని అపోహపడడానికి, పరుషుడంటే బలవంతుడు అనే బీజం పిల్లల నరనరాల్లో నాటుకుపోవడానికి తల్లిదండ్రులు ఉపయోగించే పురుష పదజాలమై కారణమవుతుంది. అందుకే ఇటువంటి విషయాల్లో ముందు తల్లిదండ్రులకు శిక్షణ అవసరం అంటున్నారు మానసిక నిపుణులు. ముందు మనం మాట్లాడే మాటలు సానుకూలంగా ఉంటే.. చేతలు కూడా సానుకూలంగా మారతాయనే సత్యాన్ని తల్లిండ్రులు అర్థం చేసుకోవాలి.




**ప్రతికూల ధోరణులకుదూరంగా. ...**

పిల్లలకు ఇంట్లో సానుకూల వాతావరణాన్ని ఏర్పరచడం ఎంత అవసరమో బయట నుంచి వారు ఎటువంటి ప్రతికూల ధోరణులను అలవర్చుకోకుండా ఊడడం కూడా అంతే అవసరం. ప్రత్యేకించి సినిమాలు, కొన్ని రకాల టివి షోలు, స్నేహితుల ప్రభావం వల్ల పిల్లలు నెగెటివిటీకి ఎక్కువ ఆకర్షితులయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రతి అంశంలోనూ మంచి, చెడుకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గ్రహించేలా పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. ❑

# ఐపిఎల్‌లో.. కాస్ట్‌లీ స్టార్లు ఫెయిల్యూర్


గ్లెన్ మాక్స్‌వెల్


రిషబ్ పంత్


మహమ్మద్ షమీ


రచిన్ రవీంద్ర

## రూ.కోట్లతో కొన్నా ఫలితం సున్నా చెత్త ప్రదర్శన చేసిన టాప్ 5 ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. అభిమానులు ఇప్పటివరకు చాలా ఉత్తేజకరమైన మ్యాచ్‌లను చూశారు. చాలా మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు తమ పేలుడు ఆటతో అందరి హృదయాలను గెలుచుకున్నారు. క్రికెట్ ప్రేమికులు అద్భుతమైన ప్రదర్శనను ఆశించిన చాలా మంది ఆటగాళ్ళు ఉన్నారు. కానీ వారు ఆ అంచనాలను చేరుకోలేకపోయారు. ఐపిఎల్ 2025కి ముందుజరిగిన మెగావేలంలో భారీ ధరకు అమ్ముడు పోయిన కొంతమంది స్టార్ ఆటగాళ్లు మైదానంలో ఫెయిల్ అయ్యారు. వీరు తమ టీమ్స్‌కు భారంగామారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈజాబితాలో ఉన్న టాప్ 5 టీమిండియా క్రికెటర్స్ కూడా ఉన్నారు. 65 మ్యాచ్‌ల తర్వాత ఈ ఐపీఎల్‌లో అత్యంత చెత్త ప్రదర్శనగా నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో రిషబ్ పంత్ ఒకడు. ఈ ఐపిఎల్ ప్రారంభానికి ముందు, అందరి దృష్టి టీం ఇండియా ఆశాజనక వికెట్ కీపర్ రిషబ్ పంత్ పైనే ఉంది. పంత్ కోసం అన్ని జట్ల మధ్య పోటీ నెలకొంది. కానీ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రికార్డు స్థాయిలో రూ.27 కోట్లకు వేలం వేయడం ద్వారా అతనిని తమ ఫ్లీట్‌లో చేర్చుకోవడంలో విజయవంతమైంది. కానీ మైదానంలో ప్రదర్శన విషయానికి వస్తే, పంత్ అందరినీ తీవ్రంగా నిరాశ పరిచాడు. రిషబ్ పంత్ లాగే, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ కూడా ఈ ఏడాది అత్యంత చెత్తగా ఆడాడు. వేలంలో గ్లెన్‌మాక్స్వెల్‌పై నమ్మకం ఉంచి, పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ రూ.4.20 కోట్లకుకొన్నది. కానీ అతను బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఘోరంగా విఫలమయ్యాడు. గాయం కారణంగా వైదొలగడానికి ముందు అతను తన జట్టు తరపున మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడాడు. మహ్మద్ షమీ గాయం తర్వాత తిరిగి వచ్చిన టీం ఇండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి ఈ ఐపిఎల్ 18వ సీజన్ ప్రత్యేకం అంటూ ఏమీ లేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరపున తొమ్మిది మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అతను తొమ్మిది ఇన్నింగ్స్‌లో 56.16 సగటుతో ఆరు విజయాలు మాత్రమే సాధించాడు. ఇక గతేడాదిఅద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్న ఆస్ట్రేలియా యువ బ్యాట్స్‌మన్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ బ్యాట్ కూడా ఈ ఏడాది మాత్రం రాణించలేకపోయాడు. ప్రస్తుత ఐపిఎల్‌లో అతను తన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తరపున మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అతను ఆరుఇన్నింగ్స్‌లో 9.17 సగటుతో 55 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కాగా ఈఏడాది న్యూజిలాండ్ క్రికెట్ జట్టు ఆశాజనక ఆట గాడు రచిన్‌రవీంద్ర ప్రదర్శన కూడా అంతగా లేదనే చెప్పవచ్చు. అతను చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఎనిమిదిమ్యాచ్‌ల్లో ఆడాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లో 27.29 సగటుతో 191 పరుగులు మాత్రమే చేయగలిగాడు.



## ఫార్ములా రేస్ విజేత కుష్ మైనీ
### చరిత్ర సృష్టించిన ఇండియన్

**న్యూఢిల్లీ:** ఫార్ములా ఎఫ్ 2 రేస్-2025 చరిత్రలో తొలిసారి భారతీయుడు చరిత్ర సృష్టించాడు. 25 ఏళ్ల భారత యంగ్ రేసర్ కుష్ మైనీ విజేతగా నిలిచాడు. ఫార్ములా ఎఫ్ 2 స్ప్రింట్ రేసింగ్‌లో విజయం సాధించిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు. మొనాకోలోని కోట్ డి అజుర్‌లో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జామున జరిగిన ఈ స్ప్రింట్ రేసులో కుష్ తొలి స్థానంలో నిలిచాడు. దీంతో, మొనాకోలో టాప్‌లో నిలిచిన ఏకైక భారతీయ రేసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఫార్ములా 2 యొక్క రివర్స్‌గ్రిడ్ నియమం ద్వారా మైనీ స్ప్రింట్ రేసును పోల్ పొజిషన్ నుండి రైడ్ ప్రారంభించి, దాదాపు 30 ల్యాప్‌ల్లో లీడ్‌లో కొనసాగాడు. తన ప్రత్యర్థి గాబ్రియేల్ మినీ నుంచి తీవ్ర పోటీ ఎదురైనప్పటికీ కుష్ నిలకడగా రాణించి, రేసు పూర్తి చేశాడు. అతడు 44:57.63 నిమిషాల్లోనే రైడ్ కంప్లీట్ చేశాడు. ఇక తన విజయం పట్ల కుష్ సంతోషం వ్యక్తం చేశాడు. తనకు మద్దతుగా నిలిచి వారందరికీ ధన్యవాదాలు తెలిపాడు. ఇక ఈ తాజా విజయంతో కుష్ తదుపరి ఫీచర్ పి-10 రేసుకు కూడా అర్హత సాధించాడు. కాగా 2024లో బుడాపెస్ట్ స్ప్రింట్ రేస్‌లో కుష్ మైనీ తన తొలి విజయాన్ని సాధించాడు. అతని విజయం ఎఫ్2 స్ప్రింట్ ఫార్మాట్‌లో అతని మూడవ ప్రచారాన్ని సూచిస్తుంది. ఎంపి మోటార్‌స్పోర్ట్‌తో 2022 ఎఫ్ఐఎ ఫార్ములా 3 డ్రైవర్స్ ఛాంపియన్‌షిప్‌లో 13వ స్థానంలో నిలిచిన తర్వాత ఈ భారత డ్రైవర్ ఫార్ములా 2కి చేరుకున్నాడు. అతని సింగిల్ సీటర్ ప్రయాణం 2016లో ఇటాలియన్ ఎఫ్4తో ప్రారంభమైంది, ఆ తర్వాత 2018లో బ్రిటిష్ ఎఫ్3లో మూడవ స్థానంలో నిలిచింది మరియు 2020లో రన్నరప్‌గా నిలిచింది. ఈ మార్గంలో, మైనీ ఎఫ్3 ఆసియా సిరీస్‌లో కూడా అనుభవాన్ని పొందాడు.

## ఫోర్ నేషన్స్ హాకీ టోర్నీలో.. భారత్ మహిళా టీమ్‌కే రెండో మ్యాచ్
### ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం



**న్యూఢిల్లీ:** నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీలో భారత్ దూసుకుపోతోంది. ఫోర్ నేషన్స్ టోర్నమెంట్‌లో భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన రెండో మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం సాధించింది. అర్జెంటీనాలోని రోసారియోలా జరిగిన ఈ మ్యాచ్‌లో కనికా డబుల్ గోల్స్ సాధించింది. కనికా (46వ నిముషం, 50వ నిముషం) సోనమ్ (21వ నిముషం) భారత్ తరపున గోల్ చేయగా, మిలాగ్రోస్ సీగల్ (3 నిముషం), అగస్టినా మారి (24 నిముషం) ఉరుగ్వే తరపున గోల్స్ చేశారు. ఆట ప్రారంభం నుంచి మూడో నిమిషంలోనే మిలాగ్రోస్ సీగల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచడంతో ఉరుగ్వే తొలి ఆధిక్యంలో నిలిచింది. రెండవ క్వార్టర్‌లో, 21వ నిమిషంలో సోనమ్ పెనాల్టీ కార్నర్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ఈక్వలైజర్‌ను సాధించింది. అయితే, కేవలం మూడు నిమిషాల తర్వాత, అగస్టినా మారి పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేయడంతో ఉరుగ్వే తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ చివరి దశలో కనికా సివాచ్ కీలకమైన బ్రేస్ గోల్స్ చేసి భారత్ విజయం సాధించడంలో సహాయపడింది. ఆమె మొదట 46వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్‌చేసింది, ఆ తర్వాత 50వ నిమిషంలో నిర్ణయాత్మక ఫీల్డ్ గోల్ చేసి విజయాన్ని ఖరారు చేసింది. కాగా భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 27వ తేదీన ఆతిథ్య అర్జెంటీనాతో తలపడనుంది.

## క్వలాండర్స్‌కు పాక్ సూపర్ లీగ్ టైటిల్
### 6 వికెట్ల తేడాతో గ్లాడియేటర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** జింబాబ్వే ఆల్ రౌండర్ సికందర్ రాజా స్టన్నింగ్ ఆటను ప్రదర్శించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో లాహోర్ క్వలాండర్స్ జట్టు తరపున అతను వీరవిహారం చేశాడు. కేవలం 7 బంతుల్లో 22 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వాస్తవానికి పిఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్ కోసం టాస్ వేయడానికి 10 నిమిషాల ముందే అతను లాహోర్ స్టేడియం చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆడిన సికందర్ రాజా బర్మింగ్‌హామ్ నుండి ఆగమేఘాల మీద లాహోర్ చేరుకుని లాహోర్ జట్టుకు టైటిల్ అందించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫైనల్లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన క్వెట్టా గ్లాడియేటర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 రన్స్ చేసింది. ఆ జట్టులో నవాజ్ 76 రన్స్ చేశాడు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన లాహోర్ జట్టుకు మరో బంతి మిగిలి ఉండగా విజయాన్ని అందుకున్నది. లాహోర్ టీమ్‌లో పెరీరా 62, నహీమ్ 46, షఫీక్ 41, రాజా 22 రన్స్ చేశారు. ఆరు వికెట్ల తేడాతో లాహోర్ గెలిచింది. ఈ మ్యాచ్‌లో సికందర్ రాజా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 24 గంటల క్రితం ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఆడిన రాజా ఆ మ్యాచ్‌లో 25 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత 20 ఓవర్ల వరకు బ్యాటింగ్ చేశాడు. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే ఓటమి పాలైంది. కానీ లాహోర్‌లో జరుగుతున్న పీఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్‌తో 3 ఓవర్లలో 47 రన్స్ అవసరమైన దశలో బ్యాటింగ్‌కు దిగిన సికందర్ రాజా బ్రేవ్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరకు 3 బంతుల్లో 8 రన్స్ అవసరమైన టైంలో రెండు బౌండరీలు కొట్టి జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. దీంతో లాహోర్ మూడోసారి టైటిల్ చేజిక్కించుకున్నది.

## వెస్టిండీస్ చేతిలో ఐర్లాండ్ చిత్తు
### మూడో వన్డే సిరీస్ సమం



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ సమం చేసింది. మూడో వన్డేలో డక్ లూయిస్ పద్ధతిన 197 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైంది. డబ్లిన్ వేదికగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 385 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. విండీస్ ఇన్నింగ్స్‌లో ఫస్ట్ డౌన్ బ్యాటర్ కిస్ కార్టీ అద్భుత సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో 142 బంతులు ఎదుర్కొన్న కార్టీ 15 ఫోర్లు, 8 సిక్స్‌లతో 170 పరుగులు చేశాడు. వెస్టిండీస్ బ్యాటర్లలో కార్టీతో పాటు, కెప్టెన్ షాయ్ హోప్ (75), జస్టిన్ గ్రీవ్స్ (50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఐరిష్ బౌలర్లలో బారీ మెక్‌కార్తీ 3 వికెట్లు పడగొట్టగా, లైమ్ మెక్‌కార్తీ 2, మెక్‌బ్రైన్, డకిరల్ తలా వికెట్ సాధించారు. అనంతరం వర్షం కారణంగా 46 ఓవర్లలో ఐర్లాండ్ లక్ష్యాన్ని 365గా నిర్ణయించారు. భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 29.5 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. ఐర్లాండ్ బ్యాటర్లలో కేడ్ కార్మైకేల్ (48) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విండీస్ బౌలర్లలో జైడన్ సీల్స్ 3 వికెట్లు పడగొట్టి ఐర్లాండ్‌ను దెబ్బతీయగా, జోషఫ్, గ్రీవ్స్, ఛేజ్ తలా వికెట్ సాధించారు.

## టయోటా కార్ల విక్రయాలు భేష్

**ముంబై, మే 26:** టయోటా కంపెనీ భారతదేశంలో ఫార్చ్యునర్ కార్లనే ఏకంగా మూడు లక్షల యూనిట్లను విక్రయించింది. 2009లో ప్రారంభమైన ఈ కారు ఆ తర్వాత కాలంలోనే అనేక అప్‌డేట్స్ పొందుతూ వచ్చింది. ఇందులో భాగంగానే 2021లో లెజెండర్ వేరియంట్ విడుదలైంది. అంతకంటే ముందు ఫేస్‌లిఫ్ట్ వేరియంట్స్ కూడా లాంచ్ అయ్యాయి. ఫార్చ్యునర్ ప్రస్తుతం 2.8 లీటర్ డీజిల్, 2.7 లీటర్ పెట్రోల్ అనే రెండు ఇంజిన్ ఎంపికలలో అందుబాటులో ఉంది. డీజిల్ వేరియంట్ 6 స్పీడ్ మాన్యువల్ లేదా 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలను పొందుతాయి. పెట్రోల్ వేరియంట్ 5 స్పీడ్ మాన్యువల్ లేదా స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్స్ పొందుతుంది. లెదర్ సీట్లు, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, క్రూయిజ్ కంట్రోల్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆండ్రాయిడ్ ఆటో అండ్ ఆపిల్ కార్ప్లే కనెక్టివిటీతో కూడిన 8 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, జెబిఎల్ స్పీకర్లు, డ్రైవింగ్ మోడ్‌లు, పార్క్ అసిస్ట్ వంటి ఫీచర్స్ ఫార్చ్యూనర్ కారులో ఉన్నాయి. టయోటా ఫార్చ్యునర్ ధరల విషయానికి వస్తే, పెట్రోల్ 4/2 ఎటి వేరియంట్ ధర రూ.35.37 లక్షలు. డీజిల్ వేరియంట్ ధర 4/2 ఎంటి ధర రూ.36.33 లక్షల నుంచి రూ.51.94 లక్షల వరకు ఉంటుంది.




## లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు..



**ముంబై, మే 26:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో, మెటల్ స్టాక్స్ అండతో సూచీలు వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడ్డాయి. ఈయూతో వాణిజ్య చర్చల గడువును జులై 9 వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో 50 శాతం టారిఫ్‌ల అమలు వాయిదా పడింది. తాత్కాలికంగా అనిశ్చితులు చల్లారడంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. నిఫ్టీ 25 వేల మార్కు ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,928.95 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే జోరును కొనసాగించింది. ఇంట్రాడేలో 82,492.24 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 148 పాయింట్ల లాభంతో 25,001 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.10గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.75 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,332 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## డాలర్ డీలా..రూపాయి పైపైకి

**ముంబై, మే 26:** డాలర్‌తో పోలిస్తేరూపాయి విలువ 40పైసలు పెరిగింది. కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్‌లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యంగా చైనీస్ యువాన్‌లో ర్యాలీ మద్దతు ఇవ్వడంతో రూపాయి ధర పెరిగింది. ఇది ఏడు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. సోమవారం (మే 26)అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 40 పైసలు బలపడి 85.05 వద్ద ప్రారంభమైంది. డాలర్‌లో విస్తృత బలహీనత దేశీయ ఈక్విటీలు బలంగా ఉండటం వంటి కారణాలతో శుక్రవారం (మే 23) నుండి లాభాల వైపు రూపాయి ప్రయాణించింది. భారత కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్‌లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యంగా చైనీస్ యువాన్‌లో మార్పులతో రూపాయి విలువ పెరిగింది. ఇది ఏడునెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. రూపాయి విలువను ఏది నడిపిస్తోంది? ప్రపంచ ఆర్థిక ఆందోళనలు, అమెరికా వాణిజ్యంలో హెచ్చుతగ్గులు కారణంగా డాలర్ ఇండెక్స్ 0.34శాతం తగ్గి 98.67కి చేరుకుంది. డాలర్ విలువ తగ్గడంతో ఆసియా కరెన్సీలు అన్ని చోట్ల లాభపడ్డాయి. చైనీస్ యువాన్ డాలర్‌కు 7.1650కి బలపడి ప్రాంతీయ సెంటిమెంట్‌ను పెంచడంలో సహాయపడింది. ప్రభుత్వానికి ఆర్‌బిఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్ ఆర్థిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా రూపాయికి మద్దతు ఇస్తూనే ఉంది. శుక్రవారం (మే 23) రూ.1,794 కోట్ల నికర ఈక్విటీ కొనుగోళ్లతో బలమైన ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు భారత మార్కెట్లలో పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రపంచ సంకేతాలు, స్థానిక స్థూల డేటా ద్వారా ఈ వారం రూపాయి 84.9085.30 మధ్యలో ఉంటుందని కరెన్సీ వ్యాపారులు భావిస్తున్నారు. ఏప్రిల్ ఐఐపి, క్యూ1 జిడిపి సంఖ్యలతో సహా కీలకమైన దేశీయ డేటా పాయింట్లు ఈ వారం చివరిలో రానున్నాయి. ఇవి స్వల్పకాలిక సెంటిమెంట్‌ను రూపొందించవచ్చు. శుక్రవారం (మే 23) మార్కెట్ పుంజుకున్నప్పటికీ, ఈ నెలలో ఆసియా కరెన్సీలలో రూపాయి బలహీనమైన వాటిలో ఒకటిగా ఉంది. కొరియన్ వోన్, థాయ్ బాట్, ఇండోనేషియా రూపాయి బలమైన లాభాలను నమోదు చేశాయి.ఇక భారతదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.త్వరలోనే జర్మనీని అధిగమించి మూడవ స్థానాన్ని కూడా పొందే అవకాశం ఉందని నీతీ అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం తెలిపారు. నీతీ అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 10వ సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో భారత ఆర్థిక పురోగతిపై పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచంలో మనం నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. భారత్ 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ. భారతదేశం జపాన్ కంటే పెద్దది. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందు ఉన్నాయి. మనం ప్రణాళిక వేసిన, ఆలోచించిన దానికే కట్టుబడి ఉంటే, మనం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి మరో 2 నుండి 3 సంవత్సరాల సమయం మాత్రమే ఉంది అని బీవీఆర్ సుబ్రమణ్యం అన్నారు.



## అధిక-రిస్క్ మొబైల్ నంబర్లపై యుపిఐ లావాదేవీలు బ్లాక్

**ముంబై, మే 26:** భారత ప్రభుత్వం ఒక పెద్ద ప్రకటన చేసింది. ఇప్పటి నుండి అనేక మొబైల్ నంబర్లకు ఆర్‌బిఐ చెల్లింపులు చేయలేరు. దేశంలోని కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆర్థిక మోస ప్రమాద సూచిక సాంకేతికతను ప్రవేశపెట్టింది. ఈ సేవ అన్ని మొబైల్ నంబర్‌లను విశ్లేషిస్తుంది. వాటిలో ఇది అధికరిస్క్ మొబైల్ నంబర్‌లపై యూపీఐ లావాదేవీలను బ్లాక్ చేస్తుంది. దేశంలో ఆర్థిక నేరాలను గుర్తించి నిరోధించడానికి ఈ కొత్త సాధనాన్ని రూపొందించామని ప్రభుత్వం తెలిపింది. దేశంలో సురక్షితమైన ఆర్థిక లావాదేవీలను నిర్ధారించడానికి రూపొందించబడిన ఒక పెద్ద డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో ఈ కొత్త ఆర్‌బిఐ వ్యవస్థ భాగం అని కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు యూపీఐ లావాదేవీల నష్టాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. భారతదేశంలోని మొత్తం యూపీఐ లావాదేవీలలో 90 శాతం ఈ ప్లాట్‌ఫామ్‌లకే పరిమితం అయ్యాయి. ఈ ఎఫ్ఆర్ఐ వ్యవస్థ ప్రాథమికంగా ఏదైనా సైబర్ నేరంలో పాల్గొన్న లేదా ధృవీకరణ ప్రక్రియకు ప్రమోట్ చేయబడని లేదా నియంత్రణ సంస్థ నియమాలను ఉల్లంఘించిన మొబైల్ నంబర్‌లను గుర్తిస్తుందని టెలికాం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సాంకేతికత ఈ సంఖ్యలన్నింటినీ రిస్క్ ఆధారంగా ఈ క్రింది విధంగా విభజిస్తుంది. మీడియం, హై, సీరియస్‌లీ హై. ఈ విభజన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటా ప్రకారం జరుగుతుందని తెలిపింది. ఈ విభజన జాబితా అన్ని వాటాదారులకు రియల్ టైమ్ ప్రాతిపదికన పంపిస్తుంది. ప్రమాదకర మొబైల్ నంబర్లను త్వరగా గుర్తించడం సులభం అవుతుంది. ఒక వ్యక్తి అంత హైరిస్క్ మొబైల్ నంబర్‌లో యూపీఐ లావాదేవీ చేయడానికి వెళితే, ఆ యూపీఐ యాప్ ఆటోమేటిక్‌గా ఆ లావాదేవీలన్నింటినీ ఆపి బ్లాక్ చేస్తుంది. కస్టమర్‌కు మరో హెచ్చరిక సందేశం పంపిస్తుంది. అలాగే యూపీఐ ద్వారా మీడియంరిస్క్ నంబర్‌కు డబ్బు పంపేటప్పుడు కస్టమర్‌లకు హెచ్చరిక సందేశం పంపిస్తుంది. లావాదేవీని మాన్యువల్‌గా పూర్తి చేయమని అడుగుతారు.




## వాణిజ్యం

### ఇండియన్ స్టార్టప్‌తో యమహా జత..

**ముంబై, మే 26:** యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాబోయే యమహా ఈవీకు ఆర్‌వై 01 అనే కోడే నేమ్ కూడా ఉంది. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలు నివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండి కంపెనీ సుమారు 40 మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరి నాటికి లాంచ్ అవుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త



ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్ అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు. డిజైన్ ఫైనల్ అయిన తర్వాత యమహా ఆర్‌వై ఈవీ స్కూటర్‌ను బెంగళూరులోని రివర్ కంపెనీ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఈ స్కూటర్ ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. దీని వల్ల దేశంలో ఉత్పత్తి పరిమాణం పెరుగడంతో ఖర్చులు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.యమహా ఆర్‌వై 01 భారతదేశంలో ప్రారంభిస్తే టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా, బజాజ్ చేతక్, హీరో విడీ వీ1 వంటి ఈవీ స్కూటర్లకు గట్టి పోటినిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.